శుక్రవారం 9-6-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 265
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'


భారత్ ఎదురీత
తొలి ఇన్నింగ్స్‌లో 151 పరుగులకే 5 వికెట్లు.. ఆసీస్ 469కి ఆలౌట్ -13లో


మళ్లీ వృద్ధికే పెద్దపీట
6.5 శాతం వద్దే రెపో రేటు.. వరుసగా రెండోసారి యథాతథం - 13లో


ఈడీ ఎదుట రుజిరా
బెంగాల్‌లో బొగ్గు స్కామ్‌కు సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ భార్య రుజిరాను ఈడీ ప్రశ్నించింది.
వివరాలు 6లో ▸


శాంతితోనే సత్సంబంధాలు
సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతుండగా చైనాతో సంబంధాలను కొనసాగించలేమని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు.
వివరాలు 6లో ▸



'అగ్ని ప్రైమ్' సక్సెస్
కొత్త తరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని ప్రైమ్'ను డీఆర్‌డీవో, ఎలైట్ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ విజయవంతంగా పరీక్షించాయి.
వివరాలు 6లో ▸


కేరళకు నైరుతి రాక
సాధారణం కంటే ఒక వారం ఆలస్యంగా నైరుతి రుతు పవనాలు గురువారం కేరళను తాకాయని వాతావరణ శాఖ ప్రకటించింది.
వివరాలు 6లో ▸

99 శాతం పూర్తి

ప్రమాణ స్వీకారం నుంచే మేనిఫెస్టో అమలుకు సీఎం జగన్ శ్రీకారం

- అవ్వాతాతలకిస్తున్న పింఛన్ పెంపు ఫైలుపై తొలి సంతకం
- తొలి ఏడాదే మేనిఫెస్టోలో 95 శాతం హామీల అమలు
- పూర్తి స్థాయిలో అమలు కానివి మద్య నియంత్రణ, సీపీఎస్ రద్దు
- వీటిలో సీపీఎస్ రద్దు అసాధ్యమని తేలినా... రెండేళ్లుగా కసరత్తు
- చివరకు మెరుగైన పెన్షన్ వచ్చేలా 'జీపీఎస్' అమలుకు పచ్చజెండా
- పాత పెన్షన్ పథకం మాదిరే అన్ని ప్రయోజనాలూ అందేలా కసరత్తు
- ఇప్పటికే దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు
- మద్య నియంత్రణకు వేగంగా అడుగులు.. పలు చర్యలు
- గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిన మద్యం, బీరు విక్రయాలు
- ఈ హామీలను మినహాయిస్తే 99 శాతం అమలు చేసిన సీఎం జగన్



- మేనిఫెస్టోకు అసలైన నిర్వచనం ఇచ్చారంటున్న రాజకీయ విశ్లేషకులు.. ఇంతగా హామీలు అమలు చేయడం దేశ చరిత్రలోనే తొలిసారి
- కరోనా కష్టకాలంలోనూ సంక్షేమాభివృద్ధికే పెద్దపీట
- ఇప్పటిదాకా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లోకి రూ.2.16 లక్షల కోట్లు
- డీబీటీ, నాన్ డీబీటీ కలిపితే పేదలకు రూ.3.10 లక్షల కోట్ల ప్రయోజనం
- సామాజిక అభ్యున్నతిలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్

12 లో

12 నుంచి స్కూళ్లు.. మొదటి రోజే కానుక

రాష్ట్రంలో 43 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక

- 12న సీఎం జగన్ చేతుల మీదుగా విద్యా కానుక కిట్లు పంపిణీ
- ఈ నెల 20న రాష్ట్రస్థాయిలో 'ఆణిముత్యాలు' పురస్కారాలు
- హైస్కూల్ స్థాయిలోనూ విద్యార్థులకు సత్కారం
- 28న తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ
- 8వ తరగతి విద్యార్థులకు డిసెంబర్‌లో ట్యాబ్‌ల పంపిణీ
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యానారాయణ వెల్లడి

- వివరాలు 2లో

'స్థానిక' ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ హవా

- 'పశ్చిమ' జెడ్పీ పీఠంపై గంటా పద్మశ్రీ
- జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం
- మొట్టమొదటిసారిగా బీసీ మహిళకు జెడ్పీ పీఠం.. నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బోడపాటి సుబ్బలక్ష్మి..
- ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాచర్ల లక్ష్మి
- ఆయా జిల్లాల్లో ఎన్నికైన వారందరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారే
- కోరంలేక పలుచోట్ల వాయిదా

10 లో


గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన ఈ-ఆటోల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు, అధికారులు

బడిఈడు పిల్లలు స్కూల్లో ఉండాల్సిందే

విద్యా శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలి
- పది, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు కోరితే తిరిగి ప్రవేశాలు
- మండలానికి రెండు జూనియర్ కాలేజీలు తప్పనిసరి
- అధిక జనాభా ఉన్నచోట రెండు హైస్కూళ్ల అప్‌గ్రేడ్
- ఇంటర్‌లోనూ బైజూస్ కంటెంట్‌కు చర్యలు
- వరుసగా నాలుగో ఏడాది విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు
- నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాతో పరీక్షలు
- అన్ని స్కూళ్లకు ఇంటర్నెట్ దిశగా అడుగులు
- నాడు–నేడు పూర్తయిన స్కూళ్లలో డిజిటల్ బోధన

2 లో

516 ఈ-ఆటోలు ప్రారంభం

క్లీన్ ఏపీ లక్ష్యంగా 36 చిన్న మున్సిపాలిటీలకు పంపిణీ

2 లో

జెండా ఊపి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు

15న నాగ్‌పూర్‌కు తెలంగాణ సీఎం

బీఆర్ఎస్ కార్యాలయ భవన ప్రారంభానికి ఏర్పాట్లు.. వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లో బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యాలయాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 15న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీ మహారాష్ట్ర శాఖకు చెందిన నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. ఇప్పటికే మహారాష్ట్రలో బీఆర్ఎస్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కేసీఆర్ ప్రారంభించగా ప్రస్తుతం క్షేత్రస్థాయిలో 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. జూలై 8 నాటికి సంస్థాగత కమిటీల ఏర్పాటు పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మహారాష్ట్ర నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరుతుండగా తాజాగా మధ్యప్రదేశ్ నుంచి కూడా చేరికలు ప్రారంభమయ్యాయి. చేరికల వేగాన్ని బట్టి జూలైలో మధ్యప్రదేశ్‌లోనూ బహిరంగ సభను నిర్వహించే యోచనలో కేసీఆర్ ఉన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం మేలో ప్రారంభమవగా ఇటీవలే ఏపీలోనూ బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం కావడం తెలిసిందే.

రోడ్డు భద్రతకు మరింత ప్రాధాన్యం

ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- జిల్లాకు ఐదు పోలీస్ స్టేషన్ల చొప్పున ఎంపిక
- మొత్తం 1,300 రోడ్ స్ట్రెచ్‌లపై ప్రత్యేక దృష్టి
- పోలీసు, రవాణా, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త కార్యాచరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త కార్యాచరణకు ఉపక్రమించింది. పోలీసు, ఆర్ అండ్ బి, రవాణా, వైద్య, ఆరోగ్య శాఖలతో కలిసి సంయుక్త కార్యాచరణను చేపట్టింది. అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్న రోడ్లను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో పదేళ్లుగా రోడ్డు ప్రమాదాల గణాంకాలను విశ్లేషించి అందుకోసం శాస్త్రీయంగా కార్యాచరణను రూపొందించి పోలీస్‌స్టేషన్ల వారీగా 2022 నుంచి అమలుకు ఉపక్రమించారు. ఇప్పటికే ఈ కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది. 2022 జనవరి నుంచి మార్చి వరకు రాష్ట్రంలో 5,256 రోడ్డు ప్రమాదాలు సంభవించగా.. ఈ విధానం అమలు తరువాత 2023లో జనవరి నుంచి మార్చి వరకు ప్రమాదాలు 4,600కు తగ్గాయి. దాంతో దీనిని మరింత సమర్థంగా అమలుచేయాలని పోలీసు శాఖ తాజాగా నిర్ణయించింది.

1,300 రోడ్డు స్ట్రెచ్‌ల గుర్తింపు

అత్యధికంగా రోడ్డు ప్రమాదాల కేసులు నమోదవుతున్న జిల్లాకు ఐదు చొప్పున పోలీస్‌స్టేషన్లను గుర్తించారు. ఆ విధంగా రాష్ట్రంలోని 1,098 పోలీస్‌స్టేషన్లలో 26 జిల్లాల పరిధిలోని 130 పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేశారు. వాటి పరిధిలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న 10 రోడ్డు స్ట్రెచ్‌లను గుర్తించారు. అంటే.. ప్రమాదకరమైన మలుపులు, జాతీయ రహదారులను అనుసంధానించే రోడ్లు, పర్యాటక/యాత్ర స్థలాలకు అనుసంధానించే రోడ్లు.. ఇలా మొత్తం మీద 1,300 రోడ్డు స్ట్రెచ్‌లను ఎంపిక చేశారు. ఇక్కడే గత పదేళ్లుగా అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి ఆ రోడ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.

ఇదీ కార్యాచరణ..

- ఆ 1,300 రోడ్ స్ట్రెచ్‌లపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన చర్యలు చేపడుతున్నారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద రోడ్లను వెడల్పు చేయడం, ఆక్రమణలు తొలగించడం, ఇరువైపులా గుబురు పొదలు లేకుండా చూడటం మొదలైన చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రదేశాలకు అటూ ఇటూ ప్రమాద హెచ్చరికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తున్నారు.
- జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖలతో చర్చించి రోడ్ల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టడం ద్వారా బ్లాక్‌స్పాట్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.
- జిల్లాకు ఎంపికచేసిన ఐదు పోలీస్‌స్టేషన్లకు పెట్రోలింగ్ టీమ్‌లను అదనంగా కేటాయిస్తున్నారు. రాత్రివేళల్లో ఆ రోడ్ స్ట్రెచ్‌లలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ప్రత్యేక వాహనాలు, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ లేజర్ గన్‌లు, ఇ–చలానా పరికరాలు, ఇతర మౌలిక వసతులు సమకూరుస్తున్నారు.
- మద్యం తాగి వాహనాలు నడిపేవారు, మితిమీరిన వేగంతో ప్రయాణించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచకుండా కట్టడి చేస్తున్నారు. ఆ ప్రాంతంలో రోడ్ సైడ్ దాబాల ఏర్పాటుకు అనుమతి నిరాకరిస్తున్నారు.
- ఎంపిక చేసిన పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆసుపత్రుల్లో ట్రామా కేర్ సదుపాయాలు, ఇతర అత్యవసర చికిత్స వైద్య వసతులను కల్పిస్తున్నారు. అదనపు అంబులెన్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు.
- ఏదైనా ప్రమాదం సంభవిస్తే సత్వరం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్యం అందించే వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నారు.
- ప్రమాదంలో బాధితులకు ఆసుపత్రికి చేర్చిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. వారికి కేసుల దర్యాప్తుతో నిమిత్తం లేకుండా కూడా వెసులుబాటు కల్పించారు. దాంతో స్థానికులు సత్వరం స్పందించి బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రమాదంలో మృతుల సంఖ్యను కనిష్ట స్థాయికి తీసుకురావాలన్నది సర్కారు లక్ష్యం.

చిత్తూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు



ఉప్పొంగిన ఉద్యోగి

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంత జీవనానికి పూర్తి భరోసా కల్పిస్తూ జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడం తదితరాలపై ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారు. తమ చిరకాల కల నెరవేర్చారంటూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

- వివరాలు 10లో

ఫ్యాక్ట్ చెక్

అసత్యాల్లో నిండా మునిగిన 'ఈనాడు'



నిత్యం విషపు రాతలు రాసే రామోజీ తాజాగా 'నిండా మునిగిన పౌరసరఫరాల సంస్థ' పేరుతో కట్టుకథ అల్లారు. రాష్ట్ర విభజన తర్వాతి లెక్కతో మొదలెట్టి.. మధ్యలోని టీడీపీ పాలనలోని లెక్కల ఎక్కాలను ఎగ్గొట్టి.. ప్రస్తుతం అప్పుల భారం పెరిగిందంటూ.. ప్రతి పేద ఇంటికీ నాణ్యమైన రేషన్ అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై 'ఈనాడు' బురదజల్లే ప్రయత్నం చేసింది.

- వివరాలు 3లో

సీఎం జగన్ గుడివాడ పర్యటన వాయిదా

సాక్షి, అమరావతి: కృష్ణాజిల్లా గుడివాడలో శుక్రవారం (నేడు) జరగాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన వాయిదా పడింది. గురువారం రాత్రి తాడేపల్లిలోని సీఎంవో అధికారులు ఈ విషయం వెల్లడించారు. గుడివాడ మండలం మల్లాయపాలెం గ్రామం వద్ద నిర్మించిన టిడ్కో గృహసముదాయాన్ని సీఎం జగన్ ప్రారంభించాల్సి ఉంది. ఈ కార్యక్రమం ఈ నెల 16వ తేదీకి వాయిదా పడింది.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ప్రత్యేక కేటగిరి

దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలు ఉన్నవారికి ప్రాధాన్యం.. షెడ్యూల్‌లో సవరణలు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటువంటివారి దరఖాస్తులు, వాటితోపాటు సమర్పించే వైద్యుల సర్టిఫికెట్లను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. జిల్లాలో బదిలీలు, అంతర్ జిల్లా బదిలీల కోసం గ్రామ, వార్డు సచివాలయాలశాఖ గురువారం విడుదల చేసిన తాజా షెడ్యూల్ ఇలా ఉంది.

జిల్లాలో బదిలీల షెడ్యూల్

జిల్లాలవారీగా ఖాళీగా ఉన్న పోస్టుల గుర్తింపు:	మే 28
బదిలీలకు దరఖాస్తు చేసేందుకు తుది గడువు:	జూన్ 3
దరఖాస్తుల పరిశీలనకు తుది గడువు :	జూన్ 10
కేటాయించిన మండలాలు,మున్సిపాలిటీలు, తిరస్కరించిన దరఖాస్తుల జాబితా ప్రకటన :	జూన్ 12
బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహణ :	జూన్ 14, 15
కౌన్సెలింగ్‌పై అభ్యంతరాల స్వీకరణ :	జూన్ 15 నుంచి

అంతర్ జిల్లా బదిలీల షెడ్యూల్

జిల్లాలవారీగా ఖాళీగా ఉన్న పోస్టుల గుర్తింపు:	మే 28
బదిలీలకు దరఖాస్తు చేసేందుకు తుది గడువు:	జూన్ 3
దరఖాస్తులను సంబంధిత జిల్లాకు పంపేందుకు గడువు:	జూన్ 9
జిల్లా అధికారులు రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి దరఖాస్తుల సమర్పణ:	జూన్ 10
రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి దరఖాస్తులు కార్యదర్శికి సమర్పణ:	జూన్ 13
బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహణ:	జూన్ 14, 15
కౌన్సెలింగ్‌పై అభ్యంతరాల స్వీకరణ :	జూన్ 15 నుంచి

అరుణ్ పిళ్‌లై బెయిల్ పిటిషన్ కొట్టివేత

తీర్పు ఎమ్మెల్సీ కవిత పేరు ప్రస్తావన

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్‌లై బెయిల్ పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన విషయం విదితమే. కాగా జస్టిస్ నాగ్‌పాల్ గురువారం తీర్పును వెలువరించారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును తీర్పును ప్రస్తావించడం గమనార్హం. 'ఈ కేసులో పిళ్‌లై ప్రధాన నిందితుడిగా ఈడీ ఆరోపిస్తోంది. సౌత్ గ్రూపు తరఫున పలు సమావేశాల్లో పాల్గొన్నారని పేర్కొంది. అడ్వాన్స్ కిక్ బ్యాక్‌ల చెల్లింపుల్లో సౌత్‌గ్రూపు సభ్యుడిగా ప్రమేయం ఉందని, మరీ ముఖ్యంగా తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతినిధిగా, ఇండో స్పిరిట్స్‌లో డమ్మీ పార్ట్‌నర్‌గా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుట్రలో పిళ్‌లై భాగస్వామ్యంపై మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారం ఉందని ఈడీ పేర్కొంది. ఇండోస్పిరిట్స్ రూ.192 కోట్ల లాభాల్లో పిళ్‌లై రూ.32.86 కోట్లు ఆర్జించారని, పెట్టుబడి ఎమ్మెల్సీ కవిత పెట్టారని, కవిత ప్రతినిధిగా ప్రాపర్టీలు కొనుగోలు చేయడంలో కూడా పిళ్‌లై ప్రమేయం ఉందని ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే పిళ్లై 29 సార్లు దర్యాప్తునకు సహకరించారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అన్యాయంగా పిటిషనర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. కానీ ఈడీ అధికారులు హైదరాబాద్‌లో పిళ్‌లై నివాసంపై దాడులు చేసినప్పుడు అతని భార్య, మరికొందరు ఈడీ అధికారులను నియంత్రించారన్న ఆరోపణలున్నాయి. ఇతర నిందితులు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డి, రాఘవ మాగుంట, మనీష్ సిసోడియా తదితరుల రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కొట్టివేశాం. మరోవైపు మనీలాండరింగ్ నేరంలో ఇతర నిందితుల కన్నా పిటిషనర్ పాత్ర చాలా తీవ్రమైనదిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం..'అని జస్టిస్ నాగ్‌పాల్ తీర్పులో స్పష్టం చేశారు.

తెలంగాణ

కాంగ్రెస్‌లోకి పొంగులేటి!

12న ఇతర నేతలతో కలిసి కాంగ్రెస్‌లో చేరికపై ప్రకటన

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలో చేరతారనే దానిపై నెలకొన్న ఉత్కంఠ తొలగనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరుల్లో మెజార్టీ నేతలు కాంగ్రెస్‌లో చేరాలని చేసిన సూచనతో పొంగులేటి సైతం అదే నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సన్నాహాలు చేసుకుంటున్న ఆయన.. తనతో కలిసి వచ్చే ఇతర నాయకులతో కలిసి ఈనెల 12న ఆ పార్టీలో చేరికపై ప్రకటన చేయనున్నారు. పొంగులేటి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల ముఖ్య నేతలతో ఖమ్మంలో సమావేశమవుతున్నారు. ఈ సందర్భంగా మరోసారి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు తెలిసింది.

పీజీ ఈసెట్‌లో 91 శాతం అర్హత

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ పోస్టు-గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన పీజీఈసెట్-2023 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి గురువారం విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 91.48 శాతం అర్హత సాధించినట్టు ఆయన పేర్కొన్నారు. పలు యూనివర్సిటీల పరిధిలో మొత్తం 19 కోర్సులకు 11,914 సీట్లు ఉన్నాయి. పీజీసెట్‌కు 16,563 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 14,882 (89.85 శాతం) మంది పరీక్ష రాశారు. వీరిలో 11,520 మంది అర్హత సాధించారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 2,239 మంది అర్హత సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో 1,158 మంది, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 817 మంది, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 1,388 మంది, ఫార్మసీలో అత్యధికంగా 4,001 మంది అర్హత పొందారు. జీమ్యాట్, గేట్, జీప్యాడ్ పరీక్ష ఫలితాల తర్వాత ఆగస్టులో పీజీ ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని లింబాద్రి తెలిపారు. పీజీఈసెట్‌లో టాప్ ర్యాంకులు పొందిన వారి పేర్లను జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి వెల్లడించారు. కొన్ని బ్రాంచీల్లో వంద మార్కులకు 50 మార్కులు రాకున్నా రాష్ట్ర టాపర్‌గా ర్యాంకులు పొందడం విశేషం. ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌లో జి.దివ్యహంస 47 మార్కులకే టాపర్‌గా నిలిచారు. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో 44 మార్కులతోనే ఎండీ రహిల్ టాప్ ర్యాంకు పొందారు. ఈ బ్రాంచీల్లో పరీక్ష రాసిన వారి సంఖ్య కూడా తక్కువగా ఉంది. ఫలితాల వెల్లడి సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.రవీందర్‌రెడ్డి, కో కన్వీనర్ ప్రొఫెసర్ జె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





516 ఈ-ఆటోలు ప్రారంభం

సాక్షి, అమరావతి : రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్న మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణకు పర్యావరణ హితంగా ఉండే 516 విద్యుత్తు ఆటోలను (ఈ – ఆటోలను) గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ.4.10 లక్షల చొప్పున మొత్తం రూ.21.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన వీటిని 36 చిన్న మున్సిపాలిటీలకు పంపిణీ చేయనున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సీఎం పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. ఆటోల నిర్వహణ, ఇతర విషయాల గురించి సీఎం.. డ్రైవర్లు, అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు స్కూల్లో ఉండాల్సిందే

సాక్షి, అమరావతి : విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా స్కూల్లో చేరాలని, 100 శాతం జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు కోరితే తిరిగి ప్రవేశాలు కల్పించాలని ఆదేశించారు. విద్యాశాఖపై గురువారం క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను గ్లోబల్ స్థాయిలో తీర్చిదిద్దాలని సూచించారు. అందుకు అనుగుణంగా రాష్ట్రంలోని 45 వేల పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి తెచ్చే దిశగా అడుగులు ముందుకు వేయాలని చెప్పారు. మొదటి దశ నాడు-నేడు పూర్తి చేసుకున్న హైస్కూళ్లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రెండు హైస్కూళ్ల చొప్పున అప్‌గ్రేడ్ చేయండి

ఇంటర్ విద్యను పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి జగన్ అధికారులను ఆదేశించారు. అందుకోసం ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు చొప్పున.. ఒకటి బాలికలకు, రెండోది కో ఎడ్యుకేషన్ కోసం ఉండాలన్నారు. జనాభా అధికంగా ఉన్న ఆ మండలంలోని రెండు గ్రామాలు లేదా, పట్టణాల్లో రెండు హైస్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ జూనియర్ కళాశాలలు అందుబాటులోకి రావాలన్నారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్‌లో కూడా బైజూస్ కంటెంట్ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, తర్వాత దశలో ట్యాబుల పంపిణీకి కూడా సన్నద్ధం కావాలన్నారు. ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక అందిస్తున్నామని, విద్యార్థులకు అందించే వస్తువుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ విద్యా కానుక నాణ్యత పరిశీలనకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని సీఎం దృష్టికి తెచ్చారు. నాణ్యత కోసం క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాతో నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 93 శాతం విద్యా కానుక వస్తువులను, పుస్తకాలను నిర్దేశిత కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. రెండో సెమిస్టర్ పుస్తకాలు కూడా ముందుగానే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద, ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్‌లపై నిరంతరం ఫీడ్‌బ్యాక్ తెప్పించుకోవాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా నిరంతరం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ అంశంలో థర్డ్ పార్టీ పరిశీలన ఉండాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. స్కూళ్లల్లో డ్రాపౌట్స్ నివారణకు గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు.



విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతిభా అవార్డుల పరిశీలన

2023లో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభావంతులను ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలతో సత్కరించనుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇవ్వనున్న మెడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను మూడు దశల్లో సత్కరించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను జూన్ 15న, జిల్లా స్థాయిలో జూన్ 17న, రాష్ట్ర స్థాయిలో జూన్ 20న అవార్డులు అందజేయనున్నారు. స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023ను విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా విద్యార్థులకు అందించనున్నారు.



మెడల్స్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధన ప్రవేశపెడుతున్నందున ఉపాధ్యాయులకు వాటి వినియోగంపై శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫ్యాకల్టీలకు శిక్షణ ఇస్తారని, వీరి ద్వారా టీచర్లకు శిక్షణ ఇస్తామని వివరించారు. మరింత మందికి దీనిపై నైపుణ్యం పెంచేలా 20 వేల మంది బీటెక్ స్టూడెంట్స్ ఇంటర్న్‌షిప్ చేస్తారని, వీరు ప్రతి నెలా ఆయా స్కూళ్లకు వెళ్లి టీచర్లకు ఐఎఫ్‌పీ వినియోగంలో సహాయకారిగా ఉంటారని తెలిపారు. ఐఎఫ్‌పీలతో పాటు స్మార్ట్ టీవీల వినియోగం, ట్యాబులు, బైజూస్ యాప్ పైనా టీచర్లకు శిక్షణ ఇస్తామన్నారు. రోజువారీగా, పాఠ్యాంశాల వారీగా బోధనపై స్కూళ్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్లు అందిస్తామని, అన్ని స్కూళ్లలో ఒకేలా బోధన చేపట్టేలా ఇది ఉపయోగపడుతుందని సీఎంకు వివరించారు. ఏపీఎస్ఎఫ్ఎల్, బీఎస్ఎన్ఎల్ ద్వారా స్కూళ్లకు ఇంటర్నెట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలిదశ నాడు-నేడు పూర్తి చేసుకున్న స్కూళ్లలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని, మిగతా స్కూళ్లకు ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబుల నిర్వహణ, వినియోగంపై నిరంతరం సమీక్షలు చేస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఈ బాధ్యత చూస్తున్నారని వివరించారు.

రెండో దశ నాడు-నేడులో 22,224 స్కూళ్లు

మన బడి నాడు-నేడు రెండో దశ కింద చేపట్టిన పనుల ప్రగతిని సీఎం జగన్ సమీక్షించారు. రెండో దశ కింద ఇప్పటికే రూ.3,287.08 కోట్లు ఖర్చు చేశామని, 22,224 స్కూళ్లలో పనులు జరుగుతున్నట్టు అధికారులు వివరించారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తవుతాయన్నారు. నాడు-నేడు కింద పనులు పూర్తి చేసుకున్న స్కూళ్లలో అదే సమయానికి ట్యాబుల పంపిణీతో పాటు, ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌నూ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యా శాఖలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు, వాటి పురోగతిని వివరించారు. ఈ ఏడాది అన్ని తరహా ప్రభుత్వ స్కూళ్లలో 64 మంది విద్యార్థులు టాప్ 10 ర్యాంకులు సాధించారన్నారు. స్కూళ్లలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేలా, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ అమలు చేస్తూ బదిలీలు చేపడుతున్నామని, యూనిట్ టెస్టుల్లో వెనకబడినవారికి మరింత బోధన, శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్ని తరహా ప్రభుత్వ కాలేజీల్లో 27 మంది టాప్ 10 ర్యాంకులు సాధించారని సీఎంకు తెలిపారు.

అకడమిక్ క్యాలెండర్ 2023-24 విడుదల

12న విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో 2023–24 అకడమిక్ క్యాలెండర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఇందులో విద్యా సంవత్సరంలో చేపట్టే ముఖ్యమైన అంశాలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల విధులు, లాంగ్వేజ్ మేళా, లాంగ్వేజ్ క్లబ్, లాంగ్వేజ్ ల్యాబ్స్, లెసన్ ప్లాన్ ఫార్మాట్ అండ్ గైడ్‌లైన్స్, లెర్న్ ఏ వర్డ్ ఏ డే, తెలుగు భాషా వారోత్సవాలు, కల్చరల్ యాక్టివిటీస్‌తో సహా స్కూళ్లలో చేపట్టాల్సిన పలు అంశాలు ఉన్నాయి.

హజ్ యాత్రికులకు సంపూర్ణ సహకారం

- ఏ అవసరం వచ్చినా సంప్రదించండి
- ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం
- రాష్ట్రం, ప్రజల కోసం ప్రార్థించండి
- హజ్ యాత్రికుల సభలో సీఎం జగన్

ఏఎన్‌యూ : ఆంధ్రప్రదేశ్ నుంచి మక్కాకు వెళ్లే హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులోని మదరస ఏ – సిరాజుల్ – ఉలుమాలో ఏర్పాటు చేసిన హజ్ యాత్రా కేంద్రంలో హజ్ యాత్రికులు, ముస్లిం మత పెద్దలతో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్ర చేస్తున్న హాజీలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. హజ్ యాత్రికులకు ప్రయాణంలో, మక్కాలో ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం తరఫున హజ్ కమిటీ సభ్యులను పంపుతోందని చెప్పారు. సోదరుడు, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా నిరంతరం తనతో సంప్రదించి యాత్రికులకు సంబంధించిన అన్ని అవసరాలు తీరుస్తున్నాడని చెప్పారు. మక్కాలో మీరు చేసే ప్రార్థనల్లో రాష్ట్రం, ప్రజలు బాగుండాలని, అల్లా దీవెనలు ఉండాలని గుర్తు చేసుకోవాలని యాత్రికులకు సూచించారు.



హజ్ యాత్రికులు, మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇంత సాయం ఏ సీఎం చేయలేదు

డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ.. ముస్లింలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్రకు సీఎం జగన్ ఎంతగానో సహకరించారని చెప్పారు. ఇలా ఇప్పటి వరకు ఏ సీఎం చేయలేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత హజ్ యాత్రకు వెళ్లడానికి ఏపీలోని ముస్లింలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ప్రధాని మోదీతో మాట్లాడి.. విజయవాడలోనే ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయించారన్నారు. మన పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యేలా మనకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఆయన కంటే రెండింతలు ఎక్కువగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. టికెట్ ధర పెరగడం వల్ల హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం గంటల వ్యవధిలోనే ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో వేసిందని, ఈ ఘనత సీఎంకే చెందుతుందన్నారు. పలువురు మత పెద్దలు ప్రసంగిస్తూ ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటున్న సీఎం జగన్.. ముస్లింల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. పవిత్ర యాత్ర చేస్తున్న హాజీల దీవెనలు సీఎం జగన్‌కు ఉంటాయని పేర్కొన్నారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్‌లాజమ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, ముస్తాఫా, ఎమ్మెల్సీలు రహుల్లా, ఏసురత్నం, గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్ షజీల, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్, మాజీ ఎంపీ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

12 నుంచి స్కూళ్లు.. తొలి రోజే కానుక

- రాష్ట్రంలో 43 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక
- 12న సీఎం జగన్ చేతుల మీదుగా విద్యా కానుక కిట్లు పంపిణీ
- ఈ నెల 20న రాష్ట్రస్థాయిలో 'ఆణిముత్యాలు' పురస్కారాలు
- 8వ తరగతి విద్యార్థులకు డిసెంబర్‌లో ట్యాబ్‌ల పంపిణీ
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతాయని, అదే రోజు దాదాపు 43 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గురువారం విజయవాడలో విద్యా శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యా కానుక కోసం రూ.1,100 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇందులో యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, బ్యాగ్, ఇంగ్లిష్, తెలుగు (బైలింగ్వల్) టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీ, నోటు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరులో సీఎం వైఎస్ జగన్ సోమవారం విద్యా కానుకను లాంఛనంగా పంపిణీ చేస్తారని తెలిపారు. అదే సమయంలో అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యా కానుక కిట్ల నాణ్యతను నాలుగు దశల్లో పరిశీలించామని, ఈ ఏడాది యూనిఫాం కుట్టుకూలిని రూ.10 పెంచి రూ. 45 ఇస్తున్నామన్నారు.

20న సీఎం చేతుల మీదుగా విద్యార్థులకు సత్కారం

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతూ పది, ఇంటర్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించే వేడుక రాష్ట్ర స్థాయిలో 20న సీఎం చేతుల మీదుగా జరుగుతుందని మంత్రి చెప్పారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, హెచ్ఎంలనూ సత్కరిస్తామని చెప్పారు. 15న నియోజకవర్గ స్థాయిలో, 17న జిల్లా స్థాయిలో విద్యార్థులను సత్కరిస్తామన్నారు. వీరితో పాటు టెన్త్‌లో స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులను 12 నుంచి 19 వరకు సత్కరించనున్నట్లు తెలిపారు. మొత్తం 22,768 మంది విద్యార్థులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తామన్నారు.

28న అమ్మ ఒడి

ఈ నెల 28న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ చేస్తామని మంత్రి బొత్స తెలిపారు. 75 శాతం హాజరు ఉన్న విద్యార్థులకే ఈ పథకం వర్తిస్తుందన్నారు. 12 నుంచి సచివాలయాల్లో అర్హుల జాబితా ఉంచుతామని, అభ్యంతరాలను 22 లోపు తెలియజేయవచ్చన్నారు.

పాఠశాల స్థాయిలోనే 'టోఫెల్' శిక్షణ

రాష్ట్ర విద్యార్థులు గ్లోబల్ ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా రాష్ట్రస్థాయిలోనే విద్యార్థులుకు టోఫెల్ శిక్షణ ఇస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఇందుకోసం జిల్లాకు ఇద్దరు ఉపాధ్యాయులను ప్రఖ్యాత అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి పంపి శిక్షణ ఇప్పిస్తామన్నారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు టోఫెల్-ప్రైమరీ, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు టోఫెల్- జూనియర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజు నుంచే గోరుముద్ద పథకం అమలు చేస్తామని మధ్యాహ్న భోజన పథకం సంచాలకులు డాక్టర్ నిధి మీనా తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, పాఠశాలల మౌలిక సదుపాయాల కమిషనర్ కాటమనేని భాస్కర్, ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి ఎంవీ శేషగిరి బాబు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయిన వారికి మరో అవకాశం

టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడం తప్ప పాఠశాల, కాలేజీలకు వెళ్లి చదువుకునే అవకాశం ఇంతవరకు లేదు. అయితే, 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఇలాంటి విద్యార్థులకు మరో అవకాశంగా రెగ్యులర్‌గా అదే తరగతిలో మరోసారి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు మంత్రి బొత్స తెలిపారు. వీరికి ఒక్క ఏడాదే ఈ అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ వర్తిస్తాయని వివరించారు.

క్లుప్తంగా...

ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల పెంపు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 23 శాతం వేతనాన్ని పెంచుతూ గురువారం ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆలమూరి విజయభాస్కర్ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

- బాబు హయాంలో అప్పులు ఈనాడుకు కనిపించలేదా?
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



ఏలూరు టూ టౌన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'ఈనాడు' వేస్టు పేపర్‌లా, టిష్యూ పేపర్‌లా మారిందని, ప్రభుత్వంపై బురద చల్లేందుకే అసత్య కథనాలు ప్రచురిస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో అప్పులు, వేల కోట్లు దారి మళ్లింపుపై ఎందుకు రాయలేదని నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పౌర సరఫరాల శాఖలో మార్పులు చేశారని, రైతులకు మేలు చేసేలా ధాన్యం కొనుగోలులో దళారులు, మిల్లర్ల పాత్ర లేకుండా చేశారని తెలిపారు. రవాణా, గోనె సంచులు, హమాలీ చార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఇటీవలి రబీ సీజన్‌లో ధాన్యంలో నూక శాతం ఎక్కువగా వచ్చినా ఒక్క రూపాయి కూడా కోత లేకుండా రైతులకు మద్దతు ధర మొత్తం చెల్లించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. రబీలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, రూ.28,402 కోట్ల విలువైన 15 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నామని తెలిపారు. అందులో ఇప్పటివరకు రైతులకు రూ.28,200 కోట్లు చెల్లించామని, మిగిలిన రూ.200 కోట్లు సమయంలోగా చెల్లిస్తామన్నారు. జయ బొండాలు ధాన్యాన్ని కేరళ ప్రభుత్వం కోరిక మేరకు మన రైతులు పండించారని, దానిని ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకు కొన్నారనీ, దీనివల్ల లక్ష్య సాధన తగ్గిందన్నారు. 'మార్గదర్శి'లో వేల కోట్లు దారి మళ్లించారని, దీనిపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరినీ ఉపేక్షించేది లేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ అధికారం చేపట్టడం ఖాయమని చెప్పారు. చంద్రబాబువి పగటి కలలేనని ఎద్దేవా చేశారు.

25న విశాఖలో బీసీ గర్జన

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): బీసీ ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పెద్దఎత్తున బీసీ గర్జన నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన గురువారం కాచిగూడలో జరిగిన 34 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో కృష్ణయ్య ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమం నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అన్ని రాజకీయపార్టీల్లోని ఓబీసీ పార్లమెంట్ సభ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసత్యాల్లో నిండా మునిగిన ఈనాడు

ఏపీ పౌర సరఫరాల సంస్థ రుణ భారం పెరిగిపోతోందంటూ కట్టు కథలు	2019 ఎన్నికలకు పసుపు – కుంకుమకు మళ్లించింది రూ.4వేల కోట్లు
	ఆ మొత్తంలో రూ.4,800 కోట్లు బకాయిలు పెట్టిన చంద్రబాబు
	చంద్రబాబు 'అప్పలను' దాచేసి.. ఈనాడు కపట రాతలు
చంద్రబాబు హయాంలో పౌర సరఫరాల సంస్థ చేసిన అప్పు రూ.20వేల కోట్లు	ప్రస్తుత ప్రభుత్వం నాలుగేళ్లలో పౌర సరఫరాల సంస్థ తీసుకున్న రుణం రూ.23,950 కోట్లు
	అందులో రూ.11,800 కోట్లు తిరిగి చెల్లింపు
	పాత ప్రభుత్వంలోని బకాయిలు రూ.2 వేల కోట్లు కూడా చెల్లింపు
తిరిగి బ్యాంకులకు చెల్లించింది కేవలం రూ.300 కోట్లే	ఈ నాలుగేళ్లలో రూ.8,766 కోట్లు సబ్సిడీ చెల్లింపు
	ప్రస్తుతం పౌర సరఫరాల సంస్థ అప్పు రూ.31,600 కోట్లు
	రుణ అనుమతులు రూ.37 వేల కోట్లే!
అప్పట్లో పౌర సరఫరాల సంస్థ నిధులు రూ.10వేల కోట్లు దారి మళ్లింపు	తెలంగాణ పౌర సరఫరాల సంస్థ రుణ భారం రూ.49 వేల కోట్లు
	తెలంగాణలో ఇక్కడున్నటువంటి సంస్కరణలూ లేవు.. అయినా అప్పు ఎక్కువే
	దీనిని ప్రశ్నించని రామోజీ.. ఏపీలో మాత్రం విష ప్రచారం





సాక్షి, అమరావతి: నిత్యం విషపు రాతలు రాసే రామోజీకి వాస్తవం ఏదైనా విరోధే. అధికారంలో మనవాడు ఉంటే అప్పు చేసినా అది లోకకల్యాణం కోసమే.. వేరొకరు అధికారంలో ఉండి అప్పు చేస్తే పెను భూతం.. ఇదే రామోజీ పత్రికా ఫిలాసఫీ. అందుకే గురువారం 'నిండా మునిగిన పౌరసరఫరాల సంస్థ' శీర్షికతో ఈనాడు పత్రిక పౌర సరఫరాల పైనే పనికిమాలిన ఏడుపు కథనం అచ్చేసింది. అసత్యాల కథనాలు అల్లింది. రాష్ట్ర విభజన తర్వాతి లెక్కతో మొదలెట్టి.. మధ్యలోని టీడీపీ కాలం నాటి లెక్కల ఎక్కాలను ఎగ్గొట్టి.. ప్రస్తుతం అప్పుల భారం పెరిగిందంటూ.. ప్రతి పేద ఇంటికీ నాణ్యమైన రేషన్ అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. 'అప్పుల' పేరుతో ఈనాడు రాసిన 'తప్పుడు రాతల' పురాణంలో వాస్తవాలేమిటో చూద్దాం..

ఆరోపణ: పౌర సరఫరాల సంస్థ రుణ భారం పెరిగిపోతోంది

వాస్తవం: 2014–15లో పౌర సరఫరాల సంస్థ అప్పు రూ.6,042 కోట్లు. ప్రస్తుతం అది రూ.31,600. ఇందులో రూ.20 వేల కోట్లు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ గ్యారెంటీలతో చేసిన అప్పు. అందులో బ్యాంకులకు తిరిగి చెల్లించింది. రూ.300 కోట్లు మాత్రమే. ప్రస్తుతం.. ప్రభుత్వ గ్యారంటీలతో పౌర సరఫరాల సంస్థ నాలుగేళ్లలో రూ.23,950 కోట్లు అప్పు తీసుకుంటే అందులో రూ.11,800 కోట్లు తిరిగి బ్యాంకులకు చెల్లించింది. వీటిల్లో టీడీపీ హయాంలో తీసుకున్న రుణాలకు రూ.2వేల కోట్లు ఈ ప్రభుత్వమే చెల్లించడం విశేషం. ఈనాడు రాతల్లో చేసిన అప్పు కనిపిస్తోంది తప్ప.. తిరిగి తీర్చింది చెప్పట్లేదు. వాస్తవానికి పౌర సరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యం కొంటుంది. దానిని మరాడించి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఫ్‌సీఐ ఇస్తుంది. ఇదంతా జరిగి సబ్సిడీ మొత్తం రాష్ట్రానికి వచ్చేసరికి ఆలస్యం అవుతోంది. ఈ సమయంలో రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా ఉండేందుకు బ్యాంకు రుణాలు తీసుకుంటోంది. కేంద్రం నుంచి రావాల్సిన మొత్తం వచ్చిన వెంటనే బ్యాంకులకు తిరిగి చెల్లిస్తోంది.

ఆరోపణ: ప్రభుత్వ గ్యారెంటీలు రూ.42 వేల కోట్లకు చేరాయి

వాస్తవం: పౌర సరఫరాల సంస్థ ప్రస్తుత రుణం రూ.31,600 కోట్లు. వాస్తవానికి రుణాల సేకరణకు ప్రభుత్వ గ్యారెంటీలు రూ.37 వేల కోట్ల వరకు ఉన్నాయి. ఇక్కడ అనుమతించిన దానికంటే తీసుకున్న రుణం తక్కువగా ఉంది. ఈనాడు మాత్రం రూ.37 వేల కోట్ల రుణ అనుమతులు ఉండగా.. ప్రభుత్వం కొత్తగా మరో రూ.5 వేల కోట్లకు అనుమతులు ఇవ్వడంతో రూ.42 వేల కోట్లకు చేరాయని రాసుకొచ్చింది. ఇక్కడ కార్పొరేషన్ రుణం కోసం ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిన తర్వాత ఏడాదిలో వినియోగించుకోకుంటే గడువు ముగిసిపోతుంది. ఆ తర్వాత పౌర సరఫరాల సంస్థ తనకు రుణం కావాల్సి వస్తే.. ప్రభుత్వం పాత గ్యారెంటీల్లో నుంచే ఆ మొత్తాన్ని తీసుకుంటుంది. తాజాగా పౌరసరఫరాల సంస్థలో ప్రభుత్వం అలానే రూ.5 వేల కోట్ల రుణ అనుమతులను తీసుకుంది. దీనిని వక్రీకరిస్తూ ఈనాడు రూ.42 వేల కోట్లంటూ తప్పుడు లెక్కలు చెప్పింది.

ఆరోపణ: ప్రభుత్వం రాయితీ సొమ్ము విడుదల చేయట్లేదు. రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు ఉంటే రూ.900 కోట్లతో సర్దుకోమన్నారు

వాస్తవం: ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థకు నాలుగేళ్లలో పంచదార, కందిపప్పు, బియ్యానికి రూ.8,766.83 కోట్ల సబ్సిడీ చెల్లించింది. గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఒకేసారి రూ.7 వేల కోట్ల వరకు ఇచ్చింది. ఈనాడు మాత్రం 2019–20, 2020–21, 2021–22 లెక్కలను మాత్రమే చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ఇదే కాకుండా రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్లు అధికారంలో ఉండి చంద్రబాబు రాబట్టలేని రూ.1,756.57 కోట్లు మొత్తాన్ని తెలంగాణ నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం కూడా రూ.31,197 కోట్ల సబ్సిడీని ఏపీకి చెల్లించింది.

ఆరోపణ: ధాన్యం బకాయిల కోసం అప్పులు చేస్తోంది. అయినా సమయానికి రైతులకు డబ్బులు చెల్లించట్లేదు

వాస్తవం: రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఆర్బీకేల ద్వారా అత్యంత పారదర్శకంగా ధాన్యం సేకరిస్తోంది. ఈ క్రమంలోనే బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్లో ప్రతి పైసా రైతుకు మద్దతు ధర కల్పించేందుకే ఖర్చు చేస్తోంది. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం రూ.10,001.43 కోట్లు పౌర సరఫరాల సంస్థ సొమ్మును వివిధ కార్యక్రమాలకు దారి మళ్లించింది. అందులో 2019 ఎన్నికలకు ముందు రూ.4 వేల కోట్లు పసుపు–కుంకుమ పథకానికి మళ్లించింది. పౌర సరఫరాల సంస్థ లక్ష్యం చంద్రబాబు ప్రభుత్వానికి అవసరం లేకుండాపోయింది. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.4,800 కోట్లు బకాయిలు పెట్టిపోయింది. వీటిని కూడా ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని తిరిగి పౌర సరఫరాల సంస్థకు చెల్లించింది. తద్వారా సంస్థ ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసింది.

ఇవన్నీ ఈనాడుకు కనిపించవా?

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ నాలుగేళ్లలో రైతులకు సంపూర్ణ మద్దతు ధర అందించేందుకు రూ.58,728.77 కోట్లు ఖర్చు చేసింది. 32,75,790 మంది రైతుల నుంచి 3.10 కోట్ల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇదే టీడీపీ హయాంలో చూస్తే కేవలం 18 లక్షల మంది రైతుల నుంచి రూ.43 వేల కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వాస్తవంగా టీడీపీ ఐదేళ్ల పాలనలో కంటే వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ఎక్కువ మంది ధాన్యం రైతులకు మద్దతు అందించడం విశేషం. మద్దతు ధరతో పాటే ప్రతి ఖరీఫ్ సీజన్‌లో రూ.400 కోట్లు గోనె సంచులు, రవాణా, హమాలీ ఖర్చుల కింద రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. వీటితో పాటు కరోనా సమయంలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద రాష్ట్రంలోని రైస్ కార్డుదారులకు ఏప్రిల్ 2019 నుంచి సెప్టెంబర్ 2022 వర కు ఉచిత బియ్యం పంపిణీ కోసం ఏకంగా రూ.6,329.20 కోట్లు అదనంగా ఖర్చు చేసి పేదలను ఆదుకుంది. వీటితో పాటు ప్రతి నెలా నాణ్యమైన బియ్యం ఇంటింటికీ పంపిణీ కోసం రూ.1,146 కోట్లు, బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, పంచదార ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలోనూ వాటిని సబ్సిడీపై అందించినందుకు రూ.2,727.82 కోట్లు, వంట నూనె పంపిణీకి రూ.126 కోట్లు అదనంగా ఖర్చు చేసింది. సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలకు బియ్యాన్ని నేరుగా సరఫరా చేస్తోంది. వీటన్నింటికీ కలిపి సుమారు రూ.10,329.02 కోట్లు అదనపు భారాన్ని మోస్తోంది. ఇంత పెద్ద ఎత్తున రైతులకు, పేదల సంక్షేమానికి పని చేస్తున్న ఏపీ ప్రభుత్వంలోని పౌర సరఫరాల సంస్థ రుణ భారం రూ.31,600 కోట్లు ఉంటే... ఇలాంటి సంస్కరణలు లేని.. ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణలో మాత్రం ఆ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అప్పు ఏకంగా రూ.49 వేల కోట్లు ఉండటం గమనార్హం. తెలంగాణలోనూ ఈనాడు పత్రికను నడిపిస్తున్న రామోజీ.. అక్కడ నోరెత్తకుండా.. ఏపీలో మాత్రం గుండెలు బాదుకోవడం ఎల్లో ఏడుపునకు నిదర్శనం.

క్రీడల్ని ప్రోత్సహించేందుకు పటిష్ట కార్యక్రమం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెల్లడి
- సీఎంను కలిసిన చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్, క్రికెటర్ అంబటి రాయుడు
- వారిని అభినందించిన ముఖ్యమంత్రి



సీఎం జగన్‌ను కలిసిన క్రికెటర్ అంబటి రాయుడు

సాక్షి, అమరావతి: ఇటీవల ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మేనేజ్‌మెంట్, క్రికెటర్ అంబటి రాయుడు గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎస్‌కే టీమ్‌ను సీఎం జగన్ అభినందించారు. రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా క్రీడల్ని ప్రోత్సహించేందుకు తాను ఆసక్తిగా ఉన్నట్లు క్రికెటర్ అంబటి రాయుడు సీఎం జగన్‌కు వివరించారు. సీఎం జగన్ స్పందిస్తూ.. ఇందుకు తగిన పటిష్ట కార్యక్రమాన్ని రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఐపీఎల్ ట్రోఫీని సీఎస్‌కే ఫ్రాంచైజీ ఓనర్ ఎన్.శ్రీనివాసన్ కుమార్తె రూపా గురునాథ్, అంబటి రాయుడు ముఖ్యమంత్రికి చూపించారు. సీఎస్‌కే టీమ్ సభ్యుల ఆటోగ్రాఫ్‌లతో కూడిన జెర్సీని ముఖ్యమంత్రికి వారు బహూకరించారు.

సీఎంసీకి ప్రభుత్వ సహకారం

- వేలూరు, చిత్తూరు క్యాంపస్ ప్రతినిధుల బృందంతో సీఎం జగన్
- చిత్తూరులో 300 పడకల ఆస్పత్రిగా త్వరలో విస్తరణ
- మెడికల్, నర్సింగ్, అనుబంధ కోర్సుల కళాశాలల ఏర్పాటు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వేలూరు, చిత్తూరు సీఎంసీ క్యాంపస్‌ల ప్రతినిధుల బృందం

సాక్షి, అమరావతి: చిత్తూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ)కి ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహకారం ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆ కళాశాల వేలూరు, చిత్తూరు క్యాంపస్ ప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. సీఎంసీ వేలూరు ఆస్పత్రికి అనుబంధంగా ఏపీలో ఉన్న చిత్తూరు క్యాంపస్ అభివృద్ధి గురించి ముఖ్యమంత్రితో చర్చించారు. మెడికల్ సెంటర్‌తో కూడిన మెడికల్ కాలేజ్, ఆస్పత్రి, నర్సింగ్ కాలేజ్, ఆరోగ్య సేవలకు అనుబంధంగా ఉండే కోర్సులతో కూడిన కాలేజ్‌ల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సీఎంసీ ద్వారా అత్యుత్తమ వైద్య సేవలు ఏపీ ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని, ఏపీ ఆరోగ్య రంగంలో ఇదొక గొప్ప విజయంగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికే చిత్తూరులో నిర్వహిస్తున్న సెకండరీ కేర్ ఆస్పత్రిని.. అతి త్వరలో 300 పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని సీఎంసీ బృందం సీఎంకు వివరించింది. ఈ సమావేశంలో సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, సీఎంసీ డైరెక్టర్ డా.విక్రమ్ మాథ్యూస్, మాజీ డైరెక్టర్ డా.సురంజన్ భట్టాచార్య, ప్రిన్సిపాల్ డా.సోలోమన్ సతీష్ కుమార్, సీఎంసీ చిత్తూరు క్యాంపస్ అసోసియేట్ డైరెక్టర్ డా.కెన్నీ డేవిడ్, ఇతర ప్రతినిధులు డా.జాయ్ మమ్మెన్, నిర్మలా మార్గరేట్, హెప్సీ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ భూతానికి విద్యుత్ ఉద్యోగి బలి

అప్పులపాలై ఆత్మహత్య



మహా లింగం(ఫైల్)

ఒంగోలు టౌన్: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులోని రామ్‌నగర్ విద్యుత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న అంబటి మహాలింగం ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటయ్యారు. దీంతో జీతం చాలక అప్పులు చేయాల్సి వచ్చింది. ఆ అప్పు తీర్చడానికి దొరికినచోటల్లా అప్పు చేశారు. బెట్టింగ్‌ను మాత్రం మానుకోలేదు. భార్య, బంధువులు వారిస్తున్నా బెట్టింగ్ వ్యసనం నుంచి బయటపడలేకపోయారు. అప్పు తీరే మార్గం లేక గురువారం ఇంట్లో సీలింగ్ హుక్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి భార్య సుశీల, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సమావేశంలో విజయసాయిరెడ్డి పిలుపు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ ఎస్సీ, ఎస్టీ, రైతు విభాగాలు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కార్మిక పక్షపాత ప్రభుత్వమని, కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. కార్మిక సంఘాలను సంఘటితం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చెయ్యాలని కోరారు. గిరిజనులు ఎక్కువ శాతం ఉన్న ప్రాంతాలలో వారికే ఎక్కువ పదవులు కేటాయిస్తామని చెప్పారు. 44 అసెంబ్లీ స్థానాలలో గిరిజనులు ఎక్కువ ఉన్నారని, ప్రభుత్వం నుండి వారికి అందుతున్న లబ్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రతి గిరిజనుడుకి వివరించాలని కోరారు. దళితులకు ఈ ప్రభుత్వంలో పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ విషయాన్ని ప్రతి ఇంటికీ తెలియజేయాలని చెప్పారు. జోనల్, జిల్లా స్థాయి కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చెప్పారు. అందుకోసం ఎమ్మెల్యేలు, సమన్వయ కర్తలతో వచ్చే సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. గుంటూరులో మిర్చి బోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొద్దామని చెప్పారు. రాష్ట్ర ఎస్సీ విభాగానికి మరో అధ్యక్షుడిగా రెల్లి సామాజిక వర్గానికి కూడా పదవి ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు, పార్టీ ఎస్సీ విభాగం మరో అధ్యక్షుడు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం అధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి, గిరిజన విభాగం అధ్యక్షుడు ఎం.హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలతో భారీగా ఉద్యోగ కల్పన

- నాలుగేళ్లలో 1,05,889 మందికి ఉద్యోగాలు
- ఈ ఏడాది కనీసం 30,000 మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- మంగళవారం, శుక్రవారాల్లో జాబ్‌మేళాలు నిర్వహించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రణాళిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా యువతకు స్థానికంగానే పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. గత నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 987 జాబ్‌మేళాలు నిర్వహించి.. 1,05,889 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఈ ఏడాది కూడా 286 జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా కనీసం 30,000 మందికి ఉద్యోగాలు లభించే విధంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్రంలో సుమారు 200 కంపెనీలను గుర్తించి వారికి అవసరమైన మానవ వనరులను అందించే విధంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. ఇందుకోసం మినీ జాబ్‌మేళా, జాబ్‌మేళా, మెగా జాబ్‌మేళాలు నిర్వహించనుంది. రాష్ట్రంలో ప్రతి మంగళవారం మినీ జాబ్‌మేళా, శుక్రవారం జాబ్‌మేళా, ప్రతి మూడు నెలలకు ఒకసారి జోన్ పరిధిలో మెగా జాబ్‌మేళా నిర్వహించే విధంగా క్యాలెండర్ సిద్ధం చేసింది. ఇంటర్‌లోపు విద్యార్హత ఉన్న వారికి ఉద్యోగాల కల్పన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 192 స్కిల్ హబ్స్ ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతి మంగళవారం నిర్వహించే మినీ జాబ్‌మేళాల ద్వారా ఉపాధి కల్పించనుంది. మూడు, నాలుగు కంపెనీలకు మానవ వనరులు అవసరం కాగానే మినీ జాబ్‌మేళా, కనీసం 10 కంపెనీలకైతే జాబ్‌మేళా నిర్వహిస్తారు. ఇవి కాకుండా జోన్ పరిధిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి కనీసం 50 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు.

జాబ్‌మేళాలతో వివిధ సంవత్సరాల్లో కల్పించిన ఉద్యోగాలు	సంవత్సరం	జాబ్‌మేళాల సంఖ్య	కల్పించిన ఉద్యోగాలు
	2019-20	350	28,655
	2020-21	122	14,603
	2021-22	359	38,650
	2022-23	156	23,981
	మొత్తం	987	1,05,889

జీపీఏ హోల్డర్ పన్ను ఎగవేసినా ఆస్తిని రిజిస్టర్ చేయాలి

- ఆస్తి జీపీఏ హోల్డర్‌ది కానప్పుడు రిజిస్ట్రేషన్‌కు నిరాకరించకూడదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత తీర్పు
- డాక్యుమెంట్లను రిజిస్టర్ చేసి విడుదల చేయాలని ఆదేశం



సాక్షి, అమరావతి: జీపీఏ హోల్డర్ ఆదాయ పన్ను ఎగవేశారన్న కారణంతో అసలు యజమానికి చెందిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించడం చట్ట విరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ ఆస్తి జీపీఏ హోల్డర్‌ది కానప్పుడు రిజిస్ట్రేషన్‌కు నిరాకరించకూడదని చెప్పింది. ఆ భూములు నిషేధిత భూముల జాబితా (సెక్షన్ 22ఏ)లో కూడా లేవని, అలాంటప్పుడు రిజిస్ట్రేషన్ చేయకపోవడం చట్ట విరుద్ధం, ఏకపక్ష నిర్ణయమని స్పష్టం చేసింది. పిటిషనర్లు సమర్పించిన డాక్యుమెంట్లను రిజిస్టర్ చేసి, విడుదల చేయాలని విశాఖపట్నం జిల్లా సబ్బవరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత ఇటీవల తీర్పు వెలువరించారు.

విశాఖ జిల్లా పెదగంట్యాడకు చెందిన జానపరెడ్డి వెంకట భారతి అనకాపల్లి జిల్లా రేబాకలో తనకున్న 2.50 ఎకరాలకు మర్రిపాలేనికి చెందిన నెట్టిమి ఉదయ భాస్కర్‌కు జీపీఏ ఇచ్చారు. ఈ భూమిలో 5,402 చదరపు గజాలు నీలంశెట్టి మల్లమ్మకు, 3,418 చదరపు గజాలు కోడూరు రూపకు 2014 సెప్టెంబర్‌లో జీపీఏ హోల్డర్ ద్వారా భారతి విక్రయించారు. అయితే సబ్బవరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వారి డాక్యుమెంట్లను విడుదల చేయలేదు. దీంతో 2015 జూలైలో మల్లమ్మ, రూప జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ స్థలాల రిజిస్ట్రేషన్ నిలిపివేశామని, ఆదాయ పన్ను శాఖ ఆమోదం లభించిన తరువాతే రిజిస్ట్రేషన్ చేస్తామని సబ్ రిజిస్ట్రార్ వారికి లేఖల ద్వారా తెలిపారు. దీనిని సవాలు చేస్తూ రూప, మల్లమ్మ 2015లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది ఎం.శివకుమార్ వాదనలు వినిపిస్తూ.. ఆదాయ పన్ను శాఖ జప్తు చేసిన ఉదయ భాస్కరరావు ఆస్తులు తాము కొన్న భూములు కూడా ఉన్నాయని తెలిపారు. 2014 సెప్టెంబరు 11న తాము రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్లు సమర్పించగా, అధికారులు ఆ నెల 29న జప్తు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఆదాయ పన్ను శాఖ జప్తు ఉత్తర్వుల కాల పరిమితి 2 సంవత్సరాలేనని, వాటిని అడ్డంపెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ తమ డాక్యుమెంట్లను రిజిస్టర్ చేయకుండా అట్టిపెట్టుకోవడం చెల్లదన్నారు. ఆదాయ పన్ను శాఖ తరఫున సీనియర్ న్యాయవాది కె.రాజిరెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్లు కొన్న భూములు నిషేధిత జాబితాలో లేవని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

మహిళా పారిశ్రామిక వేత్తలకు మెళకువలు నేర్పేలా ఏడబ్ల్యూఈ

- తెలంగాణ సహా ఏపీ, ఒడిశాల్లో ఏర్పాటు
- యూఎస్ కాన్సులేట్, కేఐఐటీ, టీబీఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- భారత ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర పెంచడమే మా లక్ష్యం: యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సాక్షి, హైదరాబాద్: మహిళలను తాము ఎంచుకున్న అంశాల్లో విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారం అందించే అకాడమీ ఫర్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్(ఏడబ్ల్యూఈ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్‌తోపాటు కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(కేఐఐటీ), టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్ (టీబీఐ) సంయుక్త సహకారంతో నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను యూఎస్ డిపార్టమెంట్ ఆఫ్ స్టేట్ గ్రాంటుల నుంచి వినియోగించున్నారు. ఈ సందర్భంగా యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ, ' మహిళలు తమ వ్యాపారాలను లాంఛనప్రాయంగా మార్చుకోవడానికి, భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మరింత చురుకైన భాగస్వాములు కావడానికి సహాయం చేయడం యూఎస్ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటి' అని పేర్కొన్నారు. ''ఏడబ్ల్యూఈ లో పాల్గొనేవారి జీవితాల్లో ఎంత గొప్ప ప్రభావాన్ని చూడబోతున్నారు. ఇది నా వ్యక్తిగత అనుభవం ద్వారా నాకు తెలుసు. తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఏడబ్ల్యూ ఈ నిర్వహణలో కేఐఐటీ–టీబీఐ , మా స్థానిక భాగస్వాములతో కలిసి రాబోయే నెలల్లో పని చేయడానికి మేము ఎదురుచూస్తున్నాం' అని వెల్లడించారు.

ఏడబ్ల్యూఈ అంటే..:

ఏడబ్ల్యూఈ (అకాడమీ ఫర్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్) అనేది మహిళా వ్యాపారవేత్తలకు వారి వ్యాపారాలను ఆధునీకరించుకోవడానికి, అభివృద్ధి చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు రూపొందించిన కార్యక్రమం. దీనిలో ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్ ఫాం ద్వారా స్థానిక వ్యాపార నాయకులు, అమెరికాకు చెందిన నిపుణులతో వ్యూహాత్మక ప్రణాళిక, మార్కెటింగ్, ప్రధాన వ్యాపార నైపుణ్యాలు తదితర అంశాలపై చర్చా కార్యక్రమాలు ఉంటాయి. దీనిలో మొత్తం 13 రకాల ఆన్‌లైన్ వ్యాపార మాడ్యూళ్లను ఉచితంగా ఆన్‌లైన్ విధానంలో నేర్పుతారు. వరంగల్, భువనేశ్వర్, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఒక్కో నగరం నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఇందులో అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. మరింత సమాచారం కోసం https://awe.kiitincubator.inలో చూడవచ్చు.

> ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, దైవభీతి గలవారు చెలమలు గల స్వర్గవనాలలో ఉంటారు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 9 జూన్ 2023

అందీ అందని మేఘసందేశం

వాన రాకడ... ప్రాణం పోకడ చెప్పలేమంటారు. చిత్రంగా ఏటా నిర్ణీత సమయానికి వచ్చే తొలకరి చినుకుల రాకడ కూడా ఇప్పుడు దాదాపు అలాగే తయారవుతోంది. నైరుతి ఋతుపవనాలు సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకుతాయి. అయితే, ఈసారి అంతకన్నా ముందుగా మే 27 నాటికే ఋతుపవనాలు వస్తాయంటూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కొంతకాలం క్రితం అంచనా వేసింది. ఆ తర్వాత జూన్ 4 అంటూ కొత్త అంచనా చెప్పింది. తీరా అసలుకే లెక్క తప్పి, జూన్ 7 దాటినా చినుకు జాడ లేకపోవడం గమనార్హం. ఇక, తాజాగా అరేబియా సముద్రంలో ఏర్పడ్డ వాయుగుండం 'బిప్రజయ్' సైతం ఈసారి ఋతుపవనాలపై దుష్ప్రభావాన్ని చూపనున్నట్టు తాజా వార్త. అసలే వారానికి పైగా ఆలస్యమైన వానలకు ఇది ఊహించని అవరోధం. తొలకరి చినుకును శాస్త్రీయంగా అంచనా వేయడంలో తప్పుతున్నామా, లేక పర్యావరణంలో మార్పులతో పూర్తిగా లెక్కలే మారిపోతున్నాయా అన్నది ఇప్పుడు జవాబు వెతకాల్సిన ప్రశ్న.

ఋతుపవనాలు వాతావరణ అంశమే కావచ్చు. కానీ భారత ఆర్థికరంగానికి అది అత్యంత కీలకం. దేశానికి 'అసలైన' ఆర్థికమంత్రి ఋతుపవనాలే అని ఓ మాజీ రాష్ట్రపతి గతంలో వ్యాఖ్యానించారు. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతానికి పైగా అందించే నైరుతి ప్రాధాన్యానికి ఆ వ్యాఖ్యలే మచ్చుతునక. బిప్రజయ్ దెబ్బతో ఋతుపవనాలు బలహీనమై, వాటి రాకకు మరో 48 గంటలు పట్టవచ్చని శాస్త్రవేత్తల హెచ్చరిక. వరుసగా రెండు రోజులు లక్షద్వీప్, కేరళ, కోస్తా కర్ణాటకలో వానలు కురిస్తేనే ఋతుపవనాలు వచ్చినట్టు లెక్క. ప్రస్తుతం కేరళలో కురుస్తున్న వానలు వాయుగుండం ప్రభావంతోనేనట. పైగా నలుమూలల ఋతుపవనాలు విస్తరించడానికి మరింత సమయం పడుతుందంటున్నారు. కారణాలేమైనా – ఈ జాప్యంతో, బలహీనమైన వానలతో ఈ జూన్‌లో పడాల్సిన వర్షపాతం తగ్గడం అనివార్యం. దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ) వర్షపాతం కనీసం 20 శాతం తగ్గుతుందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంటోంది. ఈ జాప్యాల నడుమ పొలం పనులు కనీసం వారం రోజులు వెనక్కి వెళ్ళకా తప్పదు. వెరసి ఇది ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు.

అసలే ఈ ఏడాదీ వేసవిలో ఎండలు దంచేస్తున్నాయి. ఉష్ణపవనాల తాకిడి ఉండనే ఉంది. ఫలితంగా ఈసారి వర్షపాతం సాధారణం కన్నా తక్కువుంటుందని స్కైమెట్ జోస్యం. కొద్ది నెలల క్రితమే చెప్పిన ఈ జోస్యం నిజమై, జూన్ – సెప్టెంబర్‌ల మధ్య సాధారణ వర్షపాతంలో 94 శాతమే కురిస్తే చిక్కులు తప్పవు. ఆసియాలోని మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన మనం ఇరుకున పడతాం. వరి, చెరకు లాంటి పంటల దిగుబడి తగ్గి, ఆహార ధరలు అమాంతం పెరుగుతాయి. గమనిస్తే – నిరుడు మార్చిలో శతాబ్ద కాలంగా ఎన్నడూ లేనంతటి ఉష్ణోగ్రత, ఉడుకెత్తించిన ఉష్ణపవనాల వల్ల గోధుమల ఉత్పత్తి తగ్గింది. కొన్ని ఎగుమతులపై నిషేధం తప్పలేదు. ఈసారీ వ్యావసాయిక ఉత్పత్తులు తగ్గితే కష్టమే. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా హెచ్చి, ఖజానాపై భారం పడుతుంది. కోట్లాది సామాన్యులకు కడుపు నిండా తిండి కష్టమవుతుంది.

నిజానికి, ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలలు మనకు నైరుతి ఋతుపవనాల కాలం. వార్షిక వర్షపాతంలో అత్యధికం ఈ సీజన్‌లో కురిసేదే. అందుకే, మన దేశంలో సాంస్కృతికంగానే కాక ఆర్థిక కాలపట్టికలోనూ ఈ ఋతుపవనాలు కేరళను తాకే రోజుకు ప్రత్యేక స్థానం ఉంది. గత పదేళ్ళలో 2018లో, 2022లో ఋతుపవనాలు ముందుగానే వచ్చాయి. గత ఏడాది మే 29కే తొలికరి కురిసింది. అలాగే, గత దశాబ్దిలో అతి ఆలస్యంగా వానలు మొదలైంది 2019లో. ఆ ఏడాది జూన్ 8న కానీ పుడమి తడవలేదు. ఈసారి జాప్యంలో ఆ రికార్డు బద్దలవుతున్నట్టుంది. ఈ ఆలస్యానికీ, ముందస్తుగానే ముగిసిపోవడానికీ ఎల్ నినో లాంటివి కూడా కారణమని శాస్త్రజ్ఞుల ఉవాచ. ఈ వాతావరణ మార్పుల మధ్య ఋతుపవనాల జోస్యం తప్పకూడదంటే, సమర్థంగా లెక్కలు కట్టాలి.

ఐఎండీ పరిశోధకులు పదేళ్ళ పైగా శ్రమించి, ఏటా ఎప్పుడు, ఎంత వర్షం పడుతుందని అంచనా వేసేందుకు కొత్త విధానం రూపొందించారు. కచ్చిత అంచనాలందించే విధాన రూపకల్పన కోసం 2012లో ఏర్పాటైన నేషనల్ మాన్‌సూన్ మిషన్ సైతం ఫలితమిస్తోంది. చారిత్రక విధానాలపై కాక, అప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే పద్ధతిని అది ప్రవేశపెట్టింది. దానితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 10 వాతావరణ నమూనాలను పరిగణనలోకి తీసుకొని, విస్తృత సమాచారాన్ని సేకరించి, పరీక్షించి, దక్షిణాసియా వాతావరణానికి సరిపడే నాలుగైదింటిని ఖరారు చేసే శ్రమతో కూడిన పని సాగుతోంది. ఇక, 2016లో ఆమోదించిన కొత్త నిర్వచనాలు, పరామితుల ఆధారంగా ఐఎండీ ఋతుపవనాల రాకను మునుపటి కన్నా మెరుగ్గా అంచనా కట్టి ప్రకటిస్తోంది.

ఇంత చేసినా ప్రతి జూన్‌లో కచ్చితమైన అంచనా కట్టలేకపోతున్న వానల వ్యవహారం చూస్తుంటే, మరింత లోతైన అధ్యయన అవసరం కనిపిస్తోంది. పరిశోధనలు పెరగాల్సిన అగత్యం అర్థమవుతోంది. వాతావరణ మార్పులతో ఉక్కిరిబిక్కిరవుతున్న భారత్‌కు అంచనాల్లో కచ్చితత్వం కీలకం. దీనితోనే రైతులకు మార్గదర్శనం, పంటల సంరక్షణ వీలవుతుంది. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలతో ఇతర సముద్రాల కన్నా వేగంగా హిందూ మహాసముద్రం వేడెక్కుతోంది. ఫలితంగా భూ, సముద్ర ఉష్ణోగ్రతల మధ్య తేడా తగ్గిపోతోంది. అంటే, రానున్న ఏళ్ళలో ఋతుపవనాలు మరింత జాప్యమవుతాయని విశ్లేషణ. మారుతున్న పర్యావరణంతో వాన, వాతావరణంపై కచ్చితమైన జోస్యం చెప్పడం సవాలే. కానీ, ఏ సవాలుకైనా శాస్త్ర విజ్ఞానం, సమగ్ర పరిశోధనలే పరిష్కారం కదా!

అనివార్య వ్యూహాత్మక భాగస్వాములు

విశ్లేషణ



లెఫ్టినెంట్ జనరల్ అనిల్ అహూజా (విశ్రాంత)

అమెరికా రక్షణ మంత్రి మొన్న భారత్ వచ్చారు. ప్రధాని మోదీ అమెరికా వెళ్లనున్నారు. ఇరుదేశాల సంబంధాలు ప్రస్తుతానికి ఏకీభావంతోనే నడుస్తున్నాయి. అయితే అమెరికాలోని ఒక వర్గం వ్యూహకర్తలు ఈ భాగస్వామ్యాన్ని బలహీన పరిచే అంశాలను ఎత్తిచూపుతున్నారు. చైనా దూకుడుకు చెక్ పెట్టడంలో భారత్ క్రియాశీల భాగస్వామిగా ఉండాలని అమెరికా ఆశిస్తోందని వారు అంటున్నారు. ఉక్రెయిన్ ఘర్షణలో రష్యాకు బదులుగా పాశ్చాత్య దేశాల వైపు భారత్ నిలబడాలని సలహా ఇచ్చారు. భాగస్వామికీ, మిత్రపక్షానికీ తేడా ఉంది. అమెరికా, భారత్ వ్యూహాత్మక భాగస్వాములు. ఒకరిపై ఒకరు ఆధారపడాల్సిన అవసరముందని ఇరు దేశాలూ గ్రహించాలి. ఇరువురి జాతీయ అవసరాలను గుర్తించగలిగితే సంబంధాలు బలపడతాయి.

అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు సమాంతర పట్టాలపైన ఏకీభావంతోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో హిరోషిమాలో కలుసుకున్న తీరు, అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ జూన్ 4, 5 తేదీల్లో భారత్‌కు విచ్చేసిన వైనం (2021లో బాధ్యతలు చేపట్టాక ఆయన రెండో సారి రావడం), ఈ నెల చివరలో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించనుండటం... ఈ మూడింటినీ పరిగణనలోకి తీసుకుంటే ద్వైపాక్షిక సంబంధాలు సరైన దిశలోనే సాగుతున్నట్లు అర్థమవుతుంది.

అమెరికాలోని ఒక వర్గం వ్యూహకర్తల నుంచి వస్తున్న సంకేతాలు, ఈ భాగస్వామ్యాన్ని బలహీన పరిచే అంశాలను ఎత్తిచూపుతున్నాయి. 'ఫారిన్ ఎఫైర్స్'లో ఇటీవల ప్రచురితమైన కథనం... చైనా ఏకపక్ష దూకుడుకు చెక్ పెట్టే ప్రయత్నాల్లో భారత్ క్రియాశీల భాగస్వామిగా ఉండాలని అమెరికా ఆశిస్తోందని చెబుతోంది. ఈ అంచనా అంత సరైంది కాదు. అమెరికా, చైనా ఘర్షణల్లో వేలుపెట్టేందుకు భారత్ ఏమాత్రం సిద్ధంగా లేదు. దీనివల్ల తమ భద్రతకు ముప్పు అని భారత్‌కు తెలుసు. వ్యూహాత్మక, సాంకేతిక పరిజ్ఞాన భాగస్వామ్యానికి భారత్ తగినది కాదన్న ధ్వని కూడా ఆ కథనంలో వినిపించింది.

'ఫైనాన్షియల్ టైమ్స్'లో ప్రత్యక్షమైన ఇంకో కథనం కూడా అమెరికా లేదా చైనా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని భారత్ కోరుకోవడం లేదనీ, పొరుగు దేశం కంటే అగ్రరాజ్యం ఆధిపత్యాన్ని స్వల్పకాలికంగానైనా సహించే స్థితిలో భారత్ ఉందనీ సూచించింది. 'ఫారిన్ ఎఫైర్స్'లోనే గతంలో ప్రచురితమైన ఇంకో కథనం, ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు బదులుగా పాశ్చాత్యదేశాల వైపు భారత్ నిలబడాలనీ, అది ఆ దేశాన్ని శక్తిమంతంగా మారుస్తుందనీ వ్యాఖ్యానించింది. అమెరికా దృష్టిలో నమ్మదగ్గ భాగస్వామిగా నిలిచేందుకు ఇదే మంచి అవకాశమని భారత్‌కు సలహా కూడా ఇచ్చింది.

ఈ రకమైన కథనాలు ఏ సందర్భంలో వస్తున్నాయి? ఎనిమిది నెలల్లో ఆరుసార్లు భారత్, అమెరికా సంయుక్తంగా మిలిటరీ కార్యకలాపాలు చేపట్టినప్పుడు! ఇరుదేశాల మధ్య 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' (ఐసెట్) ప్రారంభ సమావేశం జరిగిన కొంత కాలానికి! అంతేనా? ఈ ఏడాది జనవరి 31నే ఇరు దేశాల భద్రత సలహాదారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు కూడా. అంతకు మునుపు కూడా భారత్, అమెరికా రెండూ రక్షణ, భద్రతలకు సంబంధించిన అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటయ్యేందుకు పునాది రాళ్లు వేసుకున్నాయి. ఒక్క విషయమైతే స్పష్టం. ఈ సానుకూల దృక్పథాన్ని తిరోగమన బాట పట్టించాలని అమెరికా అనుకోవడం లేదు. కాకపోతే ద్వైపాక్షిక సంబంధాలను ఒక్కసారి సమీక్షించుకుని అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది కూడా అర్థం చేసుకోదగ్గ విషయమే.



'ఫారిన్ ఎఫైర్స్' మ్యాగజైన్‌లో భారత్ నమ్మదగ్గ భాగస్వామి కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన కథనం ఒక విషయాన్ని మరచిపోయింది. భాగస్వామికీ, మిత్రపక్షానికీ మధ్య తేడా ఉంది. వారి దృక్కోణాలు వేరుగా ఉండేందుకు ప్రధాన కారణం ఇదే. సంక్షోభాల సమయంలో అమెరికా చేసిన సాయాన్ని భారత్ ఎప్పటికప్పుడు గుర్తిస్తూనే ఉంది. మైత్రి దృఢంగా మారేందుకు ఇది చాలా కీలకం. అదే సమయంలో తన జాతీయ భద్రత విషయంలో అమెరికాపై భారత్ ఏమాత్రం బాధ్యత, బరువు పెట్టడం లేదు. సామర్థ్యం విషయంలో తేడాలున్నప్పటికీ భారత్, చైనా రెండూ తమ సార్వభౌమత్వాలను కాపాడుకునేందుకు ఎంతగా కట్టుబడి ఉన్నాయో ఇప్పటికే పలుమార్లు నిరూపించుకున్నాయి.

తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో భారత్ సిద్ధం చేసుకుంటున్న వ్యవస్థలు తమకు మద్దతుగానే అని అమెరికా మేధావులు భావిస్తుంటారు. అయితే మిలిటరీ వర్గాలు మాత్రం మన భద్రత కోసమే అయినప్పటికీ వాస్తవాధీన రేఖ వెంబడి భారత్ సైన్యం మోహరించడం మేలనీ, తద్వారా చైనా బలగాలు తూర్పు దిక్కున తక్కువ అవుతాయనీ భావిస్తారు. అలాగే భారత నావికాదళం అమెరికా, ఇతర భాగస్వాముల సాయంతో హిందూ మహా సముద్ర ప్రాంతంలో నౌకా సంబంధ భద్రతకు కేంద్ర బిందువుగా నిలవగలదు. తద్వారా అమెరికాపై ఒత్తిడి కొంత తగ్గుతుంది.

గతాన్ని మరచి ఇరు దేశాల మిలిటరీ వర్గాలు తమ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఇరు వర్గాల మధ్య ఇప్పటికే ప్రశంసించదగ్గ స్థాయిలో సహకారం నడుస్తోంది. సమాచార వినిమయం, నైపుణ్యాలకు మెరుగుపెట్టుకోవడమూ జరుగుతోంది. యుద్ధ విద్యల సామార్థ్యాల్లోనూ, రక్షణ టెక్నాలజీల వ్యాపారంలోనూ ముందడుగులు పడుతున్నాయి. ఇలా సర్వసన్నద్ధమైన బలగాలు అందుబాటులో ఉండటం వల్ల నేతలు ఇతర ముఖ్యమైన అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించే వీలు ఏర్పడుతుంది.

టెక్నాలజీ రంగంలో సహకరించుకోవడం అనేది ఇరు దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్న అంశం. ద్వైపాక్షికంగానే కాదు... 'క్వాడ్' సభ్యదేశాలుగానూ ఇది చాలా ముఖ్యమైంది. 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' కింద కీలక అంశాలను ఎంపిక చేసేందుకు సిద్ధమవుతున్న తరుణమిది. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు, ఏరో ఇంజిన్ ఉత్పత్తిని భారత్‌కు తరలించడం వంటివి ఏవైనా కావచ్చు... ఏవైనా అపోహలుంటే వాటిని తొలగించుకునేందుకు ఇదే మంచి సమయం.

'డిఫెన్స్ టెక్నాలజీ అండ్ ట్రేడ్ ఇనిషియేటివ్' (డీటీటీఐ) విఫలమైన నేపథ్యంలో దానికి బదులుగా 'ఐసెట్' వచ్చిందనేది తప్పుడు అంచనా అవుతుంది. ఎందుకంటే ఇరు పక్షాలూ కలిసికట్టుగా పనిచేయడంలో ఉన్న సున్నితమైన అంశాలపై సంపూర్ణ అవగాహన పొందేందుకు డీటీటీఐ సాయపడింది కాబట్టి! అలాగే ఈ భాగస్వామ్యాల్లో నిర్ణయాధికారం అమెరికాదని కొందరు అనుకుంటూ ఉండటం కూడా అంత సరికాదు. ఎందుకంటే ఉమ్మడి శత్రువును ఎదుర్కొనేందుకు హిందూ – పసిఫిక్ మహా సముద్ర ప్రాంతంలో వ్యూహాత్మక స్థిరత్వానికి సాంకేతిక రంగం విషయంలో ఇరు పక్షాల మధ్య అంతరం తగ్గాల్సిన అవసరముంది.

చివరగా, భారతీయ రక్షణ రంగ మార్కెట్ తన ఆయుధ తయారీదారులకు అందకుండా పోతుందన్న అమెరికా ఆందోళన గురించి... అమెరికా రక్షణ శాఖ మంత్రి ఆస్టిన్ 2021 మార్చిలో భారత్ వచ్చినప్పుడు ఇచ్చిన సూచన ఆచరణ సాధ్యమైంది. "భారతీయ సైనిక దళాలు అమెరికా ఆయుధ వ్యవస్థల తాలూకూ లాభాలను చవిచూసేందుకు అవకాశాలుండాలి. అప్పుడే వారు తమకు తగిన వాటిని ఎంచుకునే వీలు ఏర్పడుతుంది. అంతేకానీ అమెరికా ఒత్తిడి తీసుకొచ్చి వాటిని అమ్మే ప్రయత్నం చేయరాదు. ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని వ్యాఖ్యానించారు ఆయన.

ఈ నెల నాలుగవ తేదీ భారత్‌కు విచ్చేసిన ఆస్టిన్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆ మరుసటి రోజు కలిశారు. రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ప్రణాళికలను ఖరారు చేసుకున్నారు. జాతీయ రక్షణ సలహాదారు అజిత్ ధోవల్‌తోనూ చర్చలు జరిపారు.

భారత్, అమెరికా అనివార్య భాగస్వాములు. ఒకరిపై ఒకరు ఆధారపడాల్సిన అవసరముందని ఇరు దేశాలూ గుర్తించాలి. ఇరువురి జాతీయ అవసరాలను గుర్తించగలగడం వంటి లక్షణాలను అలవర్చుకుంటే ఇరువురి మధ్య సంబంధాలు బలపడతాయి. ఇరు పక్షాలు చేసిన శత ప్రయత్నాల ఫలితంగానే ప్రస్తుత సుహృద్భావ మైత్రి ఏర్పడింది. రానున్న కొన్ని నెలల కాలం ఇప్పటికే సిద్ధంగా ఉన్న వ్యవస్థలను కార్యాచరణకు దింపే అవకాశాలను కల్పిస్తుంది.

వ్యాసకర్త ఇండియా–యూఎస్ డీటీటీఐ ఇంటర్ ఏజెన్సీ టాస్క్‌ఫోర్స్ మాజీ సహాధ్యక్షులు

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఖండనార్హం



భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యను ఉత్సవం చేసిన కెనడాలోని ఒక కార్యక్రమం గురించిన కథనాలు నన్ను ఆందోళనకు గురిచేశాయి. కెనడాలో ద్వేషానికీ, హింసను శ్లాఘించడానికీ స్థానం లేదు. ఇలాంటి చర్యలను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాను.

– కామెరాన్ మాక్‌కే, ఇండియాలో కెనడా హై కమిషనర్

ఇందుకా?



ఫ్రెంచ్ పట్టణం ఆన్‌సీలో విచ్చలవిడి కత్తిపోట్ల వల్ల ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా శరణార్థి. అయినా అతివాద వామపక్షీయులు పడవలకొద్దీ శరణార్థులను బ్రిటన్ అనుమతించాలంటున్నారు.

– పాలా లండన్, బ్రాడ్‌కాస్టర్

నాకో దేశం ఉంది!



నాకు నార్వే పౌరసత్వం వచ్చిందని ఇప్పుడే తెలిసింది. మొట్టమొదటిసారి నా జీవితంలో, దేశం లేనివాడిని కాను. మా ముత్తాత, తాత, నాన్న అందరూ దేశం లేని పాలస్తీనియన్లు. నేనిప్పుడు నార్వేజియన్‌ని : ఎప్పటికీ పాలస్తీనియన్‌ని!

– ఇయాద్ ఎల్ బాగ్దాదీ, రచయిత

విసిగిస్తున్నారు



టెలిమార్కెటర్లకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాల్సిన సమయం వచ్చిందనుకుంటున్నాను. డీఎన్‌డీ (డు నాట్ డిస్టర్బ్) రిజిస్టర్‌లో ఉన్నప్పటికీ ఫోన్ కాల్స్ చేసే చిరుద్యోగులనే కాదు, మన ప్రైవసీని భంగపరిచి సొమ్ము చేసుకునే బిగ్ బాసులపై కూడా! జైలు అనేది మరీ కఠినంగా అనిపించొచ్చు, కానీ చట్టం గట్టి శిక్ష ఏదో సిద్ధంచేయాలి.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

గొప్ప విజయం



1980ల్లోని 80 శాతం అత్యంత పేదరికం నుంచి అత్యంత పేదరికం అనేది లేని దశకు చైనా చేరుకుంది. ఇది చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆర్థికాభివృద్ధి. చైనా సాఫల్యాల పట్ల సంతోషించాలి, భయపడకూడదు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

ముందంజలో ఆంధ్రప్రదేశ్

స్థిరమైన ప్రగతి సాధనలో ముందడుగు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,19,518ల తలసరి ఆదాయాన్ని నమోదు చేసింది. 2019లో ఇది రూ. 1,51,173లుగా ఉంది. స్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్రం పలు జాతీయ రికార్డులను సాధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వమిచ్చిన సమాచారం మేరకు 2014లో రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ప్రకటించిన రెవిన్యూ లోటు గ్రాంటును ఇచ్చేందుకు ఇప్పటి వరకూ తిరస్కరిస్తూ వస్తున్న కేంద్రం ఇప్పుడు ఆ రూపంలో రూ.10,500 కోట్ల గ్రాంటును మంజూరు చేయటం జగన్ ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయం. 2022–23లో దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం మేర గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ (జీఎస్‌డీపీ) నమోదు చేసి ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. 2018–19లో ఏపీ జీఎస్‌డీపీ రూ. 8.73 లక్షల కోట్లు. 2022–23లో ఇది రూ 13.17 లక్షల కోట్లకు చేరింది. 2018–19 నాటితో పోలిస్తే ఇది 50 శాతం మేర పెరుగుదల అని చెప్పవచ్చు. 2018–19లో దేశ జీడీపీలో ఆంధ్రప్రదేశ్ వాటా 4.45 శాతం కాగా, 2022–23లో ఇది 4.78 శాతానికి చేరింది. 2019లో జీఎస్‌డీపీ సాధనలో రాష్ట్రం దేశంలో 22వ స్థానంలో నిలవగా, ఇప్పుడు 2022 –23లో 14వ స్థానానికి ఎగబాకింది. 2019కి ముందు 169 శాతం మేర ఉన్న రాష్ట్ర రుణభారం ఇప్పుడు 58 శాతానికి చేరడం గమనార్హం. రెండేళ్ల పాటు కొనసాగిన కోవిడ్ కష్టాలు లేకపోతే ఈ భారం మరింత తగ్గేది.



గడచిన నాలుగేళ్లలో వేగవంతమైన ప్రగతిని రాష్ట్రం నమోదు చేసింది. 2022–23లో 16.22 శాతం జీఎస్‌డీపీలో వృద్ధిరేటు కనిపించింది. జీఎస్‌డీపీలో రాష్ట్ర పారిశ్రామిక రంగం దాదాపు రూ. 13 లక్షల కోట్ల వాటా కలిగి ఉంది. పారిశ్రామిక రంగం వాటా 21 శాతం నుంచి 23 శాతానికి పెరిగింది. 2022 జనవరి – డిసెంబరు మధ్యకాలంలో రూ. 45.2 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2022–23లో రూ. 1.6 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులు రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యాయి. 2021–22లో ఎగుమతుల విలువ రూ. 1.43 లక్షల కోట్లు కాగా, ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అది రూ. 1.6 లక్షల కోట్లకు పెరిగింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లలో ఏపీ వరుసగా మూడోసారి అగ్రస్థానంలో నిలిచింది.

2019, 2020, 2021 సంవత్సరాలలో స్థిర అభివృద్ధి సాధనలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన ఐదు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఎస్‌డీజీ ర్యాంకింగ్‌లో ఏపీ 4వ స్థానంలో నిలిచింది. నాలుగు ప్రధాన పోర్టులు, 10 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఒప్పందాలు కార్యరూపంలోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10 సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి 59 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిద్వారా రూ. 3.39 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.34 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2016 నుంచి 2018 వరకూ గత ప్రభుత్వం భాగస్వామ్య సదస్సుల ద్వారా 1,739 ఎంఓయూలను కుదుర్చుకుంటే 18,87,058 పెట్టుబడులు వస్తాయని చెప్పారు. కాని ఇందులో 10 శాతం కూడా వాస్తవరూపం దాల్చలేదు. విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా 387 ఒప్పందాలు జరిగాయి. ఇందులో పరిశ్రమలు వాణిజ్య శాఖ తరపున 100 ఒప్పందాలు జరిగాయి. ఇందులో 13 ఒప్పందాలు ఇప్పటికే వాస్తవ రూపం దాల్చాయి. రూ. 2.7 వేలకోట్ల పెట్టుబడి వల్ల 6,858 ఉద్యోగావకాశాలు ఏర్పడ్డాయి.

– కె.వి. రమణమూర్తి, సీనియర్ పాత్రికేయులు

పని వ్యూహాలే... విజయ సోపానాలు

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక మార్పులు తీసుకురావడానికి ప్రయత్నించిన రాజకీయ నాయకుల్లో మొదటివ్యక్తి డా॥ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయితే, రెండవ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. 'ఆరోగ్యశ్రీ' లాంటి మానవీయ పథకాలతో, రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది పేదలకు ప్రాణదాత అయ్యారు. తండ్రిని మించిన తనయుడిలా జగన్ ఆరోగ్యశ్రీని మరిన్ని వ్యాధులకు వర్తింపజేయడమే కాకుండా వైద్యరంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారు. బహుజనుల చిరకాల స్వప్నమైన ఆంగ్లమాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను దాదాపు అన్నిటినీ నెరవేర్చి కమిట్‌మెంట్ రాజకీయాలకు మరో పేరుగా నిలిచారు. విలువలుగల రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తూ తనదైన అభివృద్ధి మోడల్‌తో ముందుకెళ్తున్నారు. విద్య, వైద్యం, సేద్యం, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం లాంటి మానవీయ రాజకీయాలతో నాలుగేళ్ళ పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పాతికేళ్ళ భరోసానిస్తున్న ప్రజానాయకుడు జగన్.

జగన్ పనివ్యూహాలు, మనిషి కేంద్రంగా ఆయన చేస్తున్న లౌకికపాలన ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల, వర్ణాల, వర్గాల ప్రజల మన్ననలను పొందుతున్నాయనేది వాస్తవం. అవే రానున్న ఎన్నికల్లో ఆయన గెలుపు వ్యూహాలు కూడా. రానున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ అజేయ విజయభేరి మోగిస్తారని ఇటీవల జరిగిన సర్వేలో తేలింది. ఒక కోటి నలభై లక్షలమంది ఓటర్లు జగన్ పాలనపై, పథకాలపై పాజిటివ్ దృక్పథాన్ని కనబరిచారు. కాని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజకీయ పార్టీలు ఎలాంటి అనైతిక పొత్తులు పెట్టుకొనయినా సరే, ఎన్ని అబద్ధాలను ప్రచారం చేసైనా సరే గెలవాలని తిప్పలు పడుతున్నాయి. వీరి వైఖరి చూస్తుంటే శ్రీశ్రీ గురించి కాళోజీ అన్న మాటలు జ్ఞాపకం రాకుండా ఉండవు.

''శ్రీశ్రీ రాసిపారేసిన కవిత్వం గురించి కాకుండా ఆయన తాగి పారేసిన సీసాల గురించి ఎందుకురా మాట్లాడుతారు' అనేవి ఆ మాటలు. 'జగన్నాథ రథచక్రాలను' సైతం భూమార్గం పట్టించిన శ్రీశ్రీ కవిత్వం ముందు తాగుడనే అలవాటుకు ఏం విలువుంది? అలాగే గత నాలుగేళ్ళుగా జగన్ ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న అభివృద్ధి ముందు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న విమర్శలు కూడా ఎందుకూ కొరగానివే. ఏ విలువా లేనివే.



జనసేన అధినాయకుడు పవన్‌కల్యాణ్‌కు ఏ దృక్పథమూ లేదు. సామాజిక స్పృహ అసలే లేదు. ఒకసారి బీజేపీతో, మరోసారి టీడీపీతో, వీలుంటే రెండింటితోనూ పొత్తు పెట్టుకోవాలని తహతహలాడుతున్నారు. ఓ స్పష్టమైన ప్రాపంచిక దృక్పథంతో పాలన సాగిస్తున్న జగన్‌ను ఇష్టమున్నట్లు విమర్శిస్తున్నారు పవన్. ఇవేమీ జనసేనను ఓ రాజకీయ పార్టీగా నిలబెట్టలేవు.

ఇక టీడీపీ సంగతికొస్తే... రోజురోజుకూ చిక్కిపోతూ తెలంగాణలో ఉన్న స్థితికి ఏపీలోనూ వస్తోంది. తెలుగు ప్రజలు చంద్రబాబు పాలన చూశారు. ఆయనలోనూ, ఆయన పార్టీలోనూ ఇప్పటికీ ఏ మార్పూ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో గుణాత్మక మార్పులు తెస్తున్న జగన్‌ను తిట్టడమే ఉద్యమంగా టీడీపీ పెట్టుకొంది. తన పద్నాలుగేండ్ల పాలనలో ఏం చేశారో చెప్పరు. అమరావతినీ, పోలవరాన్నీ ఎందుకు పూర్తిచేయలేదో చెప్పరు. ఆంగ్లమాధ్యమం ఎందుకు ప్రవేశపెట్టలేదో చెప్పరు. ప్రపంచ పారిశ్రామిక వేత్తలను, దిగ్గజాలను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించిన జగన్‌ను విమర్శిస్తారు. కువిమర్శ, విరామం లేని వ్యతిరేక ప్రచారం ఎలాగైనా సరే అధికారంలోకి రావాలన్న తపన తప్ప టీడీపీకి తాను మారి ఓట్లు పొందాలన్న ధ్యాస లేదు.

బీజేపీ మతతత్వ అజెండాతో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావాలని చూస్తోంది. జనసేన తన మిత్రపక్షం అని చెప్పి రోడ్ మ్యాప్ కోసం ఎదురు చూస్తున్న పవన్‌కు ఎటువంటి రోడ్‌మ్యాప్ ఇవ్వకుండా వేచిచూసే ధోరణిలో ఉంది. టీడీపీతో పొత్తు లేదంటుంది. కానీ దానితో పొత్తుకు సిద్ధమైన జనసేన తన మిత్రపక్షం అంటుంది. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

కోట్లాది ప్రజల మన్ననలను పొందుతూ పనివ్యూహాలతో ముందుకు వెళ్తున్న జగన్ సారథ్యం వహిస్తున్న వైసీపీ గెలుపును ఈ పార్టీల వ్యూహాలు, పొత్తులూ ఆపలేవు. జగన్ తాను ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను దాదాపుగా పూర్తిచేసి ఓట్లడుగుతున్నారు. ప్రజలు తమ నోటిదగ్గరి కూడును కాళ్లదంతారని అనుకోవడం అవివేకం!

వ్యాసకర్త కథారచయిత
మొబైల్: 91829 18567

అనుకొన్నదొకటి...

అనుకొన్నదొకటీ, అయినదొకటీ అయిపోవటం అప్పుడప్పుడూ అందరికీ జరుగుతుంది. కానీ అనుకొన్న దానికీ, అయిన దానికీ మధ్య వ్యత్యాసాన్ని కైక లాగా అత్యధిక స్థాయిలో ఎవ్వరూ ఎక్కడా ఎప్పుడూ అనుభవించి ఉండరు. ఆమెకు దేనికీ లోటు లేదు. భర్త ఆమెకు దాసుడు. సవతులున్నా, వాళ్ళకు ఆమెతో ఇబ్బందులే కానీ ఆమెకు వాళ్ళతో సవతిపోరు లేదు. అష్టైశ్వర్యాలున్నాయి. సవతులతో పాటు తనకూ యజ్ఞఫల రూపమైన దివ్యసంతానం కలిగింది. సొంత ప్రజ్ఞ విషయమూ, ఆమె దేవాసుర యుద్ధంలో, స్వయంగా భర్త ప్రాణాలు సంరక్షించుకొన్న సాహసి.

ఇన్ని ఉండీ, లోక వ్యవహారానికీ లోకుల అభిప్రాయానికీ విరుద్ధంగా, తన కొడుకును రాజును చేయాలన్న దురాలోచనకు తలఒగ్గింది. నిజానికి ఆ పాపం తన పుర్రెలో పుట్టిన కోరిక కాదు. చెప్పుడు మాట. కానీ కోరిక మరీ విజృంభించితే ప్రమాదం. మోహంతోనూ, మొండితనంతోనూ కలిసి మరీ బిగిసిందంటే, ఉచితానుచితాలు మరిపించి, తెగేదాకా తీసుకు వెళుతుంది.



కైక అనుకొన్నది జరగనే లేదు. అంత మాత్రమే కాదు. స్వయంకృతం వల్ల భర్త చావుకు కారణమై, పసుపు కుంకుమలు కూడా పోగొట్టుకొంది. లేనిదేదో అక్రమంగా సాధించుదామనుకొని, ఉన్నదంతా పోగొట్టుకొన్నది. పోనీ, ఎవరి కోసమైతే ఇంత దుస్సాహసం చేసిందో ఆ ఒక్కగానొక్క కొడుకు ఆమె ప్రేమనూ, తపననూ గుర్తించాడా? చిటికెడు సానుభూతి చూపాడా? తీవ్రంగా దుర్భాషలాడి, ఛీకొట్టాడు. రాముడు కోపిస్తాడన్న భయంవల్ల ప్రాణాలతో మాత్రం వదిలాడు. కానీ, అంతకంటే చంపేస్తేనే బాగుండేది అన్నంత దుర్భర స్థితిలో వదిలాడు. ఆమె కోరుకొన్నది ఆమె సంతానం వృద్ధి మాత్రమే. కానీ మితులు మీరేసరికి, లోకమంతా ఆమెను అసహ్యించుకొంది. ఆమె పేరు దురాలోచనకూ, దుష్టత్వానికీ పర్యాయ పదంగా చరిత్రలో నిలిచిపోయింది. ఎలా బ్రతక గూడదో మానవ జాతికి చూపేందుకు ఆమె బ్రతుకు ఉదాహరణగా మిగిలిపోయింది.

– ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.21 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** దనిష్ఠ రా.9.19 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.01 నుండి 5.31 వరకు(తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.56 వరకు, తిరిగి ఉ.11.46 నుండి 1.06 వరకు, **అమృతఘడియలు:** ప.12.55 నుండి 1.46 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29.

క్లుప్తంగా...

రెండో రోజూ విచారణ

- పోలీసుల అదుపులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

ఆటోనగర్(విజయవాడ తూర్పు): వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ డివిజన్–1 కార్యాలయం ఇంటెలిజెన్స్ విభాగంలో జీఎస్టీ అధికారులు బి.మెహర్‌కుమార్, డీసీటీవో కే సంధ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకట చలపతి, ఆఫీస్ సబార్డినేట్ ఎం.సత్యన్నారాయణను పటమట సీఐ కాశీవిశ్వనాథ్ గురువారం విచారించారు. మంగళవారం పటమట పోలీస్‌లు వీరిని కస్టడీలోకి తీసుకోగా గురువారం రెండో రోజు కూడా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం పోలీస్ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అంతకు ముందు సీఐ పలువురు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు సహకరించిన పలువురు మధ్యవర్తులను విచారించినట్లు తెలిసింది. నిందితులు పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేస్తున్నారని విశ్వశనీయ సమాచారం.

18 నెలల బాబు అపహరణ

- విశాఖ రైల్వేస్టేషన్‌లో ఘటన


కిడ్నాప్‌కు గురైన చిన్నారి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గురువారం ఉదయం 18 నెలల బాలుడు అపహరణకు గురయ్యాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన మేరకు.. తెలంగాణలోని భువనగిరి మండలం కప్రాయ్‌పల్లి గ్రామానికి చెందిన కొంగరి భవాని (30) కుటుంబ కలహాల కారణంగా తన 18 నెలల బిడ్డ విజయ్‌కుమార్‌ను తీసుకుని అక్కడి నుంచి వేర్వేరు రైళ్లెక్కి బుధవారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్‌లోనే 8వ నంబరు ప్లాట్‌ఫాం పైనే గడిపింది. గురువారం ఉదయం ఒక ఆడ, ఒక మగ వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపారు. కొంతసేపటికి ఆమె బిడ్డతో కలిసి ప్లాట్‌ఫాంపై నిద్రలోకి జారుకుంది. ఆమెకు మెలకువ వచ్చేసరికి బిడ్డ కనిపించలేదు. తనతో మాటలు కలిపినవారు తన బిడ్డను ఎత్తుకెళ్లి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. సుమారు 30, 35 సంవత్సరాల వయసుగల వారిద్దరు హిందీలో మాట్లాడుతున్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. అపహరణకు గురైన బాబు స్కై బ్లూ కలర్ నైట్ ప్యాంట్, నలుపురంగు స్లీవ్‌లెస్ బనియన్ ధరించి ఉన్నట్లు పేర్కొంది. బాబు నలుపురంగులో ఉంటాడని, ఆచూకీ తెలిసినవారు జీఆర్పీ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌కు స్వయంగా లేదా 9493424987, 9440627547, 0891 -2882910 నంబర్లుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

'ధ్యాన బుద్ధ ప్రాజెక్టును సందర్శించండి'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ ప్రఖ్యాత ధ్యాన బుద్ధ ప్రాజెక్ట్‌ను సందర్శించాలని నేపాల్ బుద్ధిస్ట్ సమాఖ్య అధ్యక్షుడు కమల్ భండారీని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. గురువారం నేపాల్ రాజధాని ఖాట్మండులో భండారీని కలిసి ఏపీకి రావాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి ప్రాంతం గౌతమ బుద్ధుని ధాతువులు, గొప్ప బౌద్ధ శిల్ప సంపదకు నిలయంగా ఉందన్నారు. భండారీని శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన బౌద్ధనాథ్ దేవాలయాన్ని వీరాంజనేయులు దర్శించారు.

తెలంగాణ

వర్క్ వీసా పేరుతో మోసం

- మలేషియాలో చిక్కుకున్న 19 మంది తెలంగాణ, ఏపీ వాసులు

ఎర్రుపాలెం: విదేశాల్లో మంచి ఉపాధి కల్పిస్తామని, మెరుగైన వేతనం లభిస్తుందని బ్రోకర్లు చెప్పిన మాయమాటలు నమ్మి తెలంగాణ, ఏపీలకు చెందిన పలువురు మోసపోయారు. మోసానికి గురైన బాధితులు మలేషియాలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. దీనిపై బాధిత వ్యక్తుల కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం, జమలాపురం, అయ్యవారిగూడెం గ్రామాలతో పాటుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పట్టణానికి చెందిన 12 మంది మహిళలు, ఏడుగురు పురుషులు బ్రోకర్ల వలలో చిక్కుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నూజీవీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మందపాటి నాగబాబు, హైదరాబాద్‌కు చెందిన పాదిల దాశరథి నాయుడు టూరిస్టు వీసాపై మలేషియాకు పంపించి అక్కడ వర్క్ వీసా వచ్చేలా చూస్తామని, మూడేళ్ల పాటు మెరుగైన వేతనం అందుతుందని నమ్మబలికారు. దీంతో మొత్తం 19 మంది రూ.1.90 లక్షల నుంచి 2.75 లక్షల వరకు నాగబాబుకు చెల్లించారు. గత ఏడాది డిసెంబర్ 17నుంచి వీరిని విడతల వారీగా మలేషియా పంపించి హోటళ్లు, సంస్థల్లో క్లీనింగ్ పని ఇప్పించారు. కానీ కొన్నాళ్ల తర్వాత వీరి వద్ద వర్క్ వీసా లేకపోవడంతో యజమానులు పనిలో నుంచి తొలగించారు. కాగా, అక్కడి అధికారులు వర్క్‌వీసా లేని వీరికి భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.40 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసం గురించి కుటుంబీకులకు చెప్పగా ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు జరిగిన మోసంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

12 వరకు

మొక్కజొన్న కొనుగోళ్లు

8,915 మంది రైతుల నుంచి 71,445 టన్నులు కొనుగోలు

- ఈ సరుకు విలువ రూ.140.18 కోట్లు
- ఇప్పటికే 6,292 మంది రైతులకు రూ.95.29 కోట్ల చెల్లింపు
- ప్రభుత్వ జోక్యంతో మళ్లీ పుంజుకున్న మొక్కజొన్న ధరలు
- మార్కెట్‌లో ప్రస్తుతం రూ.2 వేలకుపైగా ధర
- చివరి గింజ అమ్ముకునే వరకు రైతులకు అండగా నిలవాలని సర్కారు నిర్ణయం


బాపట్ల జిల్లాలోని ఆర్బీకే వద్ద మొక్క జొన్న కొనుగోళ్లు దృశ్యం

సాక్షి, అమరావతి: మార్కెట్‌లో ధరలు పుంజుకున్నప్పటికీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు మరికొంతకాలం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అనుమతికి మించి రైతుల నుంచి కొనుగోలు చేయడమేగాక సకాలంలో డబ్బు చెల్లిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ జోక్యంతో మార్కెట్‌లో ధరలు మళ్లీ పుంజుకోవడంతో మొక్కజొన్న రైతులు సంతోషిస్తున్నారు. మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ రైతు ప్రయోజనాల దృష్ట్యా ఈ నెల 12వ తేదీ వరకు కొనుగోళ్లు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పదిరోజుల్లోనే రైతులకు సొమ్ము

మార్కెట్‌లో ధరలు పతనమైన ప్రతిసారి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. కనీస మద్దతుధర కంటే మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు తగ్గినట్టు సీఎం యాప్ ద్వారా గుర్తించిన మరుక్షణం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.1,962 కాగా, మార్కెట్‌లో రూ.1,500 నుంచి రూ.1,800 చొప్పున పలుకుతుండడంతో మొక్కజొన్న ఎక్కువగా సాగయ్యే జిల్లాల్లోని 1,548 ఆర్బీకేల పరిధిలో కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. మే 5వ తేదీన కొనుగోళ్లు ప్రారంభించింది. తొలుత 25,316 మంది రైతులు తమ వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 698 ఆర్బీకేల పరిధిలో 8,915 మంది రైతుల నుంచి కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.1,962 చొప్పున రూ.140.18 కోట్ల విలువైన 71,445 టన్నుల మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసింది. రైతులకు పదిరోజుల్లోనే డబ్బు చెల్లిస్తోంది. ఇప్పటికే సీఎం యాప్ ద్వారా 6,292 మంది రైతులకు రూ.95.29 కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని వారం, పది రోజుల్లో చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎమ్మెస్పీకి మించి పలుకుతున్న ధర

ప్రభుత్వ జోక్యంతో వ్యాపారులు సైతం పోటీపడడంతో మార్కెట్‌లో ధరలు అనూహ్యంగా పుంజుకున్నాయి. ఫలితంగా ప్రస్తుతం సాధారణ కామన్ వెరైటీ సైతం కనీస మద్దతు ధరతో సమానంగా ఉండగా, ఫైన్ క్వాలిటీ మొక్కజొన్న ధర క్వింటాల్ రూ.2 వేలకు పైగా పలుకుతోంది. దీంతో రైతులు తమ వద్ద ఉన్న నిల్వలను బహిరంగమార్కెట్‌లో అమ్ముకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే 85 శాతానికి పైగా రైతుల వద్ద ఉన్న నిల్వలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. ఈ నేపథ్యంలో తొలుత ఈ నెల 9వ తేదీతో కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించినా.. చివరి గింజ అమ్ముకునే వరకు రైతులకు అండగా నిలవాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు ఈ నెల 12వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. సీఎం యాప్ ద్వారా ప్రతి రోజు మొక్కజొన్నతో సహా ఇతర పంట ఉత్పత్తుల మార్కెట్ ధరలను పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే నష్టపోయేవాడిని..

పంట చేతికొచ్చింది. మార్కెట్‌లో ధర లేదు. పెట్టుబడి కూడా దక్కుతుందో లేదో అని ఆందోళన చెందా. ఏం చేయాలో పాలుపోలేదు. ప్రభుత్వం మా ఊళ్లోనే ఆర్బీకేలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. 113 క్వింటాళ్లు ఈ కేంద్రంలో అమ్ముకున్నా. పదిరోజులు తిరక్కుండానే క్వింటా రూ.1,962 చొప్పున రూ.2.22 లక్షలు నా అకౌంట్‌లో జమ అయ్యాయి. చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఆదుకోకపోతే నష్టపోయేవాడిని.

– ఎస్.వెంకటేశ్వరరెడ్డి, పాలపాడు, పల్నాడు జిల్లా

కొనుగోలు కేంద్రంలో విక్రయంతో లబ్ధి

నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. బయట క్వింటా రూ.1,600కు మాత్రమే కొంటున్నారు. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలనుకున్నా. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజుల కిందట క్వింటా రూ.1,900 చొప్పున 10 టన్నులు విక్రయించా. దీంతో క్వింటాకు రూ.300 చొప్పున, 10 టన్నులకు రూ.30 వేల మేర లబ్ధి కలిగింది.

– చీడిపూడి సాంబిరెడ్డి, వలివేరు, బాపట్ల జిల్లా

కేంద్రాలు కొనసాగిస్తాం

ప్రభుత్వ జోక్యం వల్ల వ్యాపారులు పోటీపడి కొంటున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కనీస మద్దతు ధరకు మించే కొనుగోలు చేస్తున్నారు. ఫైన్ క్వాలిటీ రూ.2 వేలకుపైగా పలుకుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 12వ తేదీ వరకు కేంద్రాలు తెరిచే ఉంటాయి. రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి మరికొంతకాలం కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– రాహుల్ పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

ఎస్వీ జూలో ఆరోగ్యంగా పులిపిల్లలు

- నైట్ హౌస్, పడాక్ బాత్ టబ్‌లోకి వదిలిన జూ అధికారులు


పులిపిల్లలను నైట్‌హౌస్, పడాక్‌బాత్‌లోకి వదిలిన జూ అధికారులు

తిరుపతి మంగళం: ఆత్మకూరు అటవీ ప్రాంతం నుంచి ఎస్వీ జూపార్కుకు తీసుకువచ్చిన పులి పిల్లల్లో మూడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఆత్మకూరు జూ నుంచి తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)కు 4 పులిపిల్లలను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల పులిపిల్ల అనారోగ్యంతో మృతి చెందింది. మిగిలిన 3 పిల్లలను జూ వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గురువారం ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) నవీన్‌కుమార్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య, అడ్వైజర్ కమిటీ సభ్యులు జి.గంగరాజు, జూ వైద్యుల సమక్షంలో 3 పులిపిల్లలను నైట్‌హౌస్, పడాక్ బాత్ టబ్‌లలోకి జూ క్యూరేటర్ సెల్వం వదిలిపెట్టారు. వాటి ఆరోగ్యంపై నిత్యం జూ వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దాంతో పాటు మూడు పులిపిల్లలు సంపూర్ణ ఆహారం తీసుకుంటున్నాయని, రోజుకు రెండు సార్లు నీటి కొలనులో ఈదేలాగ ఏర్పాటు చేశారు. వైద్యుల సూచనలతో న్యూట్రీషన్ ఫుడ్, మెడికేషన్ అందిస్తున్నామని తెలిపారు. వాటి వ్యాయామం కోసం చెక్క కొయ్యలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మూడు నెలల తర్వాత పెద్ద ఎంక్లోజర్స్‌లో వదిలిపెడతామని చెప్పారు.

ఏయూ స్టార్టప్‌కు ప్రత్యేక గుర్తింపు


తారమండల్ నిర్వాహకులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రం ఆ హబ్‌లో ఏర్పాటు చేసిన తొలి విద్యార్థుల స్పేస్ స్టార్టప్ 'తారమండల్'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఫ్రెంచ్ గ్లోబల్ ఇనిషియేటివ్‌గా 2018లో ప్రారంభమైన ప్యారిస్ పీస్ ఫోరంతో కలసి పనిచేసే అవకాశాన్ని పొందింది. ప్యారిస్ పీస్ ఫోరం సంస్థ అంతరిక్షంలో పేరుకుపోతున్న వ్యర్థాలను నిర్మూలించే దిశగా పనిచేస్తోంది. ఈ సంస్థతో ఇప్పటివరకు భారతదేశం నుంచి కేవలం మూడు సంస్థలు మాత్రమే కలిసి పనిచేస్తున్నాయి. తాజాగా ఏయూ విద్యార్థుల స్టార్టప్ తారమండల్‌కు కూడా ఆ అవకాశం లభించింది. భవిష్యత్‌లో అంతరిక్ష వ్యర్థాలను నిర్మూలించడంలో ప్యారిస్ పీస్ ఫోరంతో కలిసి తారమండల్ పనిచేస్తుంది. ఈ సందర్భంగా తారమండల్ నిర్వాహకులను ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. సంస్థ నిర్వాహకులు వినీల్ జడ్సన్, ఎం.గౌతమ్, డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పేస్ టెక్నాలజీ రంగంలో వినూత్న ఆలోచనలతో పనిచేస్తున్న తారమండల్ ఇప్పటికే ఇన్–స్పేస్, ఇస్రో, ఆస్ట్రేలియన్ స్పేస్ ఏజెన్సీ, తైవాన్ స్పేస్ ఏజెన్సీ వంటి అంతరిక్ష పరిశోధన సంస్థల నుంచి ప్రత్యేక గుర్తింపు పొందింది.

రైతు బజార్‌లో ఎనీ టైం బ్యాగ్స్ ఏర్పాటు


క్లాత్ బ్యాగ్‌ను అందజేస్తున్న అధికారులు

సీతంపేట (విశాఖ ఉత్తర): పర్యావరణ కాలుష్యానికి కారణమవుతోన్న పాలిథిన్ కవర్ల వాడకాన్ని నిరోధించేందుకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి శ్రీకారం చుట్టింది. వినియోగదారులకు గుడ్డ సంచులు అందుబాటులో ఉండేలా విశాఖలోని నరసింహనగర్ రైతుబజార్‌లో ఎనీ టైం బ్యాగ్స్ (ఏటీబీ) మిషన్‌ను ఏర్పాటు చేసింది. రూ.10 నోటు గానీ, రెండు రూ.5 కాయిన్స్ గాని మిషన్‌లో వేస్తే క్లాత్ బ్యాగ్ బయటకు వస్తుంది. విశాఖలో తొలిసారిగా నరసింహనగర్ రైతుబజార్‌లో ఏటీబీ మిషన్ ఏర్పాటు చేయడం విశేషం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఏడీఎం యాసిన్ ఈ మిషన్‌ను ప్రారంభించారు. మిషన్‌ను ఎలా ఉపయోగించాలనే దానిపై రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు వినియోగదారులకు వివరించారు. జీవీఎంసీ ప్రతినిధి రాజమణి, రైతు బజార్ సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

- శ్రీకారం చుట్టిన శారద పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి
- రూ.10 కోట్లతో ఆలయాభివృద్ధి: మంత్రి అమర్‌నాథ్ వెల్లడి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, గుడివాడ అమర్‌నాథ్, దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఈ పనులకు విశాఖ శ్రీశారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ..నూకాంబిక అమ్మవారు ఎంతో శక్తి గల అమ్మవారని, ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని చెప్పారు. భక్తులకు ఎటువంటి సమస్య వచ్చినా 'అమ్మా.. నీదే భారం' అని ప్రార్థిస్తే చాలు తన చల్లని చూపు ప్రసరింపజేస్తుందన్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయాన్ని రూ.10 కోట్లతో పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. 8 మాసాల్లో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ రూ.7 కోట్లు వెచ్చిస్తుండగా.. టీటీడీ రూ.3 కోట్లు అందజేస్తోందని, మొత్తం రూ.10 కోట్లతో గుడిని రాతి కట్టడంతో సర్వాంగ సుందరంగా పునర్నిర్మిస్తామని వివరించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, ఆలయ ఈవో బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బహుజన వ్యతిరేక పార్టీలను మట్టికరిపిస్తాం

- 984వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు


రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: బహుజనుల హక్కులను వ్యతిరేకిస్తున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో మట్టి కరిపిస్తామని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 984వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తమ హక్కులను సాధించుకునేందుకు చేస్తున్న పోరాటంలో ఒక్కొక్కటిగా విజయం సాధించడం బహుజన ఉద్యమానికి గర్వకారణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇప్పటికే రాజధాని ప్రాంతంలో 54 వేల పట్టాలు సాధించామని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్.. పేదలకు నవరత్నాల పథకాలతో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా మేలు చేస్తున్నారనడంలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. పేదల పక్షాన పోరాటం చేయాల్సిన వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు పేదల ప్రయోజనాలను గాలికొదిలి తమ స్వార్థం కోసం ప్యాకేజీలకు అమ్ముడుపోవడం దుర్మార్గమన్నారు. త్వరలో మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ మహర్దశ పడుతుందన్నారు. కార్యక్రమంలో సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరి పుష్పరాజ్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

9, 11న పలు రైళ్ల రద్దు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ఖరగ్‌పూర్ డివిజన్‌లోని బహనాగ బజార్ స్టేషన్ వద్ద జరుగుతోన్న ట్రాక్ పునరుద్ధరణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. హౌరా–మైసూర్ (22817), షాలీమార్–హైదరాబాద్ (18045/18046), సత్రగచ్చి–చెన్నై సెంట్రల్ (22807), హౌరా–చెన్నై సెంట్రల్ (12839), ఆగర్తలా–సికింద్రాబాద్ (07029), సిల్‌ఘాట్ టౌన్–తంబరం (15630), చెన్నై సెంట్రల్–షాలీమార్ (12842), పురులియా–విల్లుపురం (22605) రైళ్లను ఈ నెల 9న రద్దు చేశారు. మైసూర్–హౌరా (22818) రైలును ఈ నెల 11న రద్దు చేశారు.

వేటకు వేళవుతోంది..!

- వారంలో ముగియనున్న వేట నిషేధం గడువు
- 15వ తేదీ నుంచి సముద్రంలో వేట ప్రారంభం
- వేట సామగ్రి సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు
- ఈ ఏడాదీ ముందుగానే వేట నిషేధ సాయం అందించిన ప్రభుత్వం


గోదావరి తీరంలో వలలు బాగుచేసుకుంటున్న మత్స్యకారులు

నరసాపురం: సముద్రంలో వేట నిషేధం వారం రోజుల్లో ముగియనుంది. రెండు నెలల విరామం తర్వాత మళ్లీ ఈ నెల 15న సముద్రంలో వేట ప్రారంభం కానుంది. దీంతో 61 రోజులు వలలు పక్కనపెట్టి ఇళ్లకే పరిమితమైన తీర ప్రాంత మత్స్యకారులు వేటసామగ్రి సిద్ధం చేసుకుంటున్నారు. వలలు, బోట్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తోంది. ఈ 61 రోజులూ మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. వేట నిషేధం గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుండటంతో మత్స్యకారులు సంతోషంగా వేటకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఎటువంటి ఆటంకాలు లేకుండా వేట సాగాలని కోరుకుంటున్నారు. ఏటా రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా వరకు ఉన్న తీర ప్రాంతంలో పెద్ద ఎత్తున చేపల వేట సాగుతోంది. మెకనైజ్డ్ బోట్లు, ఇతర పడవల ద్వారా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి వేట సాగిస్తారు.

వరుసగా ఐదోసారి మత్స్యకార భరోసా...

వేట సాగించే మత్స్యకారులు పుట్టినప్పటి నుంచి సముద్రంతో మమేకమై జీవనం సాగిస్తారు. వేట తప్ప వారికి మరో పని తెలియదు. దీంతో వారు వేట నిషేధ సమయంలో ఖాళీగా ఉంటారు. ఈ విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట నిషేధకాలంలో మత్స్యకారులు ఖాళీగా ఉన్న సమయంలోనే సాయం అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లోనే మత్స్యకార భరోసా పథకాన్ని సీఎం జగన్ అమల్లోకి తెచ్చారు. ఇప్పటికి ఐదు దఫాలుగా రూ.10 వేలు చొప్పున మత్స్యకారులకు అందించారు. ఈ ఏడాది కూడా వేట నిషేధ సమయంలోనే మే 19వ తేదీన మత్స్యకార భరోసా సాయం అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ సాయం కేవలం రూ.4 వేలు ఉండేది. అది కూడా వేట నిషేధం గడువు పూర్తయిన తర్వాత ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో ఇచ్చేవారు.

వేట కోసం ఎదురుచూస్తున్నాం



వేట కోసం ఎదురు చూస్తున్నాం. సముద్రంలో వేట తప్ప మాకు మరో పని తెలియదు. ఈ రెండు నెలలు ఖాళీగానే ఉన్నాం. ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం కింద రూ.10 వేలు ఇచ్చింది. ఈ రెండు నెలలు ఆ సొమ్ముతోనే మాకు తిండి. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే ప్రతి సంవత్సరం మే నెలలోనే వేట నిషేధ సాయం అందిస్తున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ ఇవ్వలేదు.

– తిరుమాని ఏసుబాబు, మత్స్యకారుడు

ఇప్పుడు చేపలు బాగా దొరుకుతాయి



రెండు నెలల నుంచి సముద్రంలో వేట లేదు కాబట్టి ఇప్పుడు వేటకు వెళితే చేపలు బాగా దొరుకుతాయి. చేపలు పైకి బాగా తేలి వలకు చిక్కుతాయి. మాకు సముద్రంలో ఈ నెల సీజన్. కాకపోతే తుపానులు రాకూడదు. గత ఏడాది వేట నిషేధం తర్వాత వేట మొదలు పెట్టినప్పటి నుంచి కాలం కలిసి రాలేదు. వేటకు వెళ్లడం... తుపాను పట్టిందని వెనక్కి రావడం జరిగేది. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక వేటకు వెళతాం.

– అంద్రాజు నర్సింహస్వామి, మత్స్యకారుడు

స్విమ్స్‌లో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

- బాలుడి దవడ ఎముకకు కేన్సర్.. ఆ భాగం తొలగింపు
- అనంతరం కాలి ఎముకను తీసి దవడ భాగంలో ఏర్పాటు
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సర్జరీ


చైతన్యతో వైద్యుల బృందం

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ సోకిన వ్యక్తికి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఆయన గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా సదుం మండలానికి చెందిన పదమూడేళ్ల యూ.చైతన్య దవడ ఎముకకు కేన్సర్ సోకింది. స్విమ్స్ సర్జికల్ ఆంకాలజీ విభాగంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ తప్పనిసరి అని నిర్ధారించారు. ఈ క్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ నగేష్ వైద్యుల బృందం క్యాన్సర్ సోకిన దవడ ఎముక భాగాన్ని తొలగించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో బాలుడి ఎడమ కాలి ఎముకను తీసి దవడ భాగంలో ఏర్పాటుచేసి ప్లాస్టిక్ సర్జరీ(మైక్రో సర్జరీ) ద్వారా సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నం విజయవంతమైంది. డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నాగతేజ, అనస్థీషియా డాక్టర్ అలోక్ సమంతరాయ్ ప్లాస్టిక్ సర్జరీని 8 గంటల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, సర్జికల్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగ వైద్యులను అభినందించారు. చైతన్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా తనబిడ్డకు పునర్జన్మను ప్రసాదించారని ఆనందరం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

కొత్త తరం 'అగ్ని ప్రైమ్' పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ: కొత్త తరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని ప్రైమ్'ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో), ఎలైట్ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ పరీక్షించాయి. ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి బుధవారం రాత్రి దీనిని ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు. దేశ వ్యూహాత్మక ఆయుధ సంపత్తి సాధనలో అగ్ని ప్రైమ్ మరో ముందడుగని పేర్కొన్నారు. పరీక్ష ప్రయోగంలో ఈ క్షిపణి అన్ని పరామితులను చేరుకుందని, సైనిక దళాల్లో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైందని రక్షణ శాఖ పేర్కొంది. అగ్ని ప్రైమ్ క్షిపణి 1,000 నుంచి 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. అగ్ని ప్రైమ్‌ను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవోకు, ఎలైట్ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు.

పోప్‌కు హెర్నియా శస్త్రచికిత్స

రోమ్: క్రైస్తవ మతగురువు పోప్ ఫ్రాన్సిస్(86)కు శస్త్రచికిత్స జరిగింది. రోమ్‌లోని గెమెల్లి ఆస్పత్రిలో బుధవారం జాయినయిన పోప్‌కు పేగు మచ్చను తొలగించేందుకు, హెర్నియాను సరిచేసేందుకు వైద్యులు ఆపరేషన్ చేశారు. మూడు గంటల్లో శస్త్రచికిత్స పూర్తయిందని, గురువారం ఆయన మామూలుగానే ప్రశాంతంగా గడిపారని వాటికన్ తెలిపింది. మరికొన్ని రోజులు ఆయన ఆస్పత్రిలోనే విశ్రాంతి తీసుకుంటారని, ఈ నెల 18న జరగాల్సిన వాటికన్ ప్రసంగం రద్దయిందని వివరించింది. వాటికన్ సారథ్య బాధ్యతల్లో యథా ప్రకారం ఫ్రాన్సిస్ కొనసాగుతారని తెలిపింది. పోప్‌నకు 2021లో ఆపరేషన్ చేసి పెద్దపేగులోని 33 సెంటీమీటర్ల భాగాన్ని తొలగించారు.

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం.. ఏడుగురు మృతి

సిద్ధి: మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోగా మరో ఇద్దరు గాయపడ్డారు. సిద్ధి జిల్లా దోల్ గ్రామం సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో ఒక ట్రక్కు.. జీపును, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న ట్రక్కు.. రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఘటన చోటుచేసుకుంది. జీపులోని పెళ్లి బృందానికి చెందిన ఆరుగురితోపాటు ద్విచక్ర వాహనదారుడు ఘటనలో చనిపోయారు. జీపులోని మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కేరళకు నైరుతి రాక

ప్రకటించిన ఐఎండీ • ఈ ఏడాది సాధారణ వర్షాలేనని అంచనా

న్యూఢిల్లీ: ఎట్టకేలకు నైరుతి అరుదెంచింది. సాధారణం కంటే ఒక వారం ఆలస్యంగా నైరుతి రుతు పవనాలు గురువారం కేరళను తాకాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. ఈ మేరకు ఐఎండీ ఒక ప్రకటన విడుదల చేసింది. 'నైరుతి రుతుపవనాలు గురువారం కేరళపై వ్యాపించాయి. ఇవి అరేబియా సముద్రంలోని కొన్ని భాగాలతోపాటు లక్షద్వీప్ మొత్తం, కేరళలోని కొంత ప్రాంతం, దక్షిణ తమిళనాడులో అత్యధిక భాగం, కొమరిన్, మన్నార్ గల్ఫ్, బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలమీదుగా ఇవి ముందుకు కదులుతున్నాయి'అని ఆ ప్రకటనలో ఐఎండీ వివరించింది. నైరుతి రాకతో కేరళలోని మొత్తం 10 జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు కురిశాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీకి ఒక వారం అటూఇటుగా నైరుతి రుతుపవనాలు ఏటా కేరళను పలకరిస్తుంటాయి. జూన్ 4వ తేదీ నాటికి నైరుతి కేరళలోకి ప్రవేశించే అవకాశాలున్నాయని మే 15వ తేదీన విడుదల చేసిన ప్రకటనలో ఐఎండీ అంచనా వేసింది. మూడు రోజులు అటూఇటుగా జూన్ ఏడో తేదీ నాటికి నైరుతి ఆగమనం ఉంటుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా లెక్కలు కట్టింది. అరేబియా సముద్రంలో కొనసాగుతున్న 'బిపర్‌జోయ్'తుపానుతో కేరళపై నైరుతి వ్యాప్తి ఆలస్యమవుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఈ అంచనాల నడుమ నైరుతి గురువారం కేరళలోకి అడుగిడింది.

గత 150 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. నైరుతి రుతుపవనాలు చాలా ముందుగా 1918లో మే 11వ తేదీనే దేశంలోకి ప్రవేశించగా, అత్యంత ఆలస్యంగా 1972లో జూన్ 18న ప్రవేశించాయి. గత ఏడాది కేరళపైకి నైరుతి రుతు పవనాలు మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, 2018లో మే 29న వచ్చినట్లు ఐఎండీ వెల్లడించింది. కేరళపైకి రుతు పవనాల వ్యాప్తి ఆలస్యమైతే ఆ ప్రభావం వాయవ్య భారతంలోకి రుతు పవనాల వ్యాప్తిపై ఉంటుందని గట్టిగా చెప్పలేమని ఐఎండీ స్పష్టం చేసింది. అయితే, కేరళలోకి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించిన సందర్భాల్లో కనీసం దక్షిణాది రాష్ట్రాలు, ముంబైల్లో ఆలస్యంగా వ్యాప్తి చెందేందుకు అవకాశాలున్నాయంది. అదేవిధంగా, రుతు పవనాల ఆలస్య ప్రభావం ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా కురిసే మొత్తం వర్షాలపై ఉండదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఎల్‌నినో పరిస్థితులున్నప్పటికీ నైరుతి రుతుపవనాలతో దేశవ్యాప్తంగా మొత్తమ్మీద సాధారణ వర్షాలే కురుస్తాయని ఐఎండీ ఇప్పటికే తెలిపింది. దేశ వ్యవసాయానికి ఈ సాధారణ వర్షపాతమే అత్యంత కీలకం. నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం దీనిపైనే ఆధారపడి ఉంది. దేశవ్యాప్తంగా విద్యుదుత్పత్తితోపాటు తాగునీటికి కీలకమైన రిజర్వాయర్లను నింపడానికి కూడా ఇది చాలా కీలకం. దేశంలోని మొత్తం ఆహారోత్పత్తిలో వర్షాధార వ్యవసాయం వాటా 40 శాతం. దేశ ఆహార భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి నైరుతి చాలా ముఖ్యమైంది.

మూడు, నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు..

సాక్షి, అమరావతి: వచ్చే 24 గంటల్లో నైరుతి రుతుపవనాలు కేరళ, లక్షద్వీప్‌లోని మిగిలిన ప్రాంతాలు, దక్షిణ తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రుతుపవనాలు మూడు, నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నాటికి రాయలసీమ ప్రాంతానికి రుతుపవనాలు విస్తరిస్తాయని, 12కు దక్షిణ కోస్తాకు విస్తరించే అవకాశముందని వారు పేర్కొన్నారు.

23న విపక్ష పార్టీల భేటీ



ఖర్గే, రాహుల్‌లతో నితీశ్(ఫైల్)

- నితీశ్ అధ్యక్షతన జరిగే భేటీకి హాజరుకానున్న ఖర్గే, రాహుల్
- కేజ్రీవాల్, మమత, స్టాలిన్ కూడా
- కేసీఆర్‌కు అందని ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే కార్యాచరణ సిద్ధం చేసేందుకు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఏర్పాటు చేసిన ప్రతిపక్ష అగ్రనేతల సమావేశం ఈ నెల 23న పాట్నాలో జరుగనుంది. ఈ నెల 12నే విపక్ష నేతల సమావేశం జరగాల్సి ఉన్నా, కాంగ్రెస్ సహా ఇతర పార్టీల ముఖ్య నేతలు అందుబాటులో లేకపోవడంతో ఈ భేటీని 23న నిర్వహించనున్నట్లు జేడీయూ అధ్యక్షుడు లాలన్ సింగ్ ప్రకటించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు సీఎం స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ-ఎంఎల్ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్యలు హాజరు కానున్నారు. కాగా ఈ భేటీకి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు జేడీయూ నేతలు ఆహ్వానం పంపలేదు. గత ఏడాది ఆగస్టులో బిహార్‌లో నితీశ్‌కుమార్‌తో భేటీ నిర్వహించిన కేసీఆర్, బీజేపీ ముక్త్ భారత్‌కై కలిసి పోరాడతామని ప్రకటించారు. అయితే అనంతరం వివిధ కారణాలతో రెండు పార్టీల మధ్య ఎలాంటి చర్చలు జరుగలేదు. తాజా భేటీకి ఆహ్వానం పంపలేదు. ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ తీసుకునే అంశంపై చర్చించనున్నారు.

హాజరవుతున్నా: శరద్ పవార్

బిహార్ సీఎం నితీశ్‌కుమార్ బుధవారం తనకు ఫోన్ చేసి ఆహ్వానించారని, విపక్షాల భేటీకి తాను హాజరవుతానని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ గురువారం తెలిపారు. పలు జాతీయ అంశాలపై కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని, అది విపక్షాల బాధ్యతని పవార్ అన్నారు.

ఆగని కన్నీటి వరద

- ఉక్రెయిన్‌లో వేలాది గృహాలను ముంచేసిన డ్యామ్ నీరు
- ప్రభావిత ప్రాంతాల్లో జెలెన్‌స్కీ పర్యటన
- కొట్టుకుపోయిన మందుపాతరలు
- జనాల్లో ఎక్కడకు పోయాయో, ఎప్పుడు పేలుతాయోనన్న భయం

ఖేర్సన్(ఉక్రెయిన్): నీపర్ నదిపై కఖోవ్కా డ్యామ్ పేలుడుతో కొత్త మలుపు తీసుకున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో జనం కష్టాలు మరింత పెరిగాయి. ఇన్నాళ్లూ బాంబుల మోతతో బంకర్లతో, భూగర్భ గృహాల్లో తలదాచుకున్న జనం ఇప్పుడు అవన్నీ జలమయం కావడంతో పొట్టచేతపట్టుకుని ప్రాణభయంతో పరుగుపెడుతున్నారు. యుద్ధంలో శత్రుదేశ సైన్యం సంహారం కోసం జనావాసాలకు దూరంగా పూడ్చిపెట్టిన మందుపాతరలు వరదప్రవాహం ధాటికి కొట్టుకుపోయాయి. ఆ వరదనీరు జనావాసాలను ముంచెత్తడంతో అవి ఇప్పుడు జనావాసాల్లో ఎక్కడికి కొట్టుకొచ్చి ఆగాయో, ఎప్పుడు పేలుతాయోనన్న భయం జనాలను వెంటాడుతోంది. నీటితో నిండిన నోవా కఖోవ్కా నగరంలో కొంతభాగం రష్యా అధీనంలో మరికొంత భాగం ఉక్రెయిన్ అధీనంలో ఉంది. తమ అధీన నగర ప్రాంతంలో ఐదుగురు చనిపోయారని రష్యా నియమిత మేయర్ వ్లాదిమిర్ గురువారం చెప్పారు. మరికొందరి జాడ గల్లంతైంది. స్థానికుల తరలింపు ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోంది. తాగునీరు కరువై అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్, మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ పూర్తిగా పోయిందని అధికారులు చెప్పారు.

నష్టపరిహారం ఇవ్వండి: జెలెన్‌స్కీ

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పర్యటించి అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. 'రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతవాసులకు వరద నష్టపరిహారం చెల్లించాలి. ఆస్తులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి సాయం అందించాలి' అని తర్వాత ఆయన కార్యాలయం ఆన్‌లైన్‌లో ఒక డిమాండ్ పంపింది. '600 చదరపు కిలోమీటర్ల భూభాగం నీటమునిగింది. ఇక్కడ ఏకంగా 18 అడుగుల ఎత్తులో నీరు నిలిచింది. 14,000కుపైగా భవనాలు నీటమునిగాయి. 4,000కుపైగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు పంపాం' అని రష్యా నియమిత ఆ ప్రాంత గవర్నర్ ఒలెక్సాండర్ ప్రొకుడిన్ చెప్పారు. నీపర్ నది తూర్పు పరివాహక ప్రాంతంలో మూడింట రెండొంతుల భూభాగం రష్యా ఆక్రమణలో ఉంది.



నీటిలో మునిగిన నిప్రియనీ గ్రామం

ఇది విధ్వంసకర దాడే: మేక్రాన్

'డ్యామ్‌ను కూల్చేయడం ముమ్మాటికీ విధ్వంసకర దాడే. అరాచక చర్య ఇది' అని ఏ దేశాన్నీ ప్రస్తావించకుండా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ ట్వీట్‌చేశారు. వాటర్ ప్యూరిఫయర్‌లు, 5,00,000 ప్యూరిఫికేషన్ టాబ్లెట్లు, శుభ్రతా కిట్‌లు పంపిస్తున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. 'డ్యామ్ కూలడానికి మూడు రోజుల ముందు 200 సైనిక వాహనాలు, 2,000 మంది సైనికులను కోల్పోయిన ఉక్రెయిన్ ఆ ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు డ్యామ్‌ను ఉక్రెయినే కూల్చింది' అని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ఆరోపించారు.

ముంబైలో మరో శ్రద్ధావాకర్ ఘటన

- సహజీవన భాగస్వామిని 20 ముక్కలుగా నరికిన దుర్మార్గుడు
- శరీరభాగాలను బకెట్లలో, కొన్ని కుక్కర్‌లో ఉడికించి దాచిపెట్టిన వైనం

ముంబై: కలిసుందామంటూ నమ్మి వచ్చిన మహిళను అత్యంత పాశవికంగా ముక్కలుగా నరికిన విషాద ఘటనకు వాణిజ్య నగరం ముంబై వేదికైంది. ఢిల్లీలో యువతి శ్రద్ధావాకర్‌ను సహజీవన భాగస్వామి అఫ్తాబ్ పూనావాలా 35 ముక్కలుగా నరికి పారేసిన ఘటన మరువకముందే ముంబై మహానగరంలో అచ్చం అలాంటి ఘటనే వెలుగుచూసింది. సంబంధిత నిందితుడు మనోజ్ సానెను అరెస్ట్‌చేసి దర్యాప్తు వేగవంతం చేశామని ముంబై డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయంత్ బజ్బాలే వెల్లడించారు. ముంబై కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా జూన్ 16వ తేదీ దాకా అతడిని పోలీస్‌కస్టడీకి అప్పగిస్తూ జడ్జి ఉత్తర్వులిచ్చారు. పోలీసులు వెల్లడించిన కేసు వివరాల ప్రకారం.. ముంబైలోని మీరా రోడ్‌లోని గీతా నగర్ ప్రాంతంలో 32 ఏళ్ల సరస్వతీ వైద్య గత కొన్నేళ్లుగా 56 ఏళ్ల మనోజ్ సానె అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వీరిద్దరూ అక్కడే ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

వీధి కుక్కలకు ఆహారంగా..

కాగా, బుధవారం అర్ధరాత్రి దాటాక వీరి అపార్ట్‌మెంట్ నుంచి తీవ్రస్థాయిలో దుర్వాసన ఇరుగుపొరుగు ఇళ్లకు పాకింది. దీంతో అనుమానంతో పొరుగింటివారు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గడియ పెట్టి మనోజ్ లోపలే పలకకుండా ఉండటంతో పోలీసులు తలుపు బద్దలుకొట్టి లోపలికెళ్లగా నివ్వెరపోయే నిజాలు వెల్లడయ్యాయి. కుళ్లిపోయిన సరస్వతి మృతదేహం భాగాలను పోలీసులు కనుగొన్నారు. నిందితుడు అత్యంత దారుణంగా 20 ముక్కలుగా నరికేసి కొన్నిటిని ప్రెషర్ కుక్కర్‌లో ఉడకబెట్టినట్లు తెలుస్తోంది. కొన్నింటిని మిక్సీలో గ్రైండ్ చేసినట్లు సమాచారం. ఆదివారం సరస్వతి ఆత్మహత్య చేసుకుందని, శరీరాన్ని మాయం చేసేందుకే మృతదేహాన్ని నరికేశానని నిందితుడు చెప్పినట్లు పోలీసు వర్గాల సమాచారం. మనోజ్‌ను అరెస్ట్‌చేసిన పోలీసులు నిజం కక్కించే పనిలో పడ్డారు. మరణానికి అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు. శరీరం పై సగభాగాన్ని ముక్కలుగా నరికి కొన్నింటిని పారేసినట్లు తెలుస్తోంది. కొన్ని ముక్కలు వంట పాత్రలు, బకెట్లు, ప్లాస్టిక్ బ్యాగుల్లో దాచిపెట్టాడు. దుర్వాసన రాకుండా రూమ్‌ఫ్రెషనర్‌లను కొట్టేవాడు. లభించిన శరీరభాగాలను అనాలసిస్ కోసం పోలీసులు జేజే ఆస్పత్రికి తరలించారు. ఫ్లాట్‌లో అరెస్ట్‌చేసినపుడు అతడిలో ఎలాంటి భయం, బాధ కనిపించలేదని పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గత రెండు, మూడు రోజులుగా నిందితుడు పరిసరాల్లోని వీధి కుక్కలకు మాంసాహారం అందిస్తున్నాడని, గతంలో అతనిలా చేయడం ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెప్పారు.



నిందితుడిని తీసుకెళ్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) సరస్వతి, మనోజ్ (ఫైల్)

రేషన్ షాప్ వద్దే పరిచయం

శరీర భాగాలను ఫ్లాట్ పక్కన కాలువలో, రైల్వేట్రాక్ సమీప కాలువలో పడేసి ఉంటాడని పోలీసు వర్గాలు తెలిపాయి. నిందితుడు వాడిన రంపాన్ని స్వాధీనం చేసుకున్నారు. శ్రద్ధావాకర్ హత్యోదంతంపై ఈ నిందితుడికి పూర్తి అవగాహన ఉందని భావిస్తున్నారు. సరస్వతి, మనోజ్‌ల గొడవలు, ఇతర సమాచారం ఏవైనా తెలిస్తే చెప్పి దర్యాప్తునకు సహకరించాలని ఇరుగుపొరుగు వారిని పోలీసులు కోరారు. నిందితుడు గతంలో బోరీవాలీ ప్రాంతంలో ఉండేవాడని, ఐటీఐ డిగ్రీ చేసిన ఇతను రేషన్ దుకాణంలో పనిచేసేవాడని తెలుస్తోంది. సరస్వతి ఒక అనాథ అని సమాచారం. 2014లో తొలిసారిగా వీరిద్దరికీ ఆ రేషన్ షాప్ వద్దే పరిచయం ఏర్పడి తర్వాత ప్రేమగా మారి చివరికి సహజీవనానికి దారితీసిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

కెనడాలో ఖలిస్తాన్‌వాదుల దుశ్చర్య

న్యూఢిల్లీ: కెనడాలో ఖలిస్తాన్ వేర్పాటువాదులు భారత్ పట్ల తమ విద్వేషాన్ని మరోసారి వెళ్లగక్కారు. భారత మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీని అవమానిస్తూ ఒక శకటం రూపొందించారు. ఇటీవల కెనడాలోని బ్రాంప్‌టన్ నగరంలో జరిగిన ఒక పరేడ్‌లో సంబంధిత శకటాన్ని ఆవిష్కరించారు. ఇందిరపైకి ఆమె సిక్కు అంగరక్షకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడం, ఆ చర్యను తాము సమర్థిస్తున్నట్లుగా ఆ శకటాన్ని ఖలిస్తాన్ వేర్పాటువాదులు రూపొందించారు. ఆ 5 కి.మీ.ల పరేడ్ తాలూకు వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అయింది. దీంతో ఈ ఉదంతంపై భారత్ ఘాటుగా స్పందించింది. వేర్పాటువాదులు, ఉగ్రవాద శక్తులకు ఆశ్రయం ఇస్తున్న దేశంగా అపకీర్తిని మూటగట్టుకోవద్దని కెనడాను భారత్ హెచ్చరించింది. ఈ మేరకు విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడారు. 'ఖలిస్తాన్‌వాదులకు కెనడా ఆశ్రయంగా తయారైంది. అక్కడి ప్రభుత్వం సైతం ఓటు బ్యాంక్ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తోంది. ఇలాంటివి భారత్, కెనడా సత్సంబంధాలకు మంచిది కాదు' అని అన్నారు. ఘటనపై విచారం వ్యక్తంచేస్తూ భారత్‌లో కెనడా హైకమిషనర్ కేమెరాన్ మ్యాక్‌కే ట్వీట్‌చేశారు.

కఠిన చర్యలకు డిమాండ్‌చేయాలి: కాంగ్రెస్

'కెనడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ కార్యక్రమ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకునేలా జైశంకర్ ఒత్తిడిచేయాలి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ డిమాండ్‌చేశారు.

భారత్‌లో మిస్ వరల్డ్ 2023

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అందాల పోటీ మిస్ వరల్డ్-2023కు భారత్ వేదిక కానుంది. దాదాపు మూడు దశాబ్దాల అనంతరం మన దేశం ఈ పోటీకి వేదికవుతుండటం గమనార్హం. మిస్ వరల్డ్ 71వ ఎడిషన్ వచ్చే నవంబర్‌లో జరిగే అవకాశాలున్నాయి. తేదీలు ఖరారు కావాల్సి ఉంది. చివరిసారిగా 1996లో ఈ పోటీకి భారత్ వేదికైంది. '71వ మిస్ వరల్డ్ ఫైనల్‌కు భారత్ వేదికైనట్లు ప్రకటిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. మీ ప్రత్యేకమైన, విభిన్న సంస్కృతి, ప్రపంచ స్థాయి ఆకర్షణలను ప్రపంచంతో పంచుకోవడానికి మేం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఈ పోటీలో 130 దేశాల చాంపియన్లు అద్భుతమైన భారత్‌లో తమ నెల రోజుల ప్రయాణంలో సాధించిన విజయాలను మిస్‌వరల్డ్ ఫైనల్‌లో ప్రదర్శించనున్నారు'అని మిస్ వరల్డ్ సంస్థ చైర్ పర్సన్, సీఈవో జూలియా మోర్లే గురువారం మీడియాకు తెలిపారు. భారత్ తరఫున ఈ ఏడాది పోటీల్లో మిస్ ఇండియా వరల్డ్ సిని షెట్టి ఈ పోటీల్లో పాల్గొంటారు.

ఈడీ ఎదుటకు అభిషేక్ బెనర్జీ భార్య రుజిరా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో బొగ్గు స్కామ్‌లో హవాలా/మనీలాండరింగ్ అంశానికి సంబంధించి కేసు దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ బెనర్జీ భార్య రుజిరాను ప్రశ్నించింది. ఆమె కోల్‌కతాలోని ఈడీ ఆఫీస్‌కు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వచ్చి నాలుగున్నర గంటల సమయంలో ఆమె తిరిగి వెళ్లిపోయారు. జూన్ ఎనిమిదిన తమ ముందు హాజరవ్వాలని ఈడీ గతంలోనే ఆమెకు సమన్లు జారీచేయడం తెల్సిందే. గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులుసహా మొత్తం ఐదుగురు అధికారులు ఆమెను దాదాపు మూడుగంటలపాటు ప్రశ్నించారు. ఆఫీస్‌కు ఆమెతో లాయర్ సైతం వచ్చారు. సోమవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు పిల్లలతోసహా వెళ్లేందుకు ప్రయత్నించిన ఆమెను కోల్‌కతా ఎయిర్‌పోర్ట్ అధికారులు అడ్డుకుని మరోమారు సమన్ల పేపర్లు ఇవ్వడం తెల్సిందే. ఎయిర్‌పోర్ట్‌లో అడ్డగింత వ్యవహారంపై ఆమె భర్త అభిషేక్ బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఏమైనా ఉంటే నాతో తేల్చుకోండి. కుటుంబసభ్యులను ఎందుకు వేధిస్తున్నారు?. పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం సరిగా జరగకుండా ఆపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది' అని అభిషేక్ ఆనాడు ఆరోపించడం తెల్సిందే. ఈ కేసులో గతంలోనూ ఈడీ, సీబీఐ ఆమెను ప్రశ్నించాయి. వినియోగంలోలేని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ నుంచి అక్రమంగా బొగ్గు తవ్వి వందలకోట్లు వెనకేసుకున్నారనే ఆరోపణలపై సీబీఐ కేసు నమోదుచేసి విచారిస్తోంది. కాగా, ఈడీ కేసును రాజకీయ కక్ష సాధింపు చర్యగా తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది. 'గతంలో అభిషేక్ బెనర్జీకీ సమన్లు ఇచ్చారు. ఆయన కేసు దర్యాప్తుకు సహకరించారు. కానీ ఇప్పుడు ఆయన కుటుంబాన్నీ వేధించడం సిగ్గుచేటు' అని టీఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ వ్యాఖ్యానించారు. సీబీఐ, ఈడీలు స్వతంత్రంగా దర్యాప్తు కొనసాగిస్తున్నాయని, వీటిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని పశ్చిమబెంగాల్ బీజేపీ రాష్ట్ర విభాగం స్పష్టం చేసింది. 'దర్యాప్తుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. తృణమూల్ ఆరోపణలు నిరాధారం. వారేమైనా ఫిర్యాదు చేయాలనుకుంటే కోర్టుకు వెళ్లొచ్చుగా' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మజుందార్ అన్నారు.

ఆర్యన్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడమే ఎన్సీబీ లక్ష్యం: వాంఖడే

ముంబై: ముంబై తీరంలో విలాసవంత కార్డిలా నౌకలో మాదకద్రవ్యాల పట్టివేత కేసులో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడమే లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ) ప్రత్యేక దర్యాప్తు బృందం పనిచేసిందని ఆ సంస్థ మాజీ ముంబై జోనల్ డైరెక్టర్ సమీర్ వాంఖడే ఆరోపించారు. కాగా, ఈ కేసు నుంచి ఆర్యన్‌ను తప్పించేందుకు షారుఖ్ కుటుంబం నుంచి రూ.25 కోట్లు డిమాండ్ చేశాడన్న ఆరోపణలపై వాంఖడేపై సీబీఐ కేసు నమోదైన విషయం తెల్సిందే. దీంతో తనపై సీబీఐ కేసును కొట్టేయాలంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. గురువారం హైకోర్టుకు రీజాయిండర్ అఫిడవిట్ సమర్పించిన సందర్భంగా వాంఖడే పలు విషయాలను ప్రస్తావించారు. ఆర్యన్‌ను అరెస్ట్‌చేసిపుడు సాక్షిగా ఉన్న కేపీ గోసావీ.. ఆర్యన్‌తో సెల్ఫీ దిగడం ఎన్సీబీ అనుమతితో జరగలేదు. 'సెలబ్రిటీ కాబట్టే అలా ఫొటో తీసుకుని ఉంటాడు' అని వాంఖడే తరఫున హాజరైన అబాద్ పండా కోర్టులో వాదించారు. దర్యాప్తు కీలక దశలో ఉన్న ఈ సమయంలో వాంఖడేకు అరెస్ట్ నుంచి రక్షణ వద్దని సీబీఐ తరఫున హాజరైన కుల్‌దీప్ పాటిల్ వాదించారు. అయినాసరే అతనికి కల్పించిన తాత్కాలిక రక్షణను హైకోర్టు జూన్ 23వ తేదీదాకా పొడిగించింది. అదే తేదీకి కేసు విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ ఎస్‌జీ డిగేల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

సరిహద్దుల్లో శాంతితోనే చైనాతో సత్సంబంధాలు

విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: చైనాతో సత్సంబంధాలపై భారత్ మరోసారి స్పష్టతనిచ్చింది. తూర్పు లద్దాఖ్‌లోని సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా ఆ దేశంతో సాధారణ సంబంధాలను సాగించడం వీలుకాదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కుండబద్దలు కొట్టారు. సరిహద్దులకు అత్యంత సమీపంలో చైనా తన బలగాలను మోహరించడమే ప్రధాన సమస్య అని ఆయన గురువారం మీడియా సమావేశంలో పేర్కొన్నారు. చైనాతో సంబంధాలను మెరుగుపర్చుకోవాలని భారత్ కూడా కోరుకుంటోందన్న ఆయన.. రెండు దేశాల సరిహద్దుల్లో శాంతి, సుస్థిరత నెలకొన్నప్పుడు మాత్రమే అలాంటిది సాధ్యమని పేర్కొన్నారు. చైనా ఒప్పందాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇదే విషయాన్ని ఆ దేశానికి తెలియజేశామన్నారు. ఘర్షణలు, రెచ్చగొట్టే చర్యలు, తప్పుడు కథనాలు వంటి వాటికి భారత్ భయపడబోదన్నారు. సరిహద్దుల్లో పరిస్థితులు, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ల పట్ల చైనాకు తన నిరసనను భారత్ పలుమార్లు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణకు మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఇరు దేశాలకు ఉందన్నారు. 'ప్రస్తుతం అక్కడ కొనసాగుతున్న పరిస్థితులు చైనాకు కూడా ఏమంత మంచివికావు. సరిహద్దుల్లో పరిస్థితుల ప్రభావం ఇప్పటికే రెండు దేశాల సంబంధాలపై ప్రభావం చూపింది..ఇంకా చూపుతోంది. సరిహద్దుల్లో ప్రశాంతత లేనప్పుడు సాధారణ సంబంధాలను ఆశించడం సరికాదు'అని జై శంకర్ అన్నారు. 2020 మేలో సరిహద్దుల్లో ఘర్షణలు తలెత్తినప్పుడు చైనా బలగాలు భారత భూభాగాన్ని ఆక్రమించాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను మీడియా ప్రస్తావించగా.. సరిహద్దులకు అత్యంత సమీపంలో రెండు దేశాల బలగాల మోహరింపే అసలైన సమస్య అని మంత్రి బదులిచ్చారు. సమస్య పరిష్కారానికి రెండు పక్షాలు చర్చలు జరుపుతున్నాయని చెప్పారు. 'సంబంధాలు మాత్రం తెగిపోలేదు. విషయం ఏమిటంటే..రెండు దశాబ్దాల్లోనే అత్యంత భీకరంగా 2020 జూన్‌లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు బాగా క్షీణించాయి. గల్వాన్ ఘర్షణల తర్వాత రోజు ఉదయం చైనా విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడాను కూడా. ఆ తర్వాత కూడా దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు సాగిస్తున్నాం. అయితే, చైనా మాత్రం ఉద్దేశపూర్వకంగానే ఘర్షణలకు దిగుతోంది. అందుకే ఆ దేశంతో సంబంధాలు గాడినపడటం లేదు'అని వివరించారు. ఒక్క చైనాతో తప్ప అన్ని ముఖ్యమైన అన్ని దేశాలు, సమూహాలతో భారత్ సంబంధాలు గణనీయంగా అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు.



బెంగళూరులో నిర్మలా సీతారామన్ కుమార్తె వివాహం

దొడ్డబళ్లాపురం: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కుమార్తె వాఙ్మయి వివాహం బెంగళూరులో గురువారం నిరాడంబరంగా జరిగింది. ఉడుపి అదమారు మఠం బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం వాఙ్మయి- ప్రతీక్‌ల వివాహం బెంగళూరులోని టమరిండ్ ట్రీ అనే ఓ హోటల్లో జరిగింది. ఉడుపి మఠానికి చెందిన పలువురు స్వామీజీలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు ఇరు కుటుంబాల నుంచి అతి కొద్దిమంది బంధువులు మాత్రమే హాజరయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్న వాఙ్మయి ఒక ప్రముఖ పత్రికలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 9 । జూన్ । 2023



పట్టు మేళా

పట్టు చీరలంటే మగువలకు తగని మోజు అని తెలిసిందే. బెంగళూరు ఆర్ ఆర్ నగరలో జరుగుతున్న జాతీయ పట్టు చీరల మేళాలో సందర్శకులు

న్యూస్‌రీల్

ఎట్టకేలకు మదపుటేనుగు బందీ



పట్టుబడ్డ మదపుటేనుగు

దొడ్డబళ్లాపురం: గత కొన్ని రోజులుగా తెంగినకల్లు అటవీ ప్రదేశంలో సంచరిస్తూ పంటలు, తోటలపై పడి విధ్వంసం సృష్టిస్తున్న మదపుటేనుగును ఎట్టకేలకు లొంగదీసుకున్నారు. నాలుగు రోజులుగా కార్యాచరణ జరిపిన అటవీశాఖ అధికారులు మదపుటేనుగును బంధించారు. అభిమన్యు అనే పెంపుడు ఏనుగు, మరో 5 పెంపుడు ఏనుగుల సాయంతో సుదీర్ఘ కార్యాచరణ జరిపిన తరువాత మదపుటేనుగు గురువారం తెంగినకల్లు అటవీప్రదేశంలోని అరతాళుసంద్ర, కాడనకుప్పె గ్రామాల మధ్య పట్టుబడింది. పట్టుబడ్డ ఏనుగును తాత్కాలిక క్యాంప్‌నకు తీసుకువచ్చారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: తమిళనాడుకు చెందిన డిగ్రీ విద్యార్థిని మైసూరులోని ప్రైవేటు కళాశాలలో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలిని తమిళనాడులోని నీలగిరి జిల్లాకు చెందిన జిష్ణ గా గుర్తించారు. మైసూరులోని శ్రీరాంపుర్ ప్రైవేటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న జిష్ణ పరీక్షల్లో ఫెయిలై ఆ ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుందని పోలీసులు అనుమానిస్తున్నారు. మైసూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

అనుమానితుల కోసం డ్రోన్లతో వేట



శివమొగ్గ: శివమొగ్గ జిల్లా పోలీసులు అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడానికి డ్రోన్లను రంగంలోకి దించారు. శివమొగ్గ నగరంలోని తుంగా నగర పీఎస్ సీఐ రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం రాత్రి డ్రోన్ కెమెరాలను తీసుకుని పొదలు, నిర్జన ప్రదేశాల్లో గాలింపు చేపట్టారు. తుంగా నగర పరిధిలోని మల్లిగేనహళ్లి చట్టు పక్కల గ్రామాల్లో పర్యటించడంతో పాటు నిర్జన ప్రదేశాల్లో డ్రోన్ల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారని గాలించారు.

దేశానికి మరో ముప్పు ఉంది

- కోడిమఠం స్వామి జోస్యం

కోలారు: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగిన తరువాత దేశానికి మరో ప్రమాదం పొంచి ఉందని కోడిమఠం శివానంద శివయోగి స్వామి తెలిపారు. ఆయన తరచూ జోస్యాలు చెబుతూ ఉండడం తెలిసిందే. గురువారం తాలూకాలోని సుగటూరు గ్రామంలోని యోగి నారాయణ స్వామి మఠాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో చెప్పినట్లుగా ఈసారి రాష్ట్రంలో పూర్తి మెజారిటీ కలిగిన ప్రభుత్వం వచ్చింది. అదే విధంగా ఈ సంవత్సరం పెద్ద ప్రమాదం సంభవిస్తుందని తెలిపిన విధంగానే ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఆపై దేశానికి మరో పెను ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కైవార తాతయ్య మళ్లీ పుట్టి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. అలాంటి సూచనలు ఇప్పటికే కొండ ప్రాంతంలో కనిపించిందన్నారు. రాష్ట్రంలో ఆధ్యాత్మికత దారి తప్పితే ప్రభుత్వానికి ప్రమాదమని తెలిపారు.

సినిమా ఉత్సవం ప్రారంభం



సినిమా ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న సినీ నటి ఖుష్బు

దొడ్డబళ్లాపురం: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సినీనటి ఖుష్బు అన్నారు. యలహంక సమీపంలోని రేవా యూనివర్సిటీలో గురువారం ఏర్పాటు చేసి అంతర్జాతీయ విద్యార్థి సినిమా ఉత్సవాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ సినిమా, రాజకీయం, క్రీడలు ఇలా అనేక రంగాల్లో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయని వారికి ఇష్టమైన రంగంలో వారు రాణించవచ్చన్నారు. ఇటీవల దక్షిణ భారతదేశంలో నిర్మిస్తున్న సినిమాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించబడుతూ, ఆస్కార్ అవార్డులు కూడా పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. మూడు రోజులు జరిగే విద్యార్థి సినిమా ఉత్సవాల్లో మొదటి రోజు డా.పునీత్ రాజ్ కుమార్ నటించిన చివరి చిత్రం గంధదగుడి ని ప్రదర్శించారు.

ఊరిస్తున్న మండళ్ల పదవులు



మంత్రి పదవులకు అవకాశం లేకపోవడంతో ఇతర పోస్టులపై దృష్టి



శక్తికేంద్రం విధానసౌధ సముదాయం

- నామినేటెడ్ పోస్టుల కోసం హస్తం ఎమ్మెల్యేల లాబీయింగ్

సాక్షి, బెంగళూరు: కొత్త సర్కారులో మంత్రి పదవి దక్కని వారి చూపు పాలకమండళ్లపై పడింది. ఇప్పటికే 34 మంది మంత్రులతో పూర్తి కేబినెట్ ఏర్పడడంతో ఇక మంత్రివర్గంలో ఎవరికీ చోటు లేకపోయింది. ఈ క్రమంలో నామినేటెడ్ పదవుల కోసం లాబీయింగ్‌లు షురూ చేశారు.

అధికార కాంగ్రెస్ పార్టీలో సుమారు 60 మందికి పైగా ఎమ్మెల్యేలు పాలక మండళ్లపై కన్ను వేశారు. ఇందుకోసం ప్రధాన నేతల ఇళ్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. తమకు కావాల్సిన పాలక మండలి అధ్యక్ష పదవి కోసం లాబీయింగ్ చేస్తూ డిమాండ్లు పెడుతున్నారు. అందులో బీడీఏ, బీడబ్ల్యూఎస్ఎస్బీ, కేఎస్ఆర్టీసీ, గృహ మండలి, కేఎస్‌డీసీఎల్, కర్ణాటక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ, ఎంఎస్ఐఎల్, అటవీ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన వర్గాల శాఖ పాలక మండళ్లపై నేతలు ఎక్కువగా ఆసక్తి కనపరుస్తున్నారు.

బీడీఏ కుర్చీకి పోటీ

బెంగళూరులో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న బీడీఏ అధ్యక్ష పదవి కోసం సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. మైనార్టీ కోటా కింద ఇప్పటికే మంత్రివర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రులు అయ్యారు. ఒక్కలిగ వర్గం నుంచి మొత్తం 21 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే మంత్రివర్గంలో పెద్దగా పదవులు దక్కలేదు. ఈ క్రమంలో కనీసం పాలక మండళ్లలోనైనా తనకు ప్రాధాన్యం దక్కాలని ఆ వర్గం ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ పగ్గాల కోసం రేసు

ఇక కేఎస్ఆర్టీసీ విభాగానికి ఉత్తర కర్ణాటకకు చెందిన పలువురు ఎమ్మెల్యేల పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే చిక్కబళ్లాపుర జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కూడా కేఎస్ఆర్టీసీ పాలక మండలి చైర్మన్ పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ పదవుల భర్తీపై కాంగ్రెస్ రాష్ట్ర పెద్దలు, హైకమాండ్ ఏ విషయం చెప్పడం లేదు. మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున ఈ నియామకాల ప్రభావం ఎన్నికలపై పడకుండా జాగ్రత్త పడాలని భావిస్తోంది.

రాజకాలువలపై కబ్జాలు తొలగించాలి

- అధికారులకు డీకేశి ఆదేశం
- బెంగళూరులో పర్యటన



రాజకాలువను పరిశీలిస్తున్న డీకే

బనశంకరి: బెంగళూరు నగరంలో రాజకాలువలపై ఆక్రమణలను తక్షణం తొలగించాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. బెంగళూరు నగరాభివృద్ధి మంత్రిగా ఆయన తొలిసారి గురువారం బెంగళూరు నగర పర్యటన చేశారు. బీఎంటీసీ బస్సులో పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్, పాలనాధికారి రాకేశ్‌సింగ్ తో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలం సమయంలో బెంగళూరులో పలుప్రాంతాల్లో ముంపు, వరదలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురిఅవుతారు. దీనికి కారణం రాజకాలువలు ఆక్రమణ అని పలుచోట్ల నగరవాసులు డీకేకి ఫిర్యాదు చేశారు. ఈ విషయం తీవ్రంగా పరిగణించిన డీకే రాజకాలువలు ఆక్రమణలు పట్ల అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 12 మీటర్ల వెడల్పు ఉన్న రాజకాలువను దివ్యశ్రీ అపార్టుమెంట్ నిర్వాహకులు 7 మీటర్లు మేర ఆక్రమించారని, ఇది ఇలాగే కొనసాగితే వర్షాకాలంలో వరదలు ఏర్పడి సమస్య తలెత్తుతుందన్నారు. తక్షణం కబ్జాలను కొట్టివేసి రాజకాలువలను త్వరితగతిన నిర్మించాలని కమిషనర్‌కు ఆదేశించారు. అంతకు ముందు యమలూరు మెయిన్‌రోడ్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తిచేయాలని సూచించారు. బెల్లందూరు చెరువును సందర్శించి పూడిక నిండిపోయిందని, తక్షణం తొలగించాలని తెలిపారు.

ట్రాఫిక్ జామ్

ఉదయం 11 గంటలకు డీకే శివకుమార్ నగర పర్యటన చేపట్టగా ఆయన వెళ్లిన మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నెహ్రూ తారాలయ రోడ్డు, హెచ్ఏఎల్ రోడ్డు, యమలూరు జంక్షన్ తో పాటు ప్రధాన రోడ్లలో వాహనాలు కిక్కిరిశాయి.

సఫారీలో పులి, కూనలు దర్శనం

మైసూరు: నాగరహొళె అరణ్యంలో దమ్మనకట్టె సఫారీ ప్రాంతంలో గురువారం పులితో పాటు పులి పిల్లలు కనిపించాయి. ఉదయం 9 గంటలకు ఈ పులి, పులి పిల్లలు కనిపించడంతో పర్యాటకులు ఫుల్ ఖుషీ అయ్యారు. గత నెలలో కురిసిన వర్షానికి నాగరహొళె పులి సంరక్షిత ప్రాంతం మొత్తం ఆకుపచ్చని చెట్లు, మొక్కలతో హరితవనంగా మారింది. ఆహ్లాదకరమైన ఈ ప్రాంతం చూడాలని పర్యాటకులు వస్తున్నారు. అలాగే ఈ పచ్చటి చెట్ల మధ్య వణ్యప్రాణులు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. పర్యాటకులంతా ఉత్సాహంతో వాటిని కెమెరాల్లో బంధించారు.

చిగరి బస్సుల్లో మహిళలకు నో ఫ్రీ !



చిగరి బస్సు సర్వీస్

హుబ్లీ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం హుబ్లీ ధార్వాడ జంట నగరాల్లోని ప్రతిష్టాత్మక బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం(బీఆర్‌టీఎస్) చిగరి బస్సుల్లో లేదని సంబంధిత అధికారులు తెలిపారు. రూ.కోట్ల వ్యయంతో హుబ్లీ ధార్వాడ నగరాల మధ్య ప్రత్యేక మార్గం ద్వారా చిగరి బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. కాగా బీఆర్‌టీఎస్ పేరిట నిర్వహిస్తున్న చిగరి బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వాయువ్య ఆర్‌టీసీ సంస్థ ఎండీ భరత్ విలేకరులకు తెలిపారు.

గ్యారంటీ దరఖాస్తులను తిరస్కరించవద్దు: సీఎం

బనశంకరి: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఐదు గ్యారంటీ పథకాలకు దరఖాస్తుల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలి, అనవసర పత్రాలు అడగరాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులకు సూచించారు. కుంటిసాకులతో దరఖాస్తులు తిరస్కరించరాదన్నారు. గురువారం గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాల గురించి ప్రభుత్వ సీనియర్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాల్లో గృహజ్యోతి ఆగస్టు 1వ తేదీ, అదే నెల 17,18 తేదీలలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. గృహజ్యోతి పథకాన్ని ఆగస్టు ఒకటిన కలబురిగిలో ప్రారంభించాలని యోచిస్తున్నామని, ఈ పథకంలో గందరగోళాన్ని పరిష్కరించి జాగృతం చేయాలన్నారు. గృహలక్ష్మి పథకాన్ని 17,18 తేదీలలో బెళగావిలో ప్రారంభిస్తామన్నారు.

నిలిచి ఉన్న అంబులెన్స్‌కు లారీ ఢీ

- ముగ్గురు దుర్మరణం

చెళ్లకెరె రూరల్: మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ అదుపు తప్పి నిలిచి ఉన్న లారీని ఢీకొనడంతో ముగ్గురు ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన పుణె-బెంగళూరు జాతీయ రహదారి-4పై చిత్రదుర్గ జిల్లా మల్లాపుర వద్ద గురువారం జరిగింది. మృతులను కనకమణి (72), ఆకాష్(17)తో పాటు అంబులెన్స్ డ్రైవర్‌గా గుర్తించారు. వీరు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి తమిళనాడుకు వెళుతున్నట్లు సమాచారం. తమిళనాడులోని తిరునెల్వేలి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందడంతో అతని మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా చిత్రదుర్గ జిల్లా మల్లాపుర వద్ద ఈ దుర్ఘటన సంభవించింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స కోసం చిత్రదుర్గ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో అంబులెన్స్ నుజ్జు నుజ్జయింది. విషయం తెలిసిన వెంటనే చిత్రదుర్గ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ప్రతి దానికి రేటు : కుమార

సాక్షి బెంగళూరు: రాష్ట్రంలో బదిలీ దందాలకు ప్రభుత్వం తెరదీసిందని జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. పార్టీ కార్యాలయం జేపీ భవన్‌లో వివిధ జిల్లాల నేతలతో ఆత్మావలోకనం సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతి విషయానికి ఆరోపించిన ఈ కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రాగానే ప్రతి ఉద్యోగానికి, బదిలీలకు రేట్ ఫిక్స్ చేసి దండుకుంటున్నారని ఆరోపించారు. గతంలో పేసీఎం పేరిట ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రస్తుతం అంతకంటే ఎక్కువగా దండుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ గ్యారెంటీలకు గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు., ఈ ఐదు పథకాలపై కూడా గందరగోళాలు ఉన్నాయన్నారు.

ఐడీ కార్డు కొట్టేసి ఐఐఎస్‌సీలో చోరీలు



నిందితుడు జియావుల్లా

కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని సదాశివనగరలో ఉన్న ఐఐఎస్‌సి క్యాంపస్‌లో కొన్ని నెలలుగా చోరీలకులకు పాల్పడుతున్న బెంగాల్‌వాసి జియావుల్లా అనే దొంగను అరెస్టు చేశారు. ఇతడు తెలివిగా ఐఐఎస్‌సీలో ఎంటెక్ విద్యార్థికి చెందిన ఐడి కార్డును చోరీ చేసి దానిలో తన ఫోటోను అతికించుకున్నాడు. కార్డు వేసుకుని క్యాంపస్‌లో తిరిగేవాడు. కార్డు ఉండడంతో సెక్యూరిటీ గార్డులు కూడా అడ్డుకునేవారు కాదు. హాస్టళ్లలో చొరబడి విద్యార్థులకు చెందిన లాప్‌టాప్‌లు, కెమెరాలు, నగదు, 200 యూఎస్ డాలర్లను ఎత్తుకెళ్లాడు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేసి దొంగను పట్టుకున్నాడు. నాలుగు చోరీలు చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు.

ఉప సభాపతిగా పుట్టరంగ

బనశంకరి: చామరాజనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే పుట్టరంగశెట్టి విధానసభ ఉప సభాపతి పదవికి అంగీకరించారు. మంత్రి పదవి కావాలని ఆయన పట్టుబట్టగా అది దక్కలేదు. దీంతో స్పీకర్ పదవిని స్వీకరించాలని కాంగ్రెస్ నాయకత్వం సూచించగా పుట్టరంగశెట్టి నిరాకరించారు. తరువాత స్పీకర్ స్థానం యూటీ ఖాదర్‌కు లభించింది. సీఎం, డిప్యూటీ సీఎంలు ఆయనకు ఏడాది అనంతరం మంత్రిగా అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో డిప్యూటీ స్పీకర్‌గా ఉండటానికి సమ్మతించారు.

నేనలా చెప్పలేదు: హోంమంత్రి

బనశంకరి: పోలీసులు కుంకుమ, విభూతి పెట్టుకోరాదని నేను ఎక్కడా ఆదేశించలేదని హోం మంత్రి పరమేశ్వర్ చెప్పారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు కుంకుమ, విభూతి ఏదైనా పెట్టుకోవచ్చు కానీ, వారికి కూడా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. చట్టపరంగా విధులు నిర్వహించాలని చెప్పానని, కానీ ఎవరు అసత్య ప్రచారం చేశారో వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

మద్యం మత్తులో భార్యను చంపి

- భర్త బలవన్మరణం

సాక్షి బెంగళూరు: మద్యం మత్తులో ఇంట్లో పడుకుని ఉన్న భార్యను హత్య చేసి ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకున్నాడో భర్త.. ఈ ఘటన బెళగావి జిల్లా రాయభాగ తాలూకా చించలి ఉప్పరవాడిలో జరిగింది. భర్త ధరేప్ప తన భార్య ఉషాను కత్తితో పొడిచి చంపేశాడు. ఆ తర్వాత అదే గదిలో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. వీరిద్దరికి 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు. భర్త మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంలో ఇరువురు మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా ఫుల్లుగా తాగి వచ్చిన భర్తతో ఉష గొడవపడింది. అనంతరం ఉష పిల్లలను తీసుకెళ్లి గదిలో పడుకుంది. తీవ్ర ఆగ్రహంతో ఉన్న భర్త ధరేప్ప నిద్రలో ఉన్న భార్య గొంతు కోసి చంపేశాడు. కుడచి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

గృహ ప్రవేశం చేసిన ఐదు రోజులకే..

- యువతి ఆత్మహత్య



మృతురాలు అశ్విని బంగేరా (ఫైల్)

యశవంతపుర: ఇంటిని కొనుగోలు చేసి గృహప్రవేశం చేసిన ఐదు రోజులకే ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాలలో జరిగింది. ఉళ్లాల ఫరంగిపేటకు చెందిన అశ్విని బంగేరా (25) కుంపల చిత్రాంజలి నగరలో ఇంటిని కొనుగోలు చేసింది. ఉన్నత చదువులు చదివి, అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా తన బంధువుల ద్వారా ఇంటిని కొన్నారు. నెలన్నర క్రితం ఉళ్లాలకు వచ్చి ఈనెల 3న వైభవంగా గృహప్రవేశం చేశారు. బుధవారం రాత్రి తన స్నేహితుడికి ఐ లవ్ యూ అని సందేశం పెట్టారు. గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గురువారం ఉదయం స్నేహితుడు వచ్చి తలుపు తట్టగా విషయం బయట పడింది. 20 పేజీల డెత్‌నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి కొనుగోలులో మోసపోయానని, రుణం చెల్లింపులపై బ్యాంక్ అధికారులు తనను వేధిస్తున్నట్లు రాసి ఉంది. సమస్యలపై విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉళ్లాల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బస్సును తాకుతూ వెళ్లిన లారీ

- మహిళ చేయి కట్



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బళ్ళారికి చెందిన సుధా

పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా తాడిపత్రి మండల పరిధిలోని వీరేపల్లి గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై కర్ణాటక ఆర్టీసీ బస్సు- లారీ రాపిడికి గురైన ఘటనలో మహిళ చేయి కట్ అయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం తాడిపత్రి వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన లారీ దగ్గరగా తాకుతూ వెళ్లింది. ఈ బస్సు బళ్లారికి వెళ్తోంది. బస్సులో వెనుక సీటులో ప్రయాణిస్తున్న సుధా అనే మహిళ కుడి చేయి బయట పెట్టుకోగా ముంచేతి పై భాగం వరకు తెగి కిందపడింది. గమనించిన తోటి ప్రయాణీలు గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును ఆపాడు. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి, అటునుంచి అనంతపురం పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బస్సు, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రౌడీల ఇళ్లలో సోదాలు

- బెంగళూరులో కార్యాచరణ



రౌడీలను ప్రశ్నిస్తున్న పోలీసులు

బనశంకరి: బెంగళూరు నగర పోలీసులు రౌడీల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే నగరంలోని 8 విభాగాల పరిధిలోని పోలీస్‌స్టేషన్ల ఏరియాలలో గల 1,344 మంది రౌడీల ఇళ్లలో సోదాలు చేశారు. ఇందులో 9 కిలోల గంజాయి, కత్తులు, రాడ్లు వంటి ఆయుధాలు, 15 వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిపై కేసులు నమోదు చేశారు. 46 మంది బెయిలుకు వీల్లేని వారెంట్లు ఉన్న రౌడీలు ఈ దాడుల్లో దొరికిపోయారు. పశ్చిమ విభాగంలో 177 మంది రౌడీలు, దక్షిణలో 175, ఉత్తరలో 254, కేంద్ర లో 90, తూర్పులో 207, ఆగ్నేయ లో 160, ఈశాన్య లో 156, వైట్‌ఫీల్డ్ లో 125 మంది రౌడీల ఇళ్లలో గాలింపు జరిపారు. ఎలాంటి నేర కార్యకలాపాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు పాల్గొనరాదని హెచ్చరించారు. ఉదయం 10 గంటల వరకు సోదాలను కొనసాగించారు.

ఆట కట్టిస్తాం: కమిషనర్

ఇటీవల నూతన పోలీస్ కమిషనర్ దయానంద్ మాట్లాడుతూ నగరంలో రౌడీల ఆట కట్టిస్తామని, రియల్‌ఎస్టేట్ దందాలో పాల్గొంటున్న రౌడీలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. తరువాత పోలీస్ అధికారులతో సమావేశమై రౌడీలపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రి చెలువరాయపై ఫిర్యాదు



కలెక్టరేట్లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు


మండ్య: పగ, ద్వేషం లేకుండా ప్రజల కోసం పని చేస్తానని ప్రమాణం చేసిన మంత్రి.. మీరెవరూ నాకు ఓటు వేయలేదు, కాబట్టి అభివృద్ధి గురించి తనను అడగవద్దని అనడం రాజ్యాంగ ఉల్లంఘన అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎన్. చలువరాయస్వామిపై జిల్లా బీజేపీ నాయకులు గురువారం కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేశారు. కార్యకర్తల బహిరంగ సమావేశంలో పాల్గొని మంత్రి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎవరు ఓటు వేయలేదో వారు వచ్చి అభివృద్ధి పనుల గురించి అడగవద్దని చెప్పారని, ఆయనను తక్షణమే ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని కోరారు. బాధ్యత కలిగిన మంత్రి పదవిలో ఉండి ప్రజల కోసం పని చేయాలి తప్ప పార్టీ కోసం కాదన్నారు. కాంగ్రెస్ కోసమే పనిచేస్తాననుకుంటే పదవులకు రాజీనామా చేయాలన్నారు.

కరడుగట్టిన బైక్‌చోరుల పట్టివేత

సాక్షి, బెంగళూరు: రాజధానిలో పగలు, రాత్రిఅనే తేడా లేకుండా ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువ చేసే పది బైక్‌లను కెంపేగౌడ నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇర్ఫాన్ పాషా, రోహిబ్ ఖాన్ అనే నిందితులు పోలీసులకు పట్టుబట్టారు. నంజాంబ అగ్రహారలోని ఒక ఇంటి ముందు నిలిపిన బైక్‌ను దొంగిలించిన కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తుండగా ఈ నిందితులు పట్టుబట్టారు. వీరిని మరింతగా విచారించగా మరిన్ని చోరీలు వెలుగు చూశాయి. ఇదివరకే రాజాజీనగర, చంద్రాలేఔట్, అశోక్‌నగర, కబ్బన్‌పార్కు పోలీసు స్టేషన్లలో చోరీల్లో అరెస్టు అయి విడుదలయ్యారు. బయటకు వచ్చిన తర్వాత కూడా పాత వృత్తినే కొనసాగించారు.

బీడీఏ అధ్యక్షుడిగా రాకేశ్ సింగ్

బనశంకరి: సీనియర్ ఐఏఎస్ అధికారి రాకేశ్ సింగ్‌ను బీడీఏతో పాటు 10 ప్రాధికారలకు అధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాకేశ్‌సింగ్ బీబీఎంపీ పాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆనేకల్ అభివృద్ధి ప్రాధికార, హోసకోటె అభివృద్ధి ప్రాధికార, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంత అభివృద్ధి ప్రాధికార, దొడ్డబళ్లాపుర అభివృద్ధి ప్రాధికార, మాగడి అభివృద్ధి ప్రాధికార, చెన్నపట్టణ అభివృద్ధి ప్రాధికార, కనకపుర, నెలమంగల, ఉపనగర రింగ్ రోడ్డు, గ్రేటర్ బెంగళూరు-బిడిది స్మార్ట్‌సిటీ ప్రాధికారాలకు అధ్యక్షుడిగా రాకేశ్ సింగ్ వ్యవహరిస్తారు.



మనసంతా ప్రశాంతత

కొండకోనలు, మధ్యలో నిశ్చలమైన తుంగభద్ర నది ప్రకృతి సౌందర్యారాధకులను తన్మయుల్ని చేస్తుంది. గురువారం హంపీ వద్ద అగుపించిన మనోహర దృశ్యం

క్లుప్తంగా

గుండెపోటుతో సీఐ మృతి


ఇన్‌స్పెక్టర్ లింగరాజు(ఫైల్)

చెళ్లకెరె రూరల్: గుండెపోటుతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందిన ఘటన గురువారం జిల్లా కేంద్రం చిత్రదుర్గలో చోటు చేసుకుంది. వివరాలు..చిత్రదుర్గకు చెందిన లింగరాజు(36) బెంగళూరులో సీపీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఎస్ఐగా చిత్రదుర్గలో విధులు నిర్వహించారు. బుధవారం రాత్రి పని మీద బెంగళూరు నుంచి చిత్రదుర్గకు వచ్చి ఓ ప్రైవేట్ లాడ్జిలో బస చేశారు.

నియామకం

కోలారు: ఆల్ ఇండియా న్యూస్ పేపర్ ఎడిటర్స్ కాన్ఫరెన్స్(ఐనక్) న్యూఢిల్లీ కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్రం నుంచి కోలారుకు చెందిన ఈ ముంజానె దినపత్రిక సంపాదకుడు డాక్టర్ మహమ్మద్ యూనుస్ నియమితులయ్యారు. మొదటి సారిగా జిల్లా నుంచి ఐనక్ కార్యవర్గ సభ్యుడుగా మహమ్మద్ యూనుస్ నియమితులవడంపై జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు బి వి గోపినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెఎస్ గణేష్, వి మునిరాజు, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చంద్రశేఖర్, కోశాధికారి సురేష్‌కుమార్ అభినందించారు.

చేప మందు పంపిణీ


చేప మందు వేస్తున్న డాక్టర్ అలీ

రాయచూరు రూరల్: నగరంలోని జిల్లా జైలు కేంద్రం వద్ద మందుల దుకాణంలో గురువారం డాక్టర్ అలీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు వంద మందికి చేప మందును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృగశిర కార్తెలో ఆయాసం, ఉబ్బసం ఇతర వ్యాధులు సోకిన వారికి చేప మందు వాడడం వల్ల వ్యాధి నయం అవుతుందన్నారు.

జాగృతి కరపత్రాల విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు


రాయచూరు రూరల్: జిల్లాలో అతిసార వ్యాధి నివారణకు ఆరోగ్య శాఖాధికారులు నడుం బిగించాలని ఇన్‌చార్జి జిల్లాధికారి శశిధర్ కురేరా పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయంలో వ్యాధి నియంత్రణపై కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీటిని తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో ఏడీసీ కరలింగన గౌడ, జిల్లా ఆరోగ్య శాఖాధికార్లు సురేంద్రబాబు, గణేష్, శాకీర్‌లున్నారు.

ముళ్లపొదల్లో నవజాత శిశువు


ముళ్లపొదల్లో లభించిన శిశువును అక్కున చేరుకున్న మహిళలు

గంగావతి రూరల్: ఏ తల్లి కన్న ఆడబిడ్డో కాని నవ మాసాలు మోసి కనిపెంచాల్సిన కన్నతల్లి ఆడపిల్ల పుట్టిందనే కారణంతో ఆ తల్లికి ఏం కష్టం వచ్చిందో తెలియదు కానీ పుట్టిన రోజే గుర్తు తెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో పసికందును వదిలేసిన ఘటన తాలూకాలోని మరళి ఫ్యాక్టరీ సమీపంలో వెలుగు చూసింది. ముళ్ల పొదల్లో నుంచి నవజాత శిశువు ఏడుపు విన్న బాటసారులు ఆ శిశువును రక్షించారు. ఆ పసికందు యోగక్షేమాలను చూసి గంగావతి రూరల్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తక్షణం పోలీసులు అక్కడకు వెళ్లి నవజాత శిశువును స్వాధీనం చేసుకుని గంగావతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. శిశువు సంరక్షణకు చట్టపరమైన చర్యలను తీసుకుంటామని శిశు సంరక్షణాధికారి రోహిణి కొటగార తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి మహేష్

రాయచూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు పిల్లలకు సక్రమంగా ఆహార పదార్థాలను పంపిణీ చేయాలని రూరల్ సీడీపీఓ మహేష్ పేర్కొన్నారు. ఆయన గురువారం తాలూకాలోని బిజినగేరలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీలో లోటు రాకుండా చూడాలని సూచించారు.

జనం కంట్లో నలుసుల్లా క్వారీలు

- యథేచ్ఛగా గ్రానైట్ గనుల తవ్వకాలు
- పర్యవేక్షణ లేక తరచూ ప్రమాదాలు


ఉత్తర కర్ణాటకలో ఓ గ్రానైట్ గని


కోలారు సమీపంలో కొండను తవ్వేయడంతో చెరువులా మారిన దృశ్యం


బెంగళూరు సమీపంలో జల్లి క్రషర్‌ల వల్ల తీవ్ర కాలుష్యం

బనశంకరి: చట్టాలను అతిక్రమించి గ్రానైట్, కంకర క్వారీలు, క్రషర్లు రాష్ట్రంలో యథేచ్ఛగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విలువైన ఖనిజ సంపదను కొందరు కొల్లగొడుతుంటే గనులు, భూగర్భ శాఖ అధికారులు ఆఫీసులకే పరిమితమౌతున్నారు. దీంతో తవ్వకాలలో తరచూ ప్రమాదాలు జరిగి అమాయక కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కోలారు, శివమొగ్గ, చిక్కబళ్లాపుర జిల్లాల్లో గ్రానైట్, క్వారీ, క్రషర్లలో దారుణమైన ఘటనలు సంభవించి పదుల సంఖ్యలో కార్మికులు మృత్యువాత పడ్డారు. కానీ గనుల సురక్షతకు కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదని ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయి. లైసెన్సు రెన్యువల్ సమయంలో చురుకుగా పనిచేసే గనులశాఖ అధికారులు, సిబ్బంది ఆ తరువాత తవ్వకాలు చట్ట ప్రకారమే జరుగుతున్నాయా? అనేది పట్టించుకోవడం లేదు. దీంతో పరిమితికి మించి గ్రానైట్ కొండలను ఛిన్నాభిన్నం చేస్తూ అందినంత ఆదాయం పొందుతున్నారు.

సమీప గ్రామాలకు సమస్యలు

ఈ క్రమంలో సమీప గ్రామాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొండలను ధ్వంసం చేయడానికి భారీగా పేలుళ్లు జరపడం వల్ల గ్రామాల్లో ఇళ్లు దెబ్బతినడం మామూలే. విస్ఫోటనం శబ్దాలకు పశువులు బెదిరిపోవడం, ప్రజలకు దుమ్ముధూళి వల్ల జబ్బులు తప్పడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. నిబంధనల మేరకు క్వారీ క్రషర్లను గనుల అధికారులు సందర్శించి అన్నీ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలి. ఉల్లంఘనకు పాల్పడితే నోటీసుల జారీ, జరిమానాల విధింపు చేయాలి. కానీ ఒత్తిళ్లు, ప్రలోభాల వల్ల అధికారులు తమ పనిని నిర్వర్తించడం దాదాపు శూన్యంగా ఉంటోంది. ఏడాదికి ఒకటి రెండుసార్లు తూతు మంత్రంగా క్వారీలను పరిశీలించి మిన్నకుండిపోతున్నారు.

ఇష్టానుసారం పేలుళ్లు

క్వారీల్లో పెద్ద బండరాళ్లను పగలకొట్టడానికి జిలెటిన్ స్టిక్స్‌ను, డైనమెట్లను పేలుస్తారు.

ఇందుకు కేంద్ర గనుల సురక్షత ప్రధాన కార్యాలయ డైరెక్టరేట్ (డీజీఎంఎస్) అనుమతి తీసుకోవాలి. స్ఫోటక లైసెన్సు కలిగిన వ్యక్తి మార్గదర్శనంలో పేలుళ్లు జరపాలి. కానీ చాలా క్వారీల్లో ఉత్తర భారత దేశానికి చెందిన కార్మికులచే జిలెటిన్ స్టిక్స్‌ను అమర్చి పేలుళ్లు నిర్వహిస్తారు. అనేకసార్లు ఇది కార్మికుల ప్రాణాలకు ముప్పుతెస్తుంది. మాలూరు తాలూకా అనిమిట్టినహళ్లి క్వారీ, శివమొగ్గ, చిక్కబళ్లాపుర క్వారీల్లో జరిగిన దుర్ఘటనలు దీనికి ఉదాహరణ. శివమొగ్గలో 8 మంది, చిక్కబళ్లాపురలో 6 మంది, కోలారులో ఇద్దరు ఇటీవల పేలుళ్లలో చనిపోయారు.

ఈ నిబంధనలు పాటించాలి

- క్రషర్లు, క్వారీల నుంచి కాలుష్యం పెచ్చుమీరకుండా అనేక నిబంధనలు ఉన్నాయి.
- క్రషర్‌లో దుమ్ము వ్యాపించకుండా నిరంతరం నీటిని పిచికారి చేయాలి
- కార్మికులకు తరచూ ఆరోగ్య పరీక్షలు చేసి ఫిట్‌గా ఉన్నవారినే విధుల్లోకి తీసుకోవాలి
- క్రషర్‌లో రాళ్లు పొడి చేసే ధూళి బయటకు రాకుండా క్రషర్లు చుట్టూ ప్లాస్టిక్ షీట్లను అమర్చాలి
- ట్రక్కుల్లో జల్లి పౌడర్ తరలించే సమయంలో టార్పాలిన్‌తో కప్పాలి
- క్రషర్ చుట్టు 50 మీటర్లు స్థలంలో పచ్చదనంతో కూడిన మొక్కలు నాటాలి
- జిల్లాల్లో ఎక్కువ క్వారీ, క్రషర్ ఉండటంతో సంబంధిత యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించామని గనుల అధికారులు తెలిపారు.

ఎన్నికల హామీని నిలుపుకోవాలి


మాట్లాడుతున్న అశోక్ కుమార్ జైన్

రాయచూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రాయచూరుకు ఎయిమ్స్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని పోరాట సమితి సంచాలకుడు అశోక్ కుమార్ జైన్ డిమాండ్ చేశారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచూరుకే ఎయిమ్స్‌ను మంజూరు చేయాలన్నారు. కల్యాణ కర్ణాటకలో కలబుర్గికి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి డా.శరణ ప్రకాష్ పాటిల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. జిల్లాకు ఎయిమ్స్‌ను మంజూరు చేయాలని కోరుతూ 392వ రోజున ఆందోళన కొనసాగుతున్న విషయాన్ని మరిచి మంత్రి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మంత్రి పాటిల్ రాయచూరు పర్యటనకొస్తే గోబ్యాక్ కార్యక్రమం చేపడతామన్నారు.

కలుషిత నీరు తాగి బాలిక మృతి


నిర్మల(ఫైల్)

గంగావతి రూరల్: కొప్పళ జిల్లాలోని బీజికల్ గ్రామంలో నిర్మల(10) అనే బాలిక కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై గురువారం మృతి చెందిన ఘటన జరిగింది. ఈనెల 5వ తేదీన కొప్పళ జిల్లా బసరిహాళ గ్రామంలో హొన్నమ్మ(60) అనే మహిళ కలుషిత నీరు తాగి మృతి చెందిన విషయం తెలిసిందే. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి స్థానిక నీటి సరఫరా సంస్థకు నోటీసులు కూడా జారీ చేసింది. గత ఏడాది కాలంగా కల్యాణ కర్ణాటకలోని బెళగావి, రాయచూరు, కొప్పళతో సహా వివిధ జిల్లాల్లో కలుషిత నీరు తాగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగినప్పుడు పాలకులు బాధిత కుటుంబాలకు పరిహారం అందించి చేతులు దులుపుకుంటున్నారు. గత ప్రభుత్వం అనేక గ్రామాల్లో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.కోట్లాది ఖర్చు చేసినా కలుషిత నీటి బెడద నుంచి ప్రజలను రక్షించలేకపోతుండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు వాపోతున్నారు.

12 నుంచి ఎస్ఎన్ పేట్ అండర్ బ్రిడ్జి మూసివేత

బళ్లారిటౌన్: నగరంలోని ఎస్ఎన్ పేట్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద మహానగర పాలికె ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఈ నెల 12 నుంచి పనులు పూర్తయ్యే వరకు అండర్ బ్రిడ్జిలో అన్ని రకాల వాహనాల రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు పాలికె ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరింది.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం


ఉత్తమ విద్యార్థులను అభినందించిన దృశ్యం

బళ్లారిఅర్బన్: కర్ణాటక పట్టభద్రుల వేదిక 5వ వార్షికోత్సవాన్ని గురువారం సంగనకల్లు వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఎస్ఎస్ఎల్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన గ్రామీణ విద్యార్థులను గుర్తించి ఘనంగా సత్కరించారు. వేదిక అధ్యక్షులు కేకే హాళ్ గోవర్ధన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సత్కరించి వృద్ధాశ్రమంలోని వృద్ధులందరికీ అన్నదానం జరిపారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు కేకే హాళ్ గోవర్ధన్, విద్యాశాఖ అధికారి నైమూర్ రెహమాన్, భారతీయ వైద్య సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రేణుకా మంజునాథ, ప్రైవేట్ కళాశాల అధ్యక్షులు మర్రిస్వామి రెడ్డి, బీపీ న్యూస్ అరుణ్‌గోపాల్, కాంగ్రెస్ నాయకులు మారెప్ప, కళాకారులు మహమ్మద్ రఫీక్, ఉపన్యాసకులు ప్రభావతి పాటిల్, ఉపాధ్యాయులు రాజేష్, పంపాపతి, సదానందస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తీయరూ

రాయచూరు రూరల్: పలు వార్డుల్లోని మురుగు కాలువల్లో నిండిన పూడికను తొలగించాలని జై కన్నడ రక్షణ వేదిక అధ్యక్షుడు చెన్నయ్య స్వామి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించి ఆయన మాట్లాడారు. నగరంలోని 30, 31వ వార్డుల్లోకి వాన నీరు భారీగా చేరే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

11 అర్జీల స్వీకరణ

గంగావతి: కారటగిలోని ఏపీఎంసీ కార్యాలయంలో గురువారం లోకాయుక్త అధికారులతో జరిగిన సమావేశంలో 11 అర్జీలను డీఎస్పీ సలీంపాషా స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో జరిపిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

పాము కాటుకు వ్యక్తి బలి

చెళ్లకెరె రూరల్: తాలూకాలోని మహాదేవ సస్యక్షేత్రంలో గురువారం ఉదయం మొళకాల్మూరు తాలూకా అటవీ అధికారి ప్రకాష్(35) వాహ్యాళి చేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై మొళకాల్మూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వలసల నివారణే లక్ష్యం


మాట్లాడుతున్న పీడీఓ శేషగిరి

కంప్లి: మహిళలు, పిల్లలకు రక్షణ, వారి కుటుంబాలకు ఆర్థిక, నైతిక, సామాజిక, వైద్య, విద్యాభ్యాసం కల్పించి బడి పిల్లలు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా జాగృతి కల్పించడం పంచాయతీ కర్తవ్యమని సణాపుర పీడీఓశే శేషగిరి తెలిపారు. గురువారం సణాపురలో సణాపుర కావలు సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాలోచన సమావేశంలో హక్కుల నిఘా కేంద్రం సభ్యులు హెచ్‌సీ రాఘవేంద్ర మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న గృహ హింస, కుటుంబ దౌర్జన్యాలను అరికట్టడం, బాల్య వివాహాలు నిషేధించడం, పిల్లల హక్కులపై ప్రచారంతో పాటు ప్రత్యేకించి ఆడపిల్లల తరలింపుపై సమాచారం అందించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం అన్నారు. తాలూకాలోని 10 పంచాయతీల్లో నిరంతరం సభలను నిర్వహించడం ద్వారా పిల్లల రక్షణ సాధ్యం అన్నారు. సమావేశంలో పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్త్రీశక్తి గుంపు సభ్యులు, ప్రముఖులు తిప్పేస్వామి, నాగరాజ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజుల బెడదపై వినతి


సీఎంను కలిసిన ఏఐడీఎస్ఓ ప్రతినిధులు

బళ్లారి అర్బన్: ప్రైవేట్ విద్యా సంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజుల బెడదను తక్షణమే అరికట్టాలని బళ్లారి ఏఐడీఎస్ఓ నాయకులు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసి విన్నవించారు. విలీనం సాకుతో ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయడం, ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలను స్వయం ఆర్థిక నివారణ సంస్థలుగా మార్చడం, తద్వారా అధిక ఫీజులు వసూలు చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందుల గురించి వివరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి దివాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అపూర్వ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాయచూరు రూరల్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని కింది స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు పేర్కొన్నారు. బుధవారం రాత్రి వాల్కట్ మైదానంలో కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చేసిన సన్మానాన్ని స్వీకరించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత త్వరలో జరగబోయే జెడ్పీ, టీపీ, ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు ప్రామాణికంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసింహులు, జిందప్ప, మహ్మద్ శాలం, బషీరుద్దీన్‌లున్నారు.

అనుచిత స్టేటస్‌పై హిందూ సంఘాల ఆగ్రహం


మాట్లాడుతున్న హిందూ సంఘాల నాయకులు

హుబ్లీ: వివాదాస్పద వాట్సాప్ స్టేటస్ ద్వారా పొరుగున ఉన్న మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సరిహద్దు జిల్లా బెళగావిలో ఇద్దరు తమ వాట్సాప్ స్టేటస్‌లో అభ్యంతరకరంగా పోస్ట్ చేయడంతో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు ఏపీఎంసీ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ నారాయణ బరమనికి సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందించారు. సంఘం నేత శంకర్ పాటిల్ మాట్లాడుతూ కొల్హాపుర, నిప్పాణిల్లో ఘటనలు జరిగాక బెళగావిలో కూడా శాంతి భద్రతల సమస్యను ఉత్పన్నం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై సాక్ష్యాలను పోలీసులకు ఇచ్చామన్నారు. కొల్హాపురలో జరిగినట్లుగా బెళగావిలో జరగరాదని, ఎవరూ కూడా సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించరాదని ఆయన డిమాండ్ చేశారు. శ్రీరామ సేన నేత రవి కోకిత్‌కర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలోను పోకిరీల ప్రతికూల వ్యాఖ్యలు ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు.

కోలారు వార్తలు...

దశల వారీగా పోలీసుల నియామకం


మాట్లాడుతున్న ఐజీపీ బీఆర్ రవికాంతేగౌడ

మాలూరు: పట్టణంతో పాటు తాలూకాలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దశల వారీగా నియమిస్తామని కేంద్ర వలయం ఐజీపీ రవికాంతేగౌడ తెలిపారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాలూరు పోలీస్ స్టేషన్‌లో మొదట 21 మంది ఉండగా అనంతరం 32 మంది, ప్రస్తుతం 52 మంది పోలీసులు పని చేస్తున్నారన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో 100 మంది సిబ్బంది అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. నగరానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ అవసరంపై ఎస్పీతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, పరిశ్రమలు ఎక్కువ కావడం వల్ల ప్రమాదాలు అధికం అవుతున్నాయన్నారు. పెరుగుతున్న నేరాల అడ్డుకట్టకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు వద్ద కళాశాలకు వచ్చే విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీల ఆటకట్టుకు పోలీస్ బీట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎం.నారాయణ, పోలీస్ అధికారులు విఎస్ భాస్కర్, సి.మురళీధర్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు చంద్రధర్, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఈఓ తదితరులు

కేజీఎఫ్: తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అడ్మిషన్ అభియాన్‌ను నిర్వహించి పిల్లలను బడిలో చేర్పించే ప్రయత్నం చేయాలని బీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తాలూకాలో 2023-24వ సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయులు ప్రతినిత్యం ప్రార్థన సమయంలో కన్నడ దినపత్రికలను చదివించాలన్నారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాల గోడలపై రంగురంగుల బొమ్మలను గీయాలన్నారు. పాఠశాల ప్రారంభానికి అరగంట ముందే ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు చేరుకోవాలన్నారు. సంవత్సర ప్రణాళికను పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌డీఎంసీతో కలిసి చర్చించి సిద్ధం చేసుకోవాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో రెండవ స్థానంలో ఉన్న కేజీఎఫ్‌ను ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొదటి స్థానానికి తేవడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎయిడెడ్ పాఠశాలల అధ్యక్షుడు సదాశివరెడ్డి, విద్యా సంయోజకుడు లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని హామీలు నెరవేరుస్తాం


ముఖ్యమంత్రిని అభినందించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

కోలారు: ఎన్నికలకు ముందు జిల్లా అభివృద్ధికి ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. గురువారం తనను అభినందించడానికి వచ్చిన జిల్లా కాంగ్రెస్ నాయకులతో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలు తనపై ఉంచిన ప్రేమాభిమానాలను ఎన్నటికీ మరువలేనన్నారు. కోలారు నుంచి తాను పోటీ చేయడానికి అవకాశం లేనప్పుడు కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించి పంపడం సంతోషం కలిగించిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కె జయదేవ్ తదితరులు ఉన్నారు.

అన్న భాగ్య కోసం నిరీక్షణ

పావగడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అన్న భాగ్య పథకం కింద అందచేసే రేషన్ బియ్యం కోసం స్థానిక ప్రజలు ఎంత గానో ఎదురు చూస్తున్నారు. వచ్చే నెల జులై 1వ తేదీన అన్నభాగ్య పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుండగా, తాలూకా వ్యాప్తంగా రేషన్ డిపోలు సిద్ధమవుతున్నాయి. స్థానిక ఆహార సరఫరా శాఖ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ తాలూకావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 83 రేషన్ డిపోలు ఉండగా పట్టణంలో 8 ఉన్నాయని తెలిపారు. పట్టణంలో 6,534 కుటుంబాలు ఉండగా, అంత్యోదయ కార్డుదారులు 214, బీపీఎల్ 6021, ఏపీఎల్ 309 మొత్తం 6,544 మంది కార్డుదారులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 49,118 కుటుంబాలు ఉండగా అంత్యోదయ 5,695, బీపీఎల్ 48,915, ఏపీఎల్ 1,049 మొత్తం 55,659 మంది రేషన్ కార్డు దారులున్నారు. మొత్తం కలిపి 62,203 మంది కార్డు దారులకు ఒక్కో కుటుంబంలో ఒక్కో వ్యక్తికి 10 కేజీల చొప్పున ఉచిత బియ్యం అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిబంధనల పేరుతో తమకు మొండి చేయి చూపకుండా బియ్యం ఇచ్చి ఆదుకోవాలని పలువురు కార్డుదారులు డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పథకం పనుల పూర్తికి సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: ఉపాధి హామీ పనులను సత్వరం పూర్తి చేయాలని పీడీఓలకు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సూచించారు. గురువారం టీపీ కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, డ్రైనేజీ, రోడ్లు, పాఠశాల కాంపౌండ్, స్వచ్ఛ భారత్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నరసాపురం జీపీలోని పారిశ్రామికవాడలో ఆక్రమణలను తొలగించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రక్షిత తాగునీటి యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, టీపీ ఈఓ పి.మునియప్ప, ప్రణాళికాధికారి ఎన్.రమేష్, జిల్లా ఉద్యోగుల సంఘం కార్యాధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరోనా వారియర్‌కు పరిహారం ఏదీ?


నిరసన తెలియజేస్తున్న మంజుల

రాయచూరు రూరల్: కరోనా సమయంలో వారియర్‌గా విధులు నిర్వహించి మరణించిన వ్యక్తికి పరిహారం అందించాలని మంజుల డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన ఆమె మాట్లాడుతూ తన భర్త లోహిత్ రిమ్స్‌లో కరోనా వారియర్‌గా పని చేసి కరోనా వ్యాధి సోకి మరణించి మూడేళ్లు గడుస్తున్నా పరిహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. పరిహారం కోసం మైసూరు నుంచి తరలి వచ్చానని, తనకు న్యాయం చేయాలని కోరారు.

సౌకర్యాల లబ్ధి పొందండి

కోలారు: జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న కట్టడ కార్మికులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కట్టడ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హొన్నేనహళ్లి యల్లప్ప తెలిపారు. గురువారం నగరంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో గ్రామీణ మహిళా సమాఖ్య సమావేశంలో కట్టడ కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసి మాట్లాడారు. జిల్లాలో కట్టడ కార్మికులు ప్రభుత్వ సౌకర్యాల నుంచి వంచితులవుతున్నారు. అందువల్ల ప్రతి కట్టడ కార్మికుడు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలను పొందవచ్చన్నారు. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే కట్టడ కార్మిక మండలిని స్థాపించారన్నారు. సంఘం ప్రముఖులు చలపతి, రాజణ్ణ, రాజేశ్వరి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంపై నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చు

శ్రీనివాసపురం: ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయంపై నిర్భయంగా లోకాయుక్తకు ఫిర్యాదు చేయవచ్చని లోకాయుక్త ఎస్పీ బీకే ఉమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని టీపీ కార్యాలయ సభాంగణంలో జిల్లా లోకాయుక్త అధికారులు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీ నిర్వహించి దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. అకారణంగా ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోరాదన్నారు. అధికారులు ప్రభుత్వ సౌకర్యాలను ప్రజలకు అందించాలన్నారు. కాగా ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించి 22 అర్జీలు రాగా, సంబంధిత అధికారులు 15 రోజుల్లో వాటిని పరిష్కరించాలన్నారు. లేకుంటే కారణాలు తెలపాలన్నారు. తహసీల్దార్ శిరీన్‌తాజ్, శిరస్తేదార్ బలరామచంద్రేగౌడ, లోకాయుక్త ఇన్‌స్పెక్టర్లు యశవంతకుమార్, రేణుక పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌లో ర్యాంకుల పంట

గంగావతి: 2022–23వ సంవత్సరపు ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో స్థానిక లిటిల్ హార్ట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు రీవాల్యుయేషన్‌లో స్టేట్ నాలుగు, ఏడో ర్యాంకులు లభించాయి. రీవాల్యుయేషన్‌కు అర్జీలు సమర్పించుకున్న ఈ పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు అదనపు మార్కులు పొందారు. సృజన ఇందరిగి అనే విద్యార్థినికి స్టేట్ నాలుగో ర్యాంక్, వందన బండార్కర్ అనే విద్యార్థినికి స్టేట్ 7వ ర్యాంక్ దక్కాయి. వీరు ర్యాంకులు సాధించడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ వర్గం, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు హర్షాన్ని వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

దేశాభివృద్ధిలో యువకుల పాత్ర కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

శివమొగ్గ: దేశాభివృద్ధిలో యువకుల పాత్ర ఎంతో గొప్పదని శివమొగ్గ ఎంపీ బీ.వై.రాఘవేంద్ర అన్నారు. గురువారం ఆచార్య తులసి జాతీయ వాణిజ్య కళాశాల ఆధ్వర్యంలో రంగ మందిరంలో ఏర్పాటు చేసిన అమృత కాలం పంచప్రాణ ఇండియా- 2047 జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... నాడు దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది అమరులయ్యారని, ఇందులో యువశక్తి స్వామి వివేకానంద చికాగో సర్వధర్మ సమావేశంలో మన దేశం యువశక్తి ప్రేరణ గురించి ప్రపంచ దేశాలకు తెలిసేలా చేశారని అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం

యశవంతపుర: రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి ఎన్నికతో పాటు శాసనసభ పక్షనేత ఎన్నికపై గురువారం బెంగళూరులో ఆ పార్టీ ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. రాష్ట్ర ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్, మాజీ సీఎం యడియూరప్ప, బసవరాజబొమ్మై, సీటీ రవితో పాటు మాజీ మంత్రులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల ఆధారంగా శాససనసభ పక్షనేత, కొత్త అధ్యక్షుడి ఎంపికపై హైకమాండ్‌కు నివేదిక ఇవ్వనున్నారు. ఎన్నికైన ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా సన్మానించారు.

చెరువుల్లో కబ్జాలను తొలగించండి

కృష్ణరాజపురం: డిప్యూటీ సీఎం డి.కే.శివకుమార్ నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలో ముంపు సమస్యపై పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే మంజుల లింబావలి, బీబీఎంపీ అధికారులు ఆయనతో కలిసి బెళ్ళందూరు చెరువుతో పాటు చట్టుపక్కల పర్యటించారు. యమలూరు, సర్జాపుర రోడ్డు, మారతహళ్ళి, గుంజూరు, వర్తూరు ప్రాంతాల్లో పర్యటించి చెరువులను పరిశీలించారు. చెరువుల్లో కబ్జాలను తొలగించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని డీకే ఆదేశించారు.

పిల్లలు పుట్టలేదని భార్య హత్య



నిందితులు భర్త, అత్తమామలు

యశవంతపుర: వివాహమై మూడేళ్లు అవుతున్నా పిల్లలు పుట్టలేదని కారణంగా వివాహితను ఆమె భర్త, అత్తమామలు హత్య చేసిన ఘటన బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా యవకనమరడి గ్రామంలో జరిగింది. వివాహిత శ్రీదేవి బేవినకట్టి (31). దీపక్‌కి మూడేళ్ల క్రితం శ్రీదేవితో పెళ్లయింది. శ్రీదేవికి పిల్లలు పుట్టలేదని భర్త దీపక్, అత్త పద్మావతి, మామ రామచంద్రలు తరచూ వేధించేవారు. ముగ్గురు కలిసి శ్రీదేవిని గొంతు పిసికి హత్య చేసినట్లు బెళగావి ఎస్పీ సంజీవ్ పాటిల్ తెలిపారు. స్థానిక పోలీసులు ముగ్గురినీ అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

టెంకాయల లారీ బోల్తా



మడకశిర: పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం ఉదయం ఓ లారీ బోల్తా పడింది. డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కర్ణాటక నుంచి కొబ్బరి కాయల లోడుతో వస్తోంది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ కొంత వరకు దెబ్బతింది. డ్రైవర్,క్లీనర్‌లు ఈప్రమాదం నుండి బయటపడ్డారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు నమోదు చేసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న దృశ్యం

మండ్య: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు మీర శివలింగయ్య అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మండ్య సమీపంలోని మాండవ్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు.

కమనీయంగా యలహంక కరగ సంబరం

● ఆకట్టుకున్న పూల పల్లకీలు



పూల పల్లకీ ఊరేగింపులో ఎమ్మెల్యే విశ్వనాథ్





నగరంలో పూల పల్లకీల ఊరేగింపు జరుపుతున్న దృశ్యం, గురువారం తెల్లవారుజామున వరకు వేడుక సాగింది

బనశంకరి: బెంగళూరు ఉత్తర తాలూకా యలహంకలో పురాతన ప్రాచుర్యం కలిగిన మహేశ్వరమ్మ పూల కరగ మహోత్సవం పల్లకీలు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కరగ మహోత్సవంలో భాగంగా బుధవారం వహ్నికుల క్షత్రియ మండలి ఆధ్వర్యంలో మహేశ్వరమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి పూల కరగను మహేశ్వరమ్మ ఆలయం నుంచి వీర కుమారుల సమక్షంలో కరగ పూజారి అయ్యప్ప ఎత్తుకుని రాగానే భక్తులు పూలవర్షం కురిపించారు.

రాత్రంతా కరగ వేడుక

యలహంకలో వివిధ గ్రామ దేవతలతో కూడిన పూల పల్లకీలు ఊరేగింపుగా ముందుకు వెళుతుండగా మహేశ్వరమ్మ పూలకరగను ఎత్తుకుని పూజారి, వీరకుమారుల నృత్యాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పూల పల్లకీలకు, కరగకు ప్రజలు స్వాగతం పలికారు. పూలకరగ యలహంకలో వివిధ ఆలయాలు, పుర వీధుల్లో పూజలందుకుని గురువారం తెల్లవారుజామున సూర్యోదయానికి ముందుగా యలహంక మహేశ్వరమ్మ ఆలయానికి తిరిగి చేరుకుంది.

పూల కరగకు యలహంక ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు ఎస్ఆర్.విశ్వనాథ్, మాజీ నగరసభ సభ్యుడు కృష్ణమూర్తి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామదేవతల పూల పల్లకీల ఉరేగింపుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పూలపల్లకీ ఉత్సవాల్లో మద్దూరమ్మ, యల్లమ్మ, చౌడేశ్వరిదేవీ, వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి, ప్లేగమ్మ, గంగమ్మ, వీరచౌడేశ్వరి, వెంకటేశ్వరస్వామి, అన్నపూర్ణేశ్వరి దేవీ, మహేశ్వరిదేవీ, సత్యనారాయణస్వామి, అమరనారాయణ స్వామి పూల పల్లకీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





పొలం పనులు షురూ



సేద్యపు పనుల్లో రైతు

గౌరిబిదనూరు: తొలకరి పలకరిస్తుండటంతో ఎరువాక సాగు మొదలైంది. ఇటీవల తొలకరి వర్షాలకు భూమిని దుక్కి చేసి విత్తనాలు వేసుకుంటున్నారు. అన్నదాతలు సమష్టిగా పొలం పనుల్లోకి దిగారు. తాలూకాలో 35,717 హెక్టార్లలో సాగుకు సిద్ధమయ్యారు. ఇందులో 35 శాతం ఇప్పటికే విత్తనాలు పడ్డాయి. ఇక మొక్కజొన్న 19,780 హెక్టార్లు, రాగులు 1652, కందులు 3114, వేరుశనగ 3583 హెక్టార్లలో వేశారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించినట్లు వ్యవసాయ అధికార మోహన్ తెలిపారు. చిరు ధాన్యాల సాగుకు ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నామని, మూడు వేల ఎకరాల్లో చిరు ధాన్యాల సాగు ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అధికారులను ఆదేశించారు.

యువతిపై అత్యాచారయత్నం.. ఇద్దరి అరెస్ట్

యశవంతపుర: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రియుడు, అతడి స్నేహితుడు కలిసి యువతిపై అత్యాచారానికి యత్నించిన ఘటన బెంగళూరు గిరినగరలో జరిగింది. ప్రేమించిన యువకుడిని నమ్మి యువతి తుమకూరు నుంచి బెంగళూరుకు వచ్చింది. తుమకూరుకు చెందిన పురుషోత్తమ్ ఏడాదిగా యువతిని ప్రేమిస్తున్నాడు. యువతిని బెంగళూరు రమ్మని కాల్ చేశాడు. దీనిని నమ్మిన యువతి బెంగళూరుకు వచ్చింది. ఈనెల 6న యువతి మెజిస్టిక్‌లో దిగింది. అక్కడ నుంచి గిరినగర ఈరణ్ణగుడ్డెలోని స్నేహితుడు చేతన్ రూమ్‌కు తీసుకెళ్లాడు. ఆమె మొబైల్‌ను లాక్కున్నాడు. ఈ రోజు ఇక్కడే ఉంటే మొబైల్ ఇస్తామని నమ్మించారు. ఇద్దరు యువకులు బలవంతంగా ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. యువతి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు యువతిని రక్షించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువతికి వైద్య పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. చేతన్, పురుషోత్తమ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొత్త ఎమ్మెల్యేపై నేతల అసంతృప్తి

చిక్కబళ్లాపురం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వరప్ప పట్ల స్థానిక నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన గెలుపునకు కృషి చేసిన నాయకులను అసలు పట్టించుకోవడం లేదని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు లోలోపల వారు మదన పడుతున్నారు. ఎమ్మెల్యే ప్రదీప్ 'నమస్తే చిక్కబళ్లాపుర' కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఉదయం 6 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆయన స్వయంగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పర్యటించే గ్రామాల్లో సైతం ఆయన రాకను స్థానిక నేతలు కూడా తెలియడం లేదనేది అపవాదు ఉంది. కనీసం ఫోన్లను కూడా రిసీవ్ చేసుకోవడం లేదని చెబుతున్నారు. ఈ విషయం పార్టీ ముఖ్య నేతల దృష్టికి కూడా తీసుకుపోయినట్లు సమాచారం.

చిక్కమగళూరుకు టికెట్ అడిగితే మంగళూరుకు..

● కండక్టర్‌పై ప్రయాణికుల ఆగ్రహం

యశవంతపుర: చిక్కమగళూరుకు టికెట్ అడిగితే మంగళూరుకు టికెట్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రయాణకులకు ఇబ్బంది కలిగించిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు...కడూరు నుంచి చిక్కమగళూరుకు వెళ్తున్న బస్సులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 మంది తెలుగువారు ఎక్కారు. వీరు గురువారం చిక్కమగళూరు దత్తపీఠకు వెళ్లటానికి కడూరులో రైలు దిగి, అక్కడ నుంచి మంగళూరు బస్సు ఎక్కి చిక్కమగళూరుకు టికెట్ తీసుకున్నారు. అయితే కండక్టర్ మంగళూరుకు టికెట్ ఇచ్చి దత్తపీఠం భక్తులకు మోసం చేశాడు. చిక్కమగళూరుకు రూ. 45 చార్జీ ఉండగా మంగళూరుకు రూ. 202 తీసుకున్నాడు. కేవలం 40 కి.మీ ఇంత చార్జీ అవుతుందా అని ప్రయాణికులు ప్రశ్నించారు. చిక్కమగళూరులో దిగుతుండగా 18 మంది నుంచి టికెట్ వాపస్ ఇవ్వాలని అడగటంపై ప్రయాణికులు కండక్టర్‌పై ఆక్రోశం వ్యక్తం చేశారు.

నకిలీ ఉత్పత్తులు స్వాధీనం

బనశంకరి: ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా నకిలీ ఆక్వాగార్డ్ ఉత్పత్తులను విక్రయిస్తున్న డీలర్లు, తయారీదారులపై గురువారం బెంగళూరులో చిక్కపేటే, సిటీమార్కెట్, విల్సన్‌గార్డెన్, జేపీ.నగర తదితరాల్లో పోలీసులు దాడులు జరిపారు. అచ్చం నిజమైన ఉత్పత్తుల మాదిరిగా ఉండే వేలాది నకిలీ ఫిల్టర్లు, క్యాండిల్స్, కిట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ఆక్వాగార్డ్‌ఉత్పత్తులు, విడిభాగాలను భారీఎత్తున స్వాధీనం చేసుకున్నామని సదరు సంస్థ తెలిపింది. నగరంలో నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో దాడులు జరిపారు.

ఎంపీ ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకోలేదు

తుమకూరు: కొందరు తాను వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయడం గురించి మాట్లాడుతున్నారని, అయితే ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎంపీ డీకే సురేశ్ తెలిపారు, కుణిగల్ తాలూకా గిరగౌడనపాళ్యలో గురువారం ఓటర్లకు అభినందన సమావేశంలో పాల్గొని డీకే సురేశ్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ రాజకీయాలు తనకు అవసరమా వద్దా అనే మీమాంసలో ఉన్నానని, అందుకే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయడంపై మీ సలహా అవసరమని, అయితే తన లక్ష్యం మాత్రం ప్రజా సేవనే అని తెలిపారు. కుణిగల్ తాలూకాను ఒక ఆదర్శవంతమైన తాలూకాగా మార్చడమే తన ఆశయమన్నారు. అధికారం దక్కినప్పుడు సాధ్యమైనంత మేర అభివృద్ధి చేయాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు

బనశంకరి: పర్యావరణంపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్‌ను నిషేధించేలా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే తెలిపారు. గురువారం వికాససౌధలో తన కార్యాలయంలో మంత్రి ఈశ్వర్ ఖండ్రే పూజలు నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. ప్లాస్టిక్ ప్రపంచానికి పెనుముప్పుగా మారిందని, రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలను ప్లాస్టిక్ రహితం చేయాలని తీర్మానించామన్నారు. తాగునీరు, గాలితో పాటు అన్ని కలుషితం అవుతున్నాయని అన్నారు. అదే విధంగా అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలు జిల్లాల్లో పర్యటించి అటవీ సమస్యలపై చర్చించానని తెలిపారు. రామనగరలో ఏనుగు దాడిలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబానికి మూడురోజుల్లో రూ.15 లక్షల పరిహారం అందించామన్నారు.

వృద్ధ దంపతులు దుర్మరణం

గోరంట్ల: మండల పరిధిలోని గొనివారిపల్లి సమీపంలో కదిరి- హిందూపురం ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మలసముద్రం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వెంకటశివారెడ్డి (65) ఆయన భార్య జయమ్మ (62) మృతి చెందారు. వీరు ఆమడగురు మండలం కంచినగారిపల్లోల్ల బంధువుల ఇంట్లో ఓ శుభకార్యంలో పాల్గొని, ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో గొనివారిపల్లి దగ్గర కదిరి వైపు వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో దంపతులు ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకొన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. సీఐ సుబ్బరాయుడు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తిడుతోందని అవ్వ హత్య

● మనవడి కిరాతకం

మైసూరు: మంచి మాటలు చెప్పిన పాపానికి ఓ వృద్ధురాలు మనవడి చేతిలో బలైంది. ఈ ఘటన మైసూరు గాయత్రిపురంలో జరిగింది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు గాయత్రిపురం నివాసి సుప్రీత్ (23) తన అవ్వ సులోచన (75)ను హత్య చేశాడు. జులాయి తిరుగుతుండటంతో అవ్వ సులోచన, సుప్రీత్‌ను మందలించేది. ఇది నచ్చని సుప్రీత్ తరచూ ఆమెతో గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో ఒకరోజు అవ్వను హత్య చేశాడు. అనంతరం ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌లో పెట్టుకుని కేఆర్ఎస్ బ్యాక్ వాటర్ దగ్గరకు తీసుకెళ్లి కాల్చేశాడు. అప్పటి నుంచి సుప్రీత్ పరారయ్యాడు. ఈ ఘటనపై ఇలవాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సగం కాలిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు హత్యగా తేల్చారు. సుప్రీత్‌పై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు నిజం బయపటడింది.

ప్రతి నెల రైతులతో సమావేశం



రైతులకు విత్తన బ్యాగును అందజేస్తున్న ఎమ్మెల్యే

చిక్కబళ్లాపురం: ప్రతినెల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ పరంగా వారికి అవసరమైన సలహాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. గురువారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందని, అధికారులు వాటిని రైతులకు తెలియజేయాలన్నారు. రైతుల అనుకూలం కోసం విత్తనాల బ్యాగ్‌పై క్యూ ఆర్ కోడ్ ఉందని, స్కాన్ చేస్తే విత్తనాల సమాచారం వస్తుందన్నారు. కార్యక్రమంలో కృషిక సమాజం అధ్యక్షుడు నారాయణస్వామి, కృషి విజ్ఞన కేంద్రం ప్రముఖులు పాపిరెడ్డి, రైతు సంఘం నేత నరసింహప్ప, మాజీ టీపీఎస్ అధ్యక్షుడు సుబ్బరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

మహిళ మృతదేహం లభ్యం

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు సమీపంలో కుళ్లిన స్థితిలో మహిళా మృతదేహం కలకలం సృష్టించింది. బాగలూరు సమీపంలోని చెన్నసంద్రం గ్రామానికి చెందిన రైతు క్రిష్ణమూర్తి పొలంలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు బాగలూరు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుంది. పక్కనే మద్యం బాటిళ్లు పడిఉన్నాయని, దుండగులు ఆమెను తీసుకొచ్చి అత్యాచారానికి పాల్పడి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కెలమంగలం: డెంకణీకోట తాలూకా చిన్నమదగొండపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన రేషన్ దుకాణాన్ని తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ప్రారంభించారు. మదగొండపల్లి సమీపంలోని చిన్నమదగొండపల్లిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ఆయన సంబంధిత శాఖాధికారులతో చర్చించి గ్రామంలో రేషన్ దుకాణం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో నిర్మాణ పనులు పూర్తి చేసుకొన్న రేషన్ దుకాణాన్ని గురువారం ప్రారంభించారు. యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కుమార్, ప్రశాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

కెలమంగలం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని కెలమంగలం పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. కెలమంగలం పట్టణ పంచాయతీ గ్రామాధికారి రాజేష్ నేతృత్వంలో అధికారులు బుధవారం రాత్రి కూడలి రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన టిప్పర్ లారీని తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని కెలమంగలం అన్నానగర్‌కు చెందిన డ్రైవర్ శంకర్ (38)ను అరెస్ట్ చేశారు.

సిలబస్‌ను సవరిస్తాం

బనశంకరి: సిలబస్‌లో అశాస్త్రీయ, రాజ్యాంగ విరుద్ధమైన అంశాలను ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే సవరిస్తామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం సిలబస్‌లో కొన్ని అభ్యంతరకర అంశాలు చేర్చిందని, వాటిని సవరించేందుకు ముఖ్యమంత్రి సైతం ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. విద్యార్థుల విద్యకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

చిట్‌ఫండ్ బాధితుల ఆందోళన

క్రిష్ణగిరి: చిట్‌ఫండ్ పేరుతో లక్ష పెట్టుబడి పెడితే రూ. 1.80 లక్షల ఆదాయం అందజేస్తామని ప్రజలను మోసపుచ్చి రూ. 80 కోట్లతో పరారయ్యారు. వారిని పట్టుకుని తమ డబ్బును తిరిగి ఇప్పించాలని బాధిత ప్రజలు కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ధర్మపురి జిల్లా పాపిరెడ్డిపట్టికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు చిట్‌ఫండ్ నిర్వహిస్తూ క్రిష్ణగిరి, పోచ్చంపల్లి, ఏలగిరి, హోసూరు ప్రాంతాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేశారు.రియల్ ఎస్టేట్, ట్రేడింగ్, నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామని, ప్రజలు లక్ష రూపాయలు పెట్టుబడి చేస్తే రోజూ రూ. 1800 చొప్పున వంద రోజులకు రూ. 1.80 లక్షల ఆదాయాన్ని అందజేస్తామని జోరుగా ప్రచారం చేసుకున్నారు. ఇది నిజమేనని నమ్మి గత 2021 నుంచి వేలాది మంది నుంచి రూ. 200 కోట్లకుపైగా చెల్లించారు. గత 2022 మే వరకు డబ్బులు అందజేస్తూ వచ్చిన వీరు ఆకస్మాత్తుగా ఆఫీసులను మూసుకొని పరారయ్యారు. డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు పలుమార్లు పోలీసులు, అధికార్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో గురువారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించి చిట్‌ఫండ్ నిర్వాహకులపై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సిఫ్‌కాట్‌ను వ్యతిరేకిస్తూ రైతుల నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న రైతులు

క్రిష్ణగిరి: హోసూరు సమీపంలో 5వ సిఫ్‌కాట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన నిర్వహించారు. సూళగిరి తాలూకా రాయకోట సమీపంలోని అయర్నపల్లి, నాగమంగలం, ఉద్దనపల్లి ప్రాంతాల్లో 5వ సిఫ్‌కాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సిఫ్‌కాట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బాధిత రైతులు 154 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. మూడు రోజులుగా రైతులు నిరాహార దీక్షకు దిగారు. సిఫ్‌కాట్ ఏర్పాటును విరమించుకోవాలని, శాశ్వత పరిష్కారం కల్పించే వరకు దీక్షను విరమించుకోమని హెచ్చరించారు. దీక్షలో పాల్గొన్న ముగ్గురు రైతులు అస్వస్థతకు గురికావడంతో క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతులతో హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య చర్చలు జరిపారు. ఫలితం లేకపోవడంతో దీక్షను కొనసాగిస్తున్నారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ఇంటిని అద్దెకు తీసుకొని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. హోసూరు ప్రాంతంలో వ్యభిచారాలు జోరుగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్‌కు రహస్య సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్ నేతృత్వంలో పోలీసులు పట్టణంలోని బాగలూరు రోడ్డు ప్రాంతంలో బుధవారం రాత్రి గస్తీ నిర్వహించారు. ఓ ఇంటిపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. విచారణలో డెంకణీకోట సమీపంలోని అంజలగిరి గ్రామానికి చెందిన శ్రీనివాస్(25), క్రిష్ణగిరి భారతీపురం ప్రాంతానికి చెందిన తిరుపతి(32), బెంగళూరు బండేపాళ్యం ప్రాంతానికి చెందిన మునిస్వామి(48) అని తెలిసింది. ముగ్గురూ కలిసి ఎన్‌జీవో కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వ్యభిచారానికి పాల్పడుతున్న యువతులకు విముక్తి కల్పించారు.

పారిశుద్ధ్య కమిటీ సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షులు మాదేశ్వరన్

హోసూరు: హోసూరు సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ కమిటీ సమావేశం కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.మాదేశ్వరన్ అధ్యక్షతన జరిగింది. కమిషనర్ స్నేహ పాల్గొన్న ఈ సమావేశంలో మాదేశ్వరన్ మాట్లాడుతూ... పట్టణంలో పారిశుద్ధం లోపించిందని, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని, ప్రధానంగా పట్టణం నడిబొడ్డులోని రామనాయకుని చెరువులో చెత్త కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారని, దీంతో చెరువు నీరు కలుషితంగా మారిపోయిందని అన్నారు. మురికి కాల్వల్లో మురుగు పేరుకు పోయిందని అసహనం వ్యక్తం చేశారు. అదే విధంగా నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని సంపూర్ణంగా నిషేధించాలన్నారు. నగరంలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆవును బలిగొన్న చిరుత

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకా దొడ్డగంగవాడి గ్రామంలో చిరుత బెడద ఎక్కువయింది. తాజాగా బుధవారం రాత్రి గ్రామంలో జొరబడి భద్రయ్య అనే రైతుకు చెందిన ఆవును బలితీసుకుంది. భద్రయ్య కుటుంబం మృతి చెందిన ఆవు మీదే ఆధారపడి జీవిస్తోంది. చిరుత ఆవును బలి తీసుకోవడంతో భద్రయ్య కుటుంబానికి ఆదాయం లేకుండాపోయింది. భద్రయ్య కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. చిరుతను పట్టుకోవాలని అటవీశాఖ అధికారులను డిమాండు చేస్తున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పీడీఓ

దొడ్డబళ్లాపురం: లంచం తీసుకుంటూ పీడీఓ లోకాయుక్తకు పట్టుబడ్డ సంఘటన నెలమంగల తాలూకా అగళకుప్పె గ్రామంలో చోటుచేసుకుంది. అగళకుప్పె గ్రామపంచాయతీ పీడీఓ నరసింహమూర్తి రిజిస్ట్రేషన్ చేసివ్వడానికి ఒకరి వద్ద రూ. 2 లక్షలు డిమాండు చేసాడు. దీంతో ఆ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించడంతో లోకాయుక్త పోలీసులు వల వేసి అరెస్టు చేసారు. నెలమంగల ప్రభుత్వ అతిథి గృహంలో లంచం తీసుకుంటుండగా లోకాయుక్త డీవైఎస్పీ రేణుకాప్రసాద్ ఆధ్వర్యంలో నరసింహమూర్తిని వలపన్ని పట్టుకున్నారు.

నిర్మాత మృతి



అనూప్‌గౌడ (ఫైల్)

యశవంతపుర: శాండిల్‌వుడ్ నిర్మాత అనూప్‌గౌడ మృతి చెందారు. ఈ విషయాన్ని అనూప్ ఆప్తుడు నటుడు కిషోర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 2009లో అనూప్‌గౌడ కబడ్డీ సినిమాను తీశారు. మంచి మిత్రుడిని పోగొట్టుకున్నట్లు కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు.

గృహలక్ష్మీ దరఖాస్తు నమూనా విడుదల

బనశంకరి: గృహలక్ష్మీ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు నమూనా గురువారం విడుదలైంది. అర్హులు సేవాసింధు కేంద్రాన్ని సంప్రదించి, వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు అవసరమైన వాటిని జత చేసి పూర్తి చేయాల్సి ఉంది. ఈ పథకం కింద ఇంటి యజమానురాలికి రూ. 2 వేల అందజేస్తారు. దరఖాస్తులో ఇంటి మహిళ భర్త రికార్డులు అందించాలి. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపుకార్డు అందజేయాలి. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15 నుంచి జూలై 15 వరకు కాలావకాశం ఉంది. జూలై 15 అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

పన్ను చెల్లిస్తే వర్తించదు

గృహలక్ష్మీ యోజన లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రజల్లో గందరగోళం నెలకొంది. రోజుకో విధంగా విధిస్తున్న కండీషన్లు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో వాటికి తెరదించుతూ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మాట్లాడుతూ భర్త, భార్య ఎవరైనా ట్యాక్స్ చెల్లిస్తుంటే ఈ పథకం వర్తించదని తెలిపారు. ట్యాక్స్ చెల్లించేవారికి ఈ పథకం వర్తించదు.

క్లుప్తంగా...

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడి రాజీనామా

ప్రభుత్వంపై వ్యతిరేక ధోరణితోనే వ్యవహరిస్తున్న నేతల వైఖరికి నిరసన

ఏలూరు (మెట్రో): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లాం విద్యాసాగర్ గురువారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పంపారు. ప్రభుత్వం ఎన్ని అనుకూల నిర్ణయాలు తీసుకున్నప్పటికీ సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేకధోరణి చూపుతున్నారని, దీనికి నిరసనగా తాను సంఘంలో కొనసాగలేనని విద్యాసాగర్ తెలిపారు. అందుకే రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు మాగుంట రాఘవ బెయిల్‌పై విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : 'లిక్కర్ స్కాం' కేసులో మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ తరఫున న్యాయవాది గురువారం సుప్రింకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్‌తో కూడిన ధర్మాసనాన్ని ఈడీ న్యాయవాది కోరారు. అనంతరం ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

వైద్య నివేదికను భద్రపరిచేలా ఆదేశించండి

- హైకోర్టులో ఎంపీ రఘురామకృష్ణరాజు పిటిషన్
- తక్షణ ఆదేశాలిచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, అమరావతి: సీఐడీ అధికారులు తనను కొట్టారన్న ఆరోపణలపై న్యాయస్థానం ఆదేశాల మేరకు గుంటూరు జీజీహెచ్ వైద్యులు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను భద్రపరిచేలా తక్షణ ఆదేశాలివ్వాలన్న ఎంపీ రఘురామకృష్ణరాజు అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ నుంచి లిఖితపూర్వకంగా వివరాలు తెలుసుకుని.. కోర్టుకు తెలియజేయాలని వైద్య ఆరోగ్య శాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది(జీపీ) ఎస్. అప్పాధరరెడ్డిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాల కృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ అధికారులు కస్టడీలో కొట్టారంటూ తాను చేసిన ఆరోపణల ఆధారంగా కోర్టు తనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిందని రఘురామ పిటిషన్‌లో పేర్కొన్నారు. అప్పుడు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను భద్రపరిచేలా జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై కోర్టు గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ, రఘురామకు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను ధ్వంసం చేసేందుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అవి ధ్వంసమైతే సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది అప్పాధరరెడ్డి స్పందిస్తూ, పూర్తి వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులివ్వాల్సిన అవసరం లేదన్నారు. దీంతో న్యాయమూర్తి స్పందిస్తూ.. రఘురామ కోరినట్లుగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 13కి వాయిదా వేశారు.

భాస్కర్‌రెడ్డి బెయిల్‌పై నేడు తీర్పు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించనుంది. దాదాపు నెలన్నరగా జైలులో ఉంటున్నానని.. ఇప్పటికే కస్టడీ విచారణ కూడా ముగిసిందని, తన ఆరోగ్య సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకొని బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరోవైపు బెయిల్ ఇవ్వొద్దని కోరుతూ సీబీఐ కౌంటర్ కూడా దాఖలు చేసింది.

అఖిలప్రియ భర్తకు బెయిల్

సాక్షి, అమరావతి : తనపై దాడి చేసి, హత్యాయత్నం చేశారంటూ టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నంద్యాల టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, టీడీపీ నేత అఖిలప్రియ భర్త ఎం.భార్గవరామ్‌కు హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నంద్యాల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సంతృప్తి మేరకు రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని భార్గవరామ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 లోపు నంద్యాల పోలీసుల ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. సాక్షులను ప్రత్యక్షంగా, పరోక్షంగా సంప్రదించరాదని, సాక్ష్యాలను తారుమారు చేయడానికి వీల్లేదని తెలిపింది. షరతులను ఉల్లంఘిస్తే బెయిల్‌ను రద్దు చేస్తామని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఉత్తర్వులిచ్చారు. నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఏవీ సుబ్బారెడ్డి, అఖిలప్రియలు గొడవ పడ్డారు. ఈ కేసులో భార్గవరామ్‌ను ఏ11గా పేర్కొన్నారు.



శ్రీకాకుళంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు



నెల్లూరులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కాంట్రాక్టు అధ్యాపకులు



ఏలూరు డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

ఉప్పొంగిన ఉద్యోగి!

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీపీఎస్‌పై హర్షాతిరేకాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో ఆనందోత్సాహాలు
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

సాక్షి, అమరావతి, సాక్షి నెట్‌వర్క్: ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పదవీ విరమణ అనంతరం ఉద్యోగుల విశ్రాంత జీవనానికి పూర్తి భరోసా కల్పిస్తూ జీపీఎస్ తేవడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడం తదితర నిర్ణయాలను కేబినెట్ ఆమోదించటాన్ని స్వాగతిస్తున్నారు. 20 ఏళ్ల కల నెరవేరిందని కాంట్రాక్టు ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో సంబరాలు చేసుకున్నారు. వేతనాలు, సెలవుల రెగ్యులరైజేషన్, ఇతర అంశాల్లో జాప్యానికి ఇక తెరపడనుందని పేర్కొంటున్నారు. గొల్లపూడిలోని ఏపీవీవీపీ ప్రధాన కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ పి.సరళమ్మ, వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, వైద్య విధాన పరిషత్ డాక్టర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ రోహిత్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైద్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని కలిసి యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌కి ధన్యవాదాలు తెలియచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వారం పాటు సంబరాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పిలుపునిచ్చారు.

- దివంగత వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటాలకు విశాఖ కలెక్టరేట్ ఎదుట ఎన్జీవోలు, కాంట్రాక్టు ఉద్యోగులు క్షీరాభిషేకం నిర్వహించారు. సీఎం సార్ ధన్యవాదాలంటూ కృతజ్ఞతను చాటుకున్నారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. పీఆర్సీ, బకాయిల చెల్లింపు తదితర నిర్ణయాలపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు తెలిపారు. సీఎం జగన్ ఉద్యోగుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.చలం పేర్కొన్నారు. విశాఖ కలెక్టరేట్‌లోని ఎన్జీవో హోమ్‌లో మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్లవెల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఇందులో మంత్రి విశ్వరూప్ పాల్గొన్నారు.
- తెనాలిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలివ్వాలని నిర్ణయించటం సంతోషకరమన్నారు.
- చిత్తూరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట, తిరుపతి రుయా ఆసుపత్రి ఆవరణలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సూళ్లూరుపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.
- ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 115 మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులరైజ్ కానున్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డితో కలసి నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాల ఎదుట సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.
- ముఖ్యమంత్రి జగన్ చేసిన మేలును జన్మలో మరువలేమని రాష్ట్ర కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధులు ఎస్.దొరబాబు, వేణుగోపాలరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు చాటుకున్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తమను పట్టించుకోకపోగా జీతాలు పెంచిన పాపాన పోలేదని చెప్పారు.
- కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి విజయవాడ సత్యనారాయణపురంలోని కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ట్రేడ్ యూనియన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్, తిరుపతి జోనల్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయంపై ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఏలూరులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు చాటుకుంది. సుమారు 3,500 మంది రెగ్యులర్ కానున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు తెలిపారు.
- ఉత్తరాంధ్రలో జియ్యమ్మవలస, కురుపాం, బొబ్బిలిలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియచేయాలంటూ కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేశారు.

'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

'పశ్చిమ' జెడ్పీ పీఠంపై గంటా పద్మశ్రీ

- మొట్టమొదటిసారిగా పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్‌పర్సన్‌గా బీసీ మహిళ ఎన్నిక... గంటా పద్మశ్రీ ప్రమాణస్వీకారం
- నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బోడపాటి సుబ్బలక్ష్మి
- ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాచర్ల లక్ష్మి
- ఆయా జిల్లాల్లో ఎన్నికైన వారందరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారే
- కోరంలేక పలుచోట్ల వాయిదా



గంటా పద్మశ్రీ

సాక్షి నెట్‌వర్క్ : గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో ఏర్పడిన ఖాళీలకు గురువారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గత నెల 31న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు ఆయా స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు జరిగాయి.

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గంటా పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఏలూరులో ఎన్నిక ప్రక్రియను చేపట్టారు. అనంతరం పద్మశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వహించిన కవురు శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ పదవి వరించడంతో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠానికి ఖాళీ ఏర్పడింది. దీంతో బీసీ మహిళగా ఉన్న గంటా పద్మశ్రీను ఈ పదవి వరించింది. జిల్లా పరిషత్ ఏర్పడిన అనంతరం బీసీ మహిళగా పద్మశ్రీ మొట్టమొదటి చైర్‌పర్సన్ కావడం.. మహిళకు జిల్లా పరిషత్ పీఠాన్ని అందించడం పట్ల పార్టీ శ్రేణులు, ప్రజలు సైతం హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సుపరిపాలన అందిస్తానని చెప్పారు. ఇక పద్మశ్రీకి మంత్రులు తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వాసుబాబు, వెంకట్రావు, అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీలు వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.
- ఏలూరు జిల్లా నూజివీడు పురపాలక సంఘం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కొమ్ము వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ పదవికి గత నెలలో షేక్ అమీరున్నీసా బేగం రాజీనామా చేయడంతో మళ్లీ ఎన్నిక అనివార్యమైంది.



విజయనగరం డిప్యూటీ మేయర్-1గా ఎన్నికైన లయ యాదవ్

- పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ముప్పిడి సరోజని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు.
- నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన (ఎస్సీ మహిళకు రిజర్వు) బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కోనేటి రామకష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఇరువురికీ శుభాకాంక్షలు తెలిపారు.
- విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-1గా ముచ్చు లయయాదవ్ (వైఎస్సార్‌సీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1వ డివిజన్ కార్పొరేటర్ అయిన ఆమెను ప్రత్యేక సమావేశంలో సభ్యులంతా ఎన్నుకున్నారు.
- విజయనగరం జిల్లా ఎల్.కోట మండల పరిషత్ రెండో వైస్ ఎంపీపీగా భీమాళి ఎంపీటీసీ (వైఎస్సార్‌సీపీ) సభ్యుడు ముదునూరు శ్రీనివాసవర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీగా పనిచేసిన దండేకర్‌కుమారి మరణించడంతో ఎన్నిక అనివార్యమైంది.
- గుంటూరు జిల్లా తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా 40వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రకటించి, ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు.
- శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేనేత వర్గానికి చెందిన కాచర్ల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, స్థానిక సంస్థలకు సంబంధించి బత్తలపల్లి ఎంపీపీగా అప్పరాచెరువు ఎంపీటీసీ సభ్యురాలు బగ్గిరి త్రివేణి, చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ-1గా చెన్నేకొత్తపల్లి-2 ఎంపీటీసీ సభ్యురాలు పి.రాములమ్మను ఎన్నుకున్నారు. ఇక అనంతపురం జిల్లా విడపనకల్లు మండల ఉపాధ్యక్షురాలు-2గా హాంచనహాళ్ ఎంపీటీసీ రాకెట్ల పుష్పావతి ఎంపికయ్యారు. కోరం లేకపోవడంతో రాయదుర్గం వైస్ ఎంపీపీ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. అన్నిచోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, అందరూ వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారే కావడం గమనార్హం.
- అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీపీగా జల్లా పద్మావతమ్మ ఎంపికయ్యారు. ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో గరిగుపల్లె ఎంపీటీసీ సభ్యురాలు జల్లా పద్మావతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు.

ఎన్నికలు వాయిదా..

చిత్తూరు జిల్లాలోని మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల ఎంపిక గురువారం కోరంలేక వాయిదా పడింది. ఇప్పటికే పలుమార్లు రామకుప్పం, చిత్తూరు రూరల్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సంబంధిత ఎంపీటీసీ సభ్యులకు వారం ముందే సమాచారమిచ్చారు. ఇందుకు ఎంపీటీసీ సభ్యులు రాకపోవడంతో కోరంలేక ఎన్నిక వాయిదా పడింది. విజయపురం వైస్ ఎంపీపీ స్థానానికి ఎన్నిక మొదటిసారి వాయిదా పడడంతో శుక్రవారం మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు ఎంపీపీ ఎన్నికకు నిర్ణీత సమయంలో ఎంపీటీసీ సభ్యులు ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయుల దాడి



గాయపడిన శివారెడ్డి

మద్దిపూడి: ప్రకాశం జిల్లా మద్దిపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయులు విచక్షణా రహితంగా కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఘటనలో బాధితులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని పొదిలి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 398లో 12.80 ఎకరాల భూమి ఉంది. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఈ భూమిని 1940వ సంవత్సరం నుంచి అదే గ్రామానికి చెందిన గొంటు వంశీకులైన గొంటు పెద యోగిరెడ్డి, గొంటు చినయోగిరెడ్డి, గొంటు వెంకట నర్సింహారెడ్డి, గొంటు శివారెడ్డి సాగుచేసుకుంటున్నారు. అయితే, 1957వ సంవత్సరంలో జరిగిన రీ సర్వేలో గ్రామానికి చెందిన గొంటు వెంకటనర్సింహారెడ్డి, గొంటు శివారెడ్డి, చేరెడ్డి పెద కోటిరెడ్డి పేర్లు ఎఫ్ఎల్ఆర్‌లో పొందుపరిచారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడైన గొంటు శివారెడ్డి గతేడాది వైఎస్సార్ సీపీలో చేరారు. దీన్ని జీర్ణించుకోలేక కక్షకట్టిన టీడీపీ వర్గీయులు ఎఫ్ఎల్ఆర్ దాఖలాలో ఉన్న చేరెడ్డి పెదకోటిరెడ్డి వంశీకుడైన చేరెడ్డి పుల్లారెడ్డి సాగుచేసుకుంటున్న భూమిలో తమకు కూడా మూడో వంతు వాటా రావాలంటూ గొంటు వంశీయులకు నోటీసులు పంపించారు. ఈ విషయంపై గురువారం స్థానిక శివాలయం వద్ద పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చేందుకు మాట్లాడుతున్న తరుణంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి చిన్న నర్సారెడ్డితో పాటు వారి వర్గీయులు కలుగజేసుకుని వైఎస్సార్ సీపీ వర్గీయులపై కర్రలతో దాడి చేశారు. దాడిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గొంటు శివారెడ్డి, గొంటు సుమాంజలికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ పీ అంకమ్మరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ మాట ఇచ్చారు.. నెరవేర్చారు

24 గంటల్లోనే బాధితులకు ఆర్థికసాయం

సాక్షి అమలాపురం: 'మాట ఇస్తే.. చేస్తానంతే..' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. బాధితులు కోరిన ఆర్థిక సహాయాన్ని 24 గంటల్లో రోగులకు, పేదలకు అందేలా చేసి వారిపట్ల తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సీఎం జగన్ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కుమారుడి వివాహానికి వచ్చిన సీఎం జగన్‌ను కలిసి బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 24 గంటలు తిరగకుండానే 25 మంది బాధితులకు రూ.26 లక్షలను కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా అందజేశారు. లబ్ధిపొందినవారిలో పలువురు దివ్యాంగులు, దీర్ఘకాలికవ్యాధుల బాధితులు ఉన్నారు. సీఎం సహాయనిధి నుంచి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందించడంతోపాటు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలు అందించాలని సీఎం ఆదేశించినట్టు కలెక్టర్ శుక్లా తెలిపారు. వీరిలో టి.సుజాతకు రూ.రెండులక్షలు అందించారు. డీఎం అండ్ హెచ్‌వో ఎం.బాబూరావు దొర, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



వికలాంగురాలికి చెక్ ఇస్తున్న కలెక్టర్ శుక్లా

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా: లోకేశ్

కడప రూరల్: న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తానని తెలుగుదేశం పార్టీ నేత లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్ర వైఎస్సార్ జిల్లాలో ముగింపు సందర్భంగా ఆయన గురువారం కడపలో న్యాయవాదులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజావేదికను కూల్చి పరిపాలన ప్రారంభించారని చెప్పారు. ఆయన పాలనలో న్యాయవాదులు కూడా బాధితులేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోర్టుల్లో దుర్భరమైన పరిస్థితులు ఉండటాన్ని తాను స్వయంగా చూశానని, కూర్చోడానికి కుర్చీలు, బాత్‌రూములు కూడా లేవని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక న్యాయశాఖకు అధిక నిధులు కేటాయిస్తామని, న్యాయవాదులకు నామినేటెడ్ పదవులు కూడా ఇస్తామని చెప్పారు. అనంతరం పులివెందుల టీడీపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ పులివెందులలో పదేపదే టీడీపీ ఓడిపోతున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధిని తాము ఏనాడూ విస్మరించలేదని చెప్పారు. పులివెందులలో పనిచేసేవారికే పదవులు ఇస్తామని, బూత్‌లలో మెజార్టీ తెచ్చినవారికి కచ్చితంగా పదవులు ఇస్తామని పేర్కొన్నారు. టీడీపీ నేతలంతా పులివెందుల నియోజకవర్గంలో అందుబాటులో ఉండాలని, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని నిర్దేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వందల కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఒక్కరోడ్డు కూడా పూర్తిచేయలేదని విమర్శించారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వేయాల్సిన రోడ్లను పూర్తిచేయలేదన్నారు. సాగునీటికి సంబంధించి అదనంగా ఒక్క ఎకరాకు కూడా జగన్ నీరందించలేదన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ చొరవ అద్భుతం


ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



గుంటూరు వెస్ట్: ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ అద్భుతమని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీ జేఏసీ అమరావతి నాలుగో ప్రాంతీయ సదస్సును గురువారం గుంటూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బొప్పరాజు మాట్లాడుతూ గత 92 రోజులుగా ప్రభుత్వ విధులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చేసిన ఉద్యమాన్ని ప్రభుత్వం అర్థం చేసుకుందని ధన్యవాదాలు తెలిపారు. తాము అడిగిన అనేక సమస్యలపై సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. ప్రధానంగా 48 డిమాండ్‌లలో అతి ముఖ్యమైన 37 డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం అత్యంత సంతోషం కలిగించిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, డీఏలు, అరియర్స్‌తోపాటు అనేక బిల్లులను కూడా ప్రభుత్వం ఆమోదించిందని, దీనికి కేబినెట్ కూడా అంగీకారం తెలపడం అభినందనీయమన్నారు. రానున్నకాలంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసి సంక్షేమ పథకాలను మరింతగా ప్రజలకు చేరువ చేస్తామని చెప్పారు. తొలుత నగరంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఏపీ జేఏసీ అమరావతి నాయకులు పలిశెట్టి దామోదరరావు, టీవీ ఫణిపేర్రాజు, కిరణ్‌కుమార్, కనపర్తి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అభినందనీయం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాచర్ల రూరల్: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న 10వేల మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందిస్తున్నామని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. పల్నాడు జిల్లా మాచర్ల రూరల్‌లోని కోదండ రామాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014కు ముందు నుంచి సర్వీసులో చేరిన 10వేల మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం శుభపరిణామమని తెలిపారు. వీరిలో కొద్దిరోజుల తేడాతో కొంతమంది రెగ్యులరైజేషన్ కాకుండా మిగిలిపోతున్నారని, వారికి కూడా అవకాశం కల్పిస్తే మంచిదన్నారు. డీఎస్సీ-98 ద్వారా ఎంపికైన 4,700 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతమైన మాచర్లలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీల్లో పల్నాడు ప్రాంతంలో ఖాళీలను భర్తీ చేయాలని ఆయన కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, జీపీఎస్‌కు తాను వ్యతిరేకమని చెప్పారు.

'శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్' వీసీగా రాఘవేంద్రప్రసాద్



ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లెర్నింగ్ (ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్) వైస్ చాన్సలర్‌గా డాక్టర్ బుధిహాల్ రాఘవేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రాఘవేంద్రప్రసాద్. ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ పూర్తిచేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో నాన్‌లీనియర్ ఆప్టిక్స్‌లో డాక్టరేట్ పొందారు. తర్వాత బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో భాగమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్‌లో ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాలకుపైగా పనిచేస్తున్నారు. అడాప్టివ్ ఆప్టిక్స్ అండ్ స్పేస్ సైన్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో పలు ప్రయోగాలు నిర్వహించారు. ఆస్ట్రో సైన్స్‌కు సంబంధించిన పలు మేజర్ ప్రాజెక్టుల్లో కీలకపాత్ర పోషించారు. వీసీగా నియమితులైన రాఘవేంద్రప్రసాద్ త్వరలోనే విద్యాసంస్థల పరిపాలన బాధ్యతలు స్వీకరించనున్నారు.

తెలంగాణ

ఏపీలో సీపీఎస్ రద్దు చరిత్రాత్మక నిర్ణయం

- ఇతర రాష్ట్రాలకు ఏపీ సీఎం జగన్ నిర్ణయం ఆదర్శం
- సీపీఎస్టీఈఏ టీఎస్ ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ రెస్టోరేషన్ జాతీయ కార్యదర్శి, భాగస్వామ్య పింఛన్ పథకం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర (సీపీఎస్టీ ఈఏ టీఎస్) ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 80 లక్షల పైచిలుకు ఉద్యోగులు సీపీఎస్ పథకంలో ఉన్నారని తెలిపారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేసి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. కొన్ని గొప్ప నిర్ణయాలు తీసుకునే ధైర్యం అందరికీ ఉండదని పేర్కొన్నారు. సీఎం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులకు పింఛన్ గ్యారంటీ అని భరోసా ఇచ్చి, సీఎం జగన్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా పాత పెన్షన్ పథకం పునరుద్ధరణకు నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదని మాచన రఘునందన్ ఆశాభావం వ్యక్తం చేశారు.



చీర కొంగుపై గోండు ఆర్ట్

వారసత్వ ప్రతీకలు

గిరిజన కళా శైలి మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ఇది నేటికీ సజీవంగా ఉండటానికి కళాకారులే కాదు ఫ్యాషన్ డిజైనర్లూ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆ అందమైన అలంకరణను డ్రెస్ డిజైన్స్‌లో చూపుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శిస్తూ జానపద కళారూపాలను మన కళ్ల ముందు నిలుపుతున్నారు. గిరిజనుల సంస్కృతి ఫ్యాబ్రిక్ మీద మన కళ్లకు కట్టేవాటిలో వర్లి, భిల్, గోండ్, మండన, కలంకారీ, పటచిత్ర.. కళారూపాలు సొగసుగా కనిపిస్తున్నాయి.



పటచిత్ర కళ

భిల్ ఆర్ట్

మధ్య భారతదేశంలోని గోండు గిరిజనుల సంస్కృతికి ఈ పెయింటింగ్ అద్దం పడుతుంది. కాన్వాస్, క్లాత్‌పైన విరివిగా కనిపించే ఈ కళ ఇప్పుడు ఫ్యాషన్ వేదికలపైనా ఎంతో మందిని ఆకట్టుకుంటోంది.



గోండు ఆర్ట్

కలంకారీ

వర్లి ఆర్ట్

● మహారాష్ట్ర, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందిన గిరిజన కళారూపంబ. ఈ కళలో కళాకారులు తమ జీవితాన్ని అందంగా వ్యక్తీకరిస్తారు. చతురస్రం, వృత్తం, త్రిభుజంతో సహా ప్రాథమిక రేఖాగణిత ఆకృతులను ఈ కళల చూపుతారు. వెదురు బ్రష్‌తో ముదురు ఎరుపు, తెలుపు రంగులో ఉండే ఈ పెయింటింగ్‌లో నృత్యం, చేపలు పట్టడం, వ్యవసాయం, పండుగల, ఇతర కార్యకలాపాలతో సహా రోజువారి జీవితం వర్లి చిత్ర కళలలో మనకు కనిపిస్తుంది. ● 'పటచిత్ర' ఒరిస్సా ప్రాచీన ఆర్ట్ వర్క్. ప్రధానంగా హిందూ పురాణేతిహాసాలు ఈ కళలో కనిపిస్తాయి. ● మధ్య భారతదేశంలోని గోండు తెగ ఈ కళకు ప్రసిద్ధి చెందింది. కాగితం, కాన్వాస్, క్లాత్ మీద చిత్రించే ఈ పెయింటింగ్స్ కొన్నేళ్ల వరకు వాతావరణ మార్పులను తట్టుకుంటాయి. ● భిల్ ఆర్ట్ అనేది మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలలో నివసించే భిల్లులు వేసే చిత్ర కళ. భిల్లులు మన దేశంలో రెండవ అతి పెద్ద గిరిజన సమూహం. భిల్ ప్రజలు తమ గ్రామంలోని ఇండ్ల మట్టి గోడలను వారి కళతో అలంకరిస్తారు. ఈ కళ కాటన్ చీరలు, డ్రెస్సుల మీద అందంగా వికసిస్తున్నాయి. ●కలంకారీ అనేది మన దేశంలోని దక్కన్ ప్రాంతంలో పుట్టిన కళ. ఇందులో శ్రీకాళహస్తి శైలి, మచిలీపట్నం శైలి విలక్షణమైనవి. ఈ కళలో దేవాలయాలు, రథాలు, దేవతలు, పురాణేతిహాసాలు, తీగలు, లతలను చిత్రిస్తారు. సహజరంగులను, పెన్నును ఉపయోగిస్తూ చేతితో వేసే ఈ కళ జాతీయ అంతర్జాతీయ వేదికలపైనా హుందాగా నిలిచింది.

నివాళి

ఒక స్ఫూర్తి... ఒక జ్ఞాపకం

'ఆమె చదివే వార్తలు వినండి. ఇంగ్లిష్ ఎలా ప్రొనౌన్స్ చేయాలో తెలుస్తుంది' అని టీచర్లు పిల్లలకు చెప్పేవారు. ఆమె హుందా రూపాన్ని కాలేజీ అమ్మాయిలు, గృహిణులు అనుసరించేవారు. ఆడపిల్లలు చదువుకోవడానికి ఆ రోజుల్లో ఆమె ఒక స్ఫూర్తి. గీతాంజలి అయ్యర్ దూరదర్శన్ కోట్లాది ప్రేక్షకులకు మరువలేని జ్ఞాపకం. జూన్ 7న ఆమె మరణించారు. ఆమె వేసిన తొలి అడుగు నేటి ఎందరో మహిళా జర్నలిస్టుల ముందడుగు.





71 ఏళ్ల గీతాంజలి అయ్యర్ మరణ వార్త ఒకనాటి దూరదర్శన్ ప్రేక్షకులను పాత జ్ఞాపకాలలోకి తీసుకెళ్లింది. 1982 నుంచి దూరదర్శన్ కలర్ ప్రసారాలు మొదలయ్యాక, ఇళ్లల్లో టెలివిజన్ సెట్లు టేబుళ్ల మీదకు చేరుతుండగా జనానికి ఉదయంపూట పేపర్ చదవడం ఎలా అలవాటో, రాత్రిళ్లు దూరదర్శన్ వార్తలు చూడటం అలా అలవాటుగా మారింది. హిందీలో, ఇంగ్లిష్‌లో వార్తలు చూసేవారు కోట్లమంది ఉండేవారు. హిందీలో షమ్మి నారంగ్, జెవి రామన్, సల్మా సుల్తానా తదితర న్యూస్‌రీడర్లు ఖ్యాతి పొందితే ఇంగ్లిష్‌లో గీతాంజలి అయ్యర్, బుగ్గ మీద పులిపిరితో నీతీ రవీంద్రన్, రిని సిమోన్ అభిమానులను సంపాదించుకున్నారు.

ఆధునిక న్యూస్‌రీడర్

ఇంగ్లిష్‌లో అందరు న్యూస్‌రీడర్ల కన్నా ఎక్కువ గుర్తింపు పొందినది గీతాంజలి అయ్యర్. ఇందుకు కారణం ఆమె ఆధునిక హుందా రూపం. జుత్తును కత్తిరించుకుని, చిన్న బొట్టుతో ఆమె అందరినీ ఆకట్టుకుంది. ఆమె ఇంగ్లిష్ ఉచ్చారణ కచ్చితంగా ఉండటంతో స్కూళ్లల్లో ఇంగ్లిష్ టీచర్లు ఆమె ప్రస్తావన చేసేవారు. ఆమె ఎంపిక చేసుకునే చీరలకు కూడా గొప్ప ఫాలోయింగ్ ఉండేది. 'నేను రోడ్డు మీద ఎక్కడ కనిపించినా స్త్రీలు వచ్చి మీరు హెయిర్ కట్ ఎక్కడ చేయించుకుంటారు అని అడిగేవారు. బ్యూటీ సెలూన్లకు వెళ్లి నా పేరు చెప్పి నాలా హెయిర్ కట్ చేయమని కోరేవారు. అలాగే నా బ్లౌజ్ కట్ కూడా వారికి బాగా నచ్చేది. నాలా మంచిగా చదువుకుని, ఇంగ్లిష్ మాట్లాడుతూ, హుందా అయిన కెరీర్ ఏర్పరుచుకోవాలని ఎందరో యువతులు అనుకునేవారు. ఆ మేరకు వారిని నేను ఇన్‌స్పైర్ చేశాను' అనేది గీతాంజలి అయ్యర్.

రేడియోలో వార్తలు విని

గీతాంజలి అయ్యర్ కోల్‌కతాలో పెరిగింది. ఆరేళ్ల వయసులో ఇంట్లో తండ్రి రేడియోలో వార్తలు వింటుంటే తనూ వినేది. 'ద న్యూస్ రెడ్ బై'... అనే మాట ఆమెను ఆకర్షించింది. ఆ తర్వాత స్కూల్‌లో తరచూ ఇంగ్లిష్ వక్తృత్వ పోటీల్లో పాల్గొనేది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో డిప్లమా కోర్సు చేశాక 1976లో దూరదర్శన్‌లో చేరింది. 'నేను వార్తలు చదవడం మొదలుపెట్టే సమయానికి ఏడాది కొడుకున్నాడు. మరో ఐదేళ్లకు కూతురు పుట్టింది. ఆ రోజుల్లో ఉద్యోగం చేయడం ఒక గొప్ప అయితే పెళ్లయి, పిల్లలు పుట్టాక కూడా ఉద్యోగం చేయడం మరో గొప్ప. కాని స్త్రీలు తమ ఆసక్తులను నిలబెట్టుకోవాలి అని భావించి పనిచేశాను' అనేదామె.

ఎన్నో సవాళ్లు

దూర్‌దర్శన్‌లో వార్తలు ప్రసారం అయ్యే రోజుల్లో సాంకేతిక ఈ స్థాయిలో ఉండేది కాదు. 'వార్తలు అప్పటికప్పుడు వచ్చేవి. రిహార్సల్స్ లేకుండానే చదవాల్సి వచ్చేది. ఆఫీసులో చాలా పాత టైప్ రైటర్లు ఉండేవి. వాటిమీద వార్తలు టైప్ చేసి ఇచ్చేవారు. 'కూంబింగ్' బదులు 'బాంబింగ్' అని ఒక్కోసారి తప్పుగా టైప్ అయ్యేది. అప్పటికప్పుడు మాకున్న నాలెడ్జ్‌తో సరి చేసి చదివేవాళ్లం' అని చెప్పిందామె ఒక ఇంటర్వ్యూలో. 'వార్తలను పర్సనల్ టచ్ లేకుండా చదవడం మా ఆచారంగా ఉండేది. కాని ఇవాళ్టి న్యూస్ రీడర్లను చూస్తే వార్తల తరఫున వకాల్తా తీసుకుంటూ కనపడుతున్నారు. మా రోజుల్లో మాకున్న ఫాన్ ఫాలోయింగ్ అసామాన్యంగా ఉండేది. ఎందుకంటే మేమే తొలితరం న్యూస్‌రీడర్లం. స్క్రీన్ మీద కనిపించేవారం. కాని మేము అది నెత్తికి ఎక్కించుకునే వారం కాదు. ఇవాళ్టి న్యూస్ రీడర్లు అవతారమూర్తులుగా భావించడం శోచనీయం. స్క్రీన్ మీద మాత్రమే మీరు న్యూస్‌రీడర్లు. మామూలు జీవితంలో మీరు ఎవరికంటే ఎక్కువ కాదు.. తక్కువ కాదు.. ఆ సంగతి గుర్తించాలి' అని హితవు పలికిందామె.

అడ్వర్‌టైజ్‌మెంట్లలో మోడల్‌గా కూడా కనిపించిన గీతాంజలి అయ్యర్ తాను మరణించే వరకూ కూడా చక్కటి రూప ఆహార్యాలను పాటించింది. ఎలక్ట్రానిక్ మీడియాలో స్త్రీల ప్రవేశానికి గొప్ప పునాది వేసిన గీతాంజలికి నివాళి.

హీహీహీ... హాహ్హాహ్హా అంతే!



నవ్వు ఆరోగ్యానికి మంచిదని మనందరికి తెలుసు. తీరికలేని లైఫ్‌స్టైల్, బాధ్యతలు, బరువులతో నవ్వడం కూడా మర్చిపోతున్నాం. ఇది చాలదన్నట్లు రెండేళ్లపాటు ప్రపంచాన్ని శాసించిన కరోనా పుణ్యమా... ముఖానికి మాస్కుల తాళం పడింది. శానిటైజర్లు ఆవిరైపోయినట్లే ముఖాల మీద నవ్వులు మాయమయ్యాయి. ఇప్పుడు చాలామందికి చక్కగా నవ్వడం ఎలాగో తెలియడం లేదు. ఈ జాబితాలో జపాన్ వాసులు ముందు వరుసలో ఉన్నారు. గత కొద్దికాలంగా నవ్వడం మర్చిపోయిన జపనీయులు దాదాపు మూడేళ్లపాటు మాస్కులు ధరించిన జపనీయులు నవ్వడం మర్చిపోయారు. ప్రస్తుతం అక్కడి ప్రభుత్వం ఆంక్షలు సడలించడంతో 'స్మైలింగ్ లెసన్స్' నేర్చుకుంటున్నారు. చక్కగా నవ్వేందుకు ఏకాగ్రతతో పాఠాలు వింటున్నారు. ఒక్కో స్మైలింగ్ ట్రైనర్ దగ్గర మూడు వేలమంది క్లాసులకు హాజరవుతున్నారంటే అక్కడి డిమాండ్ ఏంటో తెలుస్తోంది.

"నవ్వు అనేది సహజసిద్ధంగా జరగాల్సిన ఒక ప్రక్రియ. ఇది చాలా ముఖ్యమైనది. ఎవరినైనా కలిసినప్పుడు మొదట మన నవ్వే పలకరిస్తుంది. మంచి మర్యాదలు మన నవ్వులోనే కనిపిస్తాయి. నవ్వడం మానేస్తే ముఖ కండరాలను ఎలా వాడాలో మెదడు మర్చిపోతుంది అని నిపుణులు చెబుతున్నారు. అందుకే నవ్వడం చాలా ముఖ్యం" అని స్మైలింగ్ ఇన్‌స్ట్రక్టర్ మిహోకి టానో చెబుతున్నారు.



హాలీవుడ్ స్మైల్...

గతంలో రేడియో హోస్ట్‌గా పనిచేసిన కైకో క్వానో స్మైలింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను నడుపుతున్నారు. "హాలీవుడ్ స్టైల్ స్మైలింగ్ టెక్నిక్'ను నేర్పించడం ఈమె ప్రత్యేకత. కళ్లను నెలవంకలా తిప్పి, బుగ్గలను గుండ్రంగా పెట్టి పై దవడలోని ఎనిమిది దంతాలు కనిపించేలా నవ్వడమే హాలీవుడ్ స్మైల్. ప్రస్తుతం జపనీస్ విద్యార్థులు ఈ నవ్వుని ఎగబడి నేర్చుకుంటున్నారు. "విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో మా దగ్గర క్లాసులు చెప్పించుకుంటున్నారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగాలకు నవ్వు ముఖ్యమని వారంతా క్లాసులకు హాజరవుతున్నారు. స్మైల్ ఎడ్యుకేషన్ గతంలోకంటే ఇప్పుడు నాలుగు రెట్లు పెరిగింది. ఒక్కోక్లాసుకు మన రూపాయల్లో సుమారు రూ.4,500 తీసుకుంటున్నాము. నవ్వుతూ ఎవరిని పలకరించినా అప్యాయంగా దగ్గరవుతారు" అని క్వానో చెబుతోంది.

ప్రస్తుతం నవ్వులు ప్రాక్టీస్ చేయడం కోసం కోచింగ్ సెంటర్‌లకు క్యూ కడుతున్నారు. ఇది కాస్త చిత్రంగా, మనకు నవ్వొస్తున్నా సరే... హహ్హా నవ్వుల కోసం వారు తెగ హడావుడి చేస్తున్నారు.

నవ్వు ఆరోగ్యమేగాక, నవ్వడం వల్ల ముఖ కండరాలకు మంచి వ్యాయామం జరిగి ముఖం మరింత గ్లోగా కనిపిస్తుంది. ఒత్తిడి దూరమవుతుంది. ఎక్కడైనా పని లేదా ఉద్యోగం చేయాలన్నా ముఖం మీద చిరునవ్వు తప్పనిసరి. దానితోనే నలుగురితోపాటు ముందుకు సాగగలం. ఇదే విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జపనీయులు శ్రద్ధగా నేర్చుకుని మరీ నవ్వుతున్నారు. అక్కడి స్మైలింగ్ కోచింగ్ సెంటర్లకు డిమాండ్ బాగా పెరిగిపోయింది.

కోవిడ్ ఆంక్షలు, కొన్ని రకాల షూల వల్ల

నవ్వితే ముత్యాలేమీ రాలిపోవు, నాలుగు రకాలుగా మంచే జరుగుతుంది కాబట్టి మనం కూడ మన సారా నవ్వుదాం.

బ్యూటిప్స్

● రెండు గుడ్ల సొనను తీసుకుని చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించి అరగంట తరువాత చల్లని నీటితో షాంపూ చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రొటీన్ అంది కేశాలకు బలంగా ఒత్తుగా పెరుగుతాయి. ● ఉల్లిపాయ ముక్కలను మెత్తగా గ్రైండ్ చేసి రసాన్ని వేరు చేయాలి. ఈ రసాన్ని తలకు పట్టించి గంట తరువాత షాంపూతో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తుండాలి. ఎందుకంటే, ఉల్లిపాయలోని సల్ఫర్ జుట్టు మందంగా పెరిగేలా చేస్తుంది. ఈ రెండింటిలో ఏ మాస్క్ వేసుకున్నా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

వంటిల్లు



మిక్స్‌డ్ ఫ్రూట్ డిప్

కావలసినవి: తొక్కతీసిన యాపిల్, పైనాపిల్, అరటి పండు, మామిడి పండు, స్ట్రాబెర్రీ ముక్కలు – ఒక్కోటి పావు కప్పు తీసుకోవాలి; దానిమ్మ గింజలు – కప్పు, పెరుగు – రెండు కప్పులు; మిరియాల పొడి – పావు టీస్పూను; జీలకర్ర పొడి – పావు టీస్పూను; కొత్తిమీర తరుగు – అర కప్పు; చక్కెర – టేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● పెద్ద గిన్నెలో పెరుగు వేసి క్రీమ్‌లా మారేంతవరకు చక్కగా కలపాలి. ● క్రీమ్ పెరుగులో చక్కెర, మిరియాల పొడి, జీలకర్ర పొడి, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. ● ఇప్పుడు అన్నిరకాల పండ్ల ముక్కలు, దానిమ్మ గింజలు వేసి కలపాలి. ఈ గిన్నెను మూతపెట్టి అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ● అరగంట తరువాత బయటకు తీసి కొత్తిమీర తరుగు వేస్తే మిక్స్ ఫ్రూట్ డిప్ రెడీ. ● మసాలా కూర, బిర్యానీల్లోకి ఈ డిప్‌లో డ్రైఫ్రూట్స్, బూందీ వేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది.

చల్ల పచ్చళ్లు

సీజన్ ఏదైనా..ప్రతి అకేషన్‌లో మసాలా ఫుడ్ కామన్. ఘాటైన మసాల రైస్‌తో రైతా తప్పనిసరి. మసాలా, కారం ఘాటు తగ్గించి కడుపుని చల్లబరిచే రుచికరమైన వెరైటీ రైతాలు మీకోసం...



కూర్గ్ మాంగే పజ్జి

కావలసినవి: మామిడి పండు – ఒకటి; పెరుగు – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – నాలుగు టేబుల్ స్పూన్లు; ఆవాలు – రెండు టీస్పూన్లు; పచ్చిమిర్చి – ఒకటి; చక్కెర – టీస్పూను; వెల్లుల్లి రెబ్బలు – మూడు; ఎండుమిర్చి – ఒకటి, కరివేపాకు – ఒక రెమ్మ; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టేబుల్ స్పూను.

తయారీ: ● మామిడి పండుని తొక్క తీసి సన్నని ముక్కలుగా తరుక్కోవాలి. ● పెద్దగిన్నెలో పెరుగు, చక్కెర వేసి ఉండలు లేకుండా చక్కగా కలపాలి. ● పచ్చి కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, టీస్పూను ఆవాలను మిక్సీజార్ లో వేసి కొద్దిగా నీళ్లపోసి మెత్తగా రుబ్బుకోవాలి. ● ఈ కొబ్బరి పేస్టు, మామిడిపండు ముక్కలు, రుచికి సరిపడా ఉప్పుని పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేసి వేడెక్కిన తరువాత ఆవాలు, ఎండు మిర్చి, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలను దంచి వేసుకోవాలి. ● వెల్లుల్లి బ్రౌన్ రంగులోకి మారాక తాలింపుని పెరుగు మిశ్రమంలో వేసి కలిపితే కూర్గ్ మాంగే పజ్జి రెడీ.



బతువా రైతా

కావలసినవి: బతువా ఆకులు – ఒకటిన్నర కప్పులు; పెరుగు – ఒకటిన్నర కప్పులు; పచ్చిమిర్చి – రెండు (సన్నగా తరగాలి); అల్లం తురుము – అరటీస్పూను; బ్లాక్ సాల్ట్ – అరటీస్పూను; జీలకర్ర పొడి – అరటీస్పూను; మిరియాల పొడి – పావు టీస్పూను; నూనె – అరటీస్పూను.

తయారీ: ● బతువా ఆకులను శుభ్రంగా కడిగి, సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ● స్టవ్‌మీద బాణలి పెట్టి నూనె వేయాలి. కాగిన నూనెలో బతువా ఆకులను వేసి మెత్తబడేంతవరకు మగ్గనివ్వాలి. ● మగ్గిన ఆకులను పేస్టులా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ● పెద్దగిన్నెలో పెరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తురుము, మిరియాల పొడి, జీలకర్ర పొడి, బ్లాక్ సాల్ట్ వేసి అన్నీ చక్కగా కలిసేలా కలపాలి. ● ఈ మిశ్రమానికి బతువా పేస్టుని వేసి కలిపితే బతువా రైతా రెడీ.



సొరైతా

కావలసినవి: సొరకాయ తురుము – అరకేజీ; పెరుగు – అరకేజీ; ఉప్పు – టీస్పూను; కారం – టీస్పూను; జీలకర్ర పొడి – అరటీస్పూను; నూనె – టేబుల్ స్పూను, జీలకర్ర – అరటీస్పూను; ఎండు మిర్చి – మూడు, ఉప్పు – రుచికి సరిపడా; కరివేపాకు – నాలుగు రెమ్మలు.

తయారీ: ● సొరకాయ తురుములో వచ్చే నీళ్లన్నీ ఇగిరి పోయేంత వరకు మీడియం మంట మీద ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● పెరుగుని క్రీమ్‌లా మారే వరకు కలుపుకోవాలి. క్రీమ్‌పెరుగులో ఉడికిన సొరకాయ తురుము, కారం, జీలకర్ర పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేసి స్టవ్ మీద పెట్టాలి. నూనె వేడెక్కిన తరువాత జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించి పెరుగు మిశ్రమంలో వేస్తే సొరైతా రెడీ.

99 శాతం పూర్తి

(సాక్షి, అమరావతి)

ఓట్లడిగేటప్పుడు వందలకొద్దీ హామీలివ్వటం... తీరా ఆ ఓట్లతో గెలిచాక హామీలను పక్కనబెట్టడం!. దశాబ్దాలుగా ఇక్కడ చూస్తున్నది అదే. అలవికాని హామీలను చూసి చూసి అలసిపోయిన జనం... ఎన్నికలప్పుడు పార్టీలు విడుదల చేసే మేనిఫెస్టోలకు విలువివ్వటమే మానేశారు. వాటినసలు చూడకుండానే పక్కనబెట్టేస్తున్నారు. కాకపోతే 2019 ఎన్నికల్లో... ఈ పరిస్థితి మార్చాలని సంకల్పించారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్సార్ సీపీ తరఫున ఒకే ఒక పేజీ మేనిఫెస్టోను విడుదల చేశారు. దాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తానని స్పష్టంగా చెప్పారు. జనం జై కొట్టారు. ఓ కొత్త చరిత్రకు అంకురార్పణ జరిగింది.

....



మరి సింగిల్ పేజీ మేనిఫెస్టోతో ఎన్నికల్లో పోటీ చేసి అఖండ విజయాన్ని అందుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ముఖ్యమంత్రి అయ్యాక ఏం చేశారు? ఆ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశారా? దీనికి నిజాయితీగా వినవచ్చే సమాధానం ఒక్కటే. అది... 'ఆ రెండూ తప్ప' అని!. ఎందుకంటే మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా తీసుకున్న జగన్... తొలి ఏడాదే దాన్లో పేర్కొన్న 95 శాతం హామీలను అమల్లోకి తెచ్చారు. మిగిలిన సంక్లిష్టమైన హామీలను కూడా సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుంటూ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారు. కాకపోతే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను (సీపీఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను (ఓపీఎస్) తిరిగి అమల్లోకి తెస్తామన్న హామీని అమలు చేయలేకపోయారు. ఓపీఎస్‌ను తిరిగి తేవటం ఆచరణ సాధ్యం కాదని తేలినా... ఉద్యోగులకిచ్చిన హామీ మేరకు మెరుగైన పెన్షన్ పథకాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ యంత్రాంగం రెండేళ్లుగా రకరకాల గ్రూపులతో చర్చించి కసరత్తు చేస్తూ వచ్చింది. చివరకు వారి ప్రయోజనాలను కాపాడేలా గ్యారంటీడ్ పెన్షన్ పథకానికి (జీపీఎస్) రూపకల్పన చేసింది. ఉద్యోగ వర్గాలంతా ఈ జీపీఎస్‌పై సంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో దీన్ని అమల్లోకి తేవటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది కూడా. ఇక అమలు కాని హామీల్లో రెండవది మద్య నియంత్రణ. దశలవారీగా మద్యం వినియోగాన్ని తగ్గిస్తూ చివరకు దాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నా... రకరకాల సాంకేతిక, ఆర్థిక కారణాలతో పూర్తి స్థాయిలో ఆ హామీ అమలు కాలేదు. కాకపోతే నియంత్రణ దిశగా బలమైన అడుగులు పడ్డాయి. పర్మిట్ రూమ్‌లు రద్దు చేయటం, బెల్టు షాపుల్ని తొలగించటం, విక్రయ వేళల్ని తగ్గించటంతో పాటు మద్యాన్ని నేరుగా ప్రభుత్వ దుకాణాల ద్వారానే విక్రయిస్తూ ఖచ్చితమైన వేళల్ని పాటించటం, రేట్లను పెంచటం వంటివి మద్యం అమ్మకాలను గణనీయంగా తగ్గించాయి. 2018-19తో పోలిస్తే విక్రయాలు 50 శాతానికన్నా తగ్గాయంటే నియంత్రణ దిశగా అడుగులు పడ్డాయన్నది స్పష్టంగా తెలియకమానదు. కాకపోతే ఈ రెండంశాలూ హామీ ఇచ్చినట్లుగా నూటికి నూరు శాతం అమలు కాలేదు కనక... మేనిఫెస్టోలో 99 శాతమే అమలయ్యిందని చెప్పాలి. నూటికి 99 శాతం మార్కులే ఇవ్వాలి. ఇక్కడ గమనించాల్సిందొక్కటే. అసలు మేనిఫెస్టోను ఇంత చిత్తశుద్ధితో అమలు చేసిన ప్రభుత్వాలను మనమెన్నడైనా చూశామా? గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఏం జరిగిందో ఎవరికి తెలియదని? 2014లో ఆయన ఇచ్చిన ఏ హామీనైనా గెలిచాక అమలు చేశారా? అసలు మేనిఫెస్టోనే పార్టీ వెబ్‌సైట్లో నుంచి తొలగించిన చరిత్ర ఆయనది. ఒకటికాదు రెండు కాదు... వందలకొద్దీ హామీలనిచ్చారు. కానీ తొలి నాలుగున్నరేళ్లూ ఒక్క హామీని కూడా పట్టించుకోలేదు. మళ్లీ 2019లో ఎన్నికలు ముంచుకొస్తున్నాయనగా హడావుడిగా కొన్ని హామీలను అరకొరగానైనా అమలు చేశామని చూపించుకోవటానికి ప్రయత్నించారు. కొద్ది మంది ఖాతాల్లో రూ.1000 చొప్పున నిరుద్యోగ భృతిని జమచేయటం... పసుపు కుంకుమ కింద మహిళల ఖాతాల్లో నగదు వేయటం... ఇవన్నీ ఎన్నికలకు కేవలం రెండుమూడు నెలల ముందు చేశారు. అంతేకాదు! ఈ రాష్ట్రానికి తీరప్రాంతమే మణిహారమంటూ రకరకాల గ్రాఫిక్‌లు చూపించి... ఎన్నికలకు కేవలం 20 రోజుల ముందు పోర్టులకు శంకుస్థాపనలంటూ హడావుడి చేశారు. భోగాపురం విమానాశ్రయానిదీ అదే కథ. విచిత్రమేంటంటే ఇలా ఏ హామీనీ అమలు చెయ్యని చంద్రబాబు నాయుడు... 2019 ఎన్నికల్లో మాత్రం తాను చెప్పినవన్నీ చేశానని, మళ్లీ గెలిపిస్తే ఇంకేదో చేస్తానంటూ స్వర్గాన్ని గ్రాఫిక్‌లలో చూపించే ప్రయత్నం చేశారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు కూడా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రం నిజాయితీగా తన పనితీరుకు మార్కులు వేసుకుంటున్నారు. మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్నీ అమలు చేయటానికి ప్రయత్నించటంతో పాటు రెండంశాలు తప్ప మిగిలినవన్నీ 100 శాతం అమలు చేశారు. 99 శాతం మార్కులు సాధించగలిగారు. రాజకీయ వర్గాలు ఈ రెండు మేనిఫెస్టోలనూ 'విశ్వసనీయత- వంచన'తో పోలుస్తున్నది కూడా అందుకేనేమో!!.

ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచే..

రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతానికి పైగా ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని సాధించాక 2019 మే 30న వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మరుక్షణమే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ.. వృద్ధాప్య పింఛన్‌ను పెంచే ఫైలుపై తొలి సంతకం చేశారు. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 56 శాతం పదవులు ఇచ్చి సామాజిక విప్లవానికి తెరతీశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే.. నవరత్నాలతో 95 శాతం హామీలను అమలు చేశారు. కోవిడ్ కష్టకాలంలోనూ మాట తప్పకుండా వాటిని కొనసాగించారు. ఉద్యోగులు అడగక ముందే 12వ పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం... సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా జీపీఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీమ్) విధానానికి ఆమోదం తెలపటం... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపడంతో మేనిఫెస్టో అమల్లో మరింత ముందడుగు వేసినట్లయింది. 99 శాతం హామీలను నెరవేర్చినట్లయింది. దేశ చరిత్రలో ఒక రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేయడం ఇదే మొదటిసారన్నది రాజకీయ విశ్లేషకుల మాట.

ఇబ్బందుల్లోనూ చెప్పిన దాని కంటే మిన్నగా..

2020లో ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కరోనా మహమ్మారి ప్రభావం రాష్ట్రంపైనా పడింది. ఆర్థిక ఇబ్బందులను సృష్టించింది. కరోనా కష్టకాలంలోనూ.. ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమల్లో సీఎం వైఎస్ జగన్ వెనుకంజ వేయలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ అమలు చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు రైతులకు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పిన సీఎం జగన్.. దాన్ని మరో వెయ్యి పెంచి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చేలా అమలు చేస్తున్నారు. అంటే.. రైతు భరోసా ద్వారా ఒక్కో రైతుకు అదనంగా రూ.17,500 ప్రయోజనం చేకూరుస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర పథకాలనూ అమల్లోకి తెచ్చారు. 2019 ఎన్నికల తర్వాత.. జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్.. తిరుపతి లోక్‌సభ, ఆత్మకూరు, బద్వేలు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడమే ఆయనపై జనానికున్న నమ్మకానికి నిదర్శనం.

అర్హతే ప్రామాణికం

కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అంతే పారదర్శకంగా అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2,16,786 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. దేశ చరిత్రలో డీబీటీ రూపంలో ఈ స్థాయిలో పేద ప్రజల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేయడం మునుపు ఎన్నడూ లేదు. ఇక నేరుగా నగదు జమ చేయటం కాకుండా ఇతరత్రా రూపాల్లో లబ్ధి చేకూర్చిన పథకాలు కూడా కలిపితే (డీబీటీ ప్లస్ నాన్ డీబీటీ) లబ్ధిదారులకు రూ.3.10 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. ఇచ్చిన మాట మేరకు 31 లక్షల మంది అక్కచెల్లెమ్మల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి పేరిట ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాన్ని మంజూరు చేసి, నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దేశ చరిత్రలో ఒకేసారి ఇలా 31 లక్షల మందికి ఇంటి స్థలాలను ఇచ్చి.. వారి పేర్లతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన దాఖలాలు గతమెన్నడూ లేవు.

దగా చేసిందెవరు?

- రెగ్యులర్ ఉద్యోగాలకు గండి కొట్టింది చంద్రబాబే
- 2003లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నాంది
- మూడేళ్ల తరువాత తొలగిస్తామంటూ అప్పట్లోనే జీవో

సాక్షి, అమరావతి: ఎన్నికల హామీని నెరవేర్చకుండా, కోర్టు తీర్పులంటూ సాకులు చెబుతూ నాడు చంద్రబాబు సర్కారు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించకుండా దగా చేస్తే 'ఈనాడు' రామోజీరావుకు పట్టనే లేదు. ఇప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం న్యాయపరమైన, చట్టపరమైన చిక్కులను అధిగమించి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తుంటే 'ఈనాడు'లో దగాకోరు కథనాలకు తెగబడటమే విచిత్రం. నిజానికి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆద్యుడు చంద్రబాబే. 2003లోనే చంద్రబాబు సర్కారు పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానానికి తెర తీసింది. అదికూడా మూడేళ్లకు మించి కాంట్రాక్టు ఉద్యోగులను కొనసాగించకూడదని, ఆలోగా తొలగించాలని పేర్కొన్నారు. రామోజీకి అప్పుడు ఇవన్నీ దగా, మోసం అనిపించలేదు. ఎందుకంటే అప్పుడు అధికారంలో ఉన్నది బాబు కాబట్టి!!

సుదీర్ఘ కసరత్తు

''అన్ని ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను వారి అర్హత, సర్వీసును పరిగణనలోకి తీసుకుని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేస్తాం'' అని వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం సుదీర్ఘ కసరత్తు జరిగింది. సీఎం జగన్ మంత్రుల కమిటీతో పాటు సీఎస్ అధ్యక్షతన వర్కింగ్ కమిటీని నియమించారు. కమిటీ పలుదఫాలు సమావేశమై న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై చర్చించింది. ప్రభుత్వ ఉద్యోగాలను పొందేందుకు కాంట్రాక్టు ఉద్యోగాలు దొడ్డిదారి కాకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులో పేర్కొంది. ఈ క్రమంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా వర్కింగ్ కమిటీ చర్యలు తీసుకుంది. 2014 జూన్ 2 నాటి నుంచి ఇప్పటివరకు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వర్కింగ్ కమిటీ సిఫార్సు చేసింది. రెగ్యులరైజేషన్‌పై నిషేధం విధిస్తూ 1994లో చేసిన చట్టానికి సవరణలు చేయాలని సూచించింది. తద్వారా 10,000 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతోంది.

ఇదీ సామాజిక సాధికారత

సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఆర్థిక, విద్య, ఆరోగ్య, మహిళా సాధికారత సాధించడానికి బాటలు వేస్తున్న సీఎం వైఎస్ జగన్.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట మేరకు నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకు సింహభాగం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి సామాజిక న్యాయాన్ని సాకారం చేశారు. నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు.. మహిళలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ పదవులు ఇవ్వడం ద్వారా దేశ రాజకీయ చరిత్రలో సరి కొత్త అధ్యాయాన్ని లిఖించారన్నది విశ్లేషకుల మాట. పునర్ వ్యవస్థీకరణ ద్వారా 2022 ఏప్రిల్ 11న ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో ఆ వర్గాలకు 70 శాతం పదవులు ఇచ్చారు. ఐదు డిప్యూటీ సీఎం పదవులు ఉంటే.. నాలుగు ఆ వర్గాలకే ఇచ్చారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ.. శాసనమండలి చైర్మన్‌గా ఎస్సీ, డిప్యూటీ చైర్మన్‌గా మైనార్టీ మహిళకు అవకాశం ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీకి 8 రాజ్యసభ స్థానాలు దక్కితే.. నాలుగు స్థానాలు ఆ వర్గాలకే ఇచ్చారు. శాసన మండలిలో 43 స్థానాలు దక్కితే.. 29 స్థానాలను ఆ వర్గాలకే ఇచ్చారు.

జీపీఎస్, మద్యం విషయంలో వాస్తవాలివీ...

పాత పింఛను పథకం ఆచరణ సాధ్యం కాదని తేలిన మీదట సుదీర్ఘ కసరత్తుతో వైఎస్ జగన్ ప్రభుత్వం తెస్తున్న గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్‌లో... ఒక్క పీఆర్సీ ప్రకారం పెన్షన్ల పెంపు వంటివి తప్ప మిగతా ప్రయోజనాలన్నీ ఉంటాయన్నది ఉద్యోగ సంఘాలు చెబుతున్న మాట. వారు చెబుతున్న వివరాల మేరకు... ద్రవ్యోల్బణం ఆధారంగా ఏటా రెండు డీఆర్‌లు (కరవు భత్యం) చెల్లిస్తారు. 50వేలు జీతం వచ్చేవారికి ఇది 3 శాతం చొప్పున ఏడాదికి 6 శాతం అనుకుంటే.. 20 ఏళ్ల సర్వీసు కాలంలో 120 శాతం ఉంటుంది. ఏటా ఇలా పెరుగుతూ ఉంటుంది కనక ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తట్టుకోగలుగుతారని, పెన్షనర్లు ద్రవ్యోల్బణం బారిన పడకుండా తమ జీవనాన్ని సాగించటానికి ఉపకరిస్తుందని వారు పేర్కొంటున్నారు.

ఇక మద్యం విషయానికొస్తే 2014-15 నుంచి చంద్రబాబు నాయుడి హయాంలో మద్యం విక్రయాలు పెరుగుతూనే వచ్చాయి. 2014-15లో 288.6 లక్షల కేసుల మద్యం, 174.5 లక్షల కేసుల బీరు విక్రయాలు జరగ్గా.. 2018-19లో మద్యం విక్రయాలు 384.36 లక్షల కేసులకు... బీరు విక్రయాలు 277.16 లక్షల కేసులకు చేరాయి. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు నియంత్రణ చర్యలు తీసుకోవటంతో... 2020-21లో మద్యం విక్రయాలు 194 లక్షల కేసులకు, బీరు విక్రయాలు 57 లక్షల కేసులకు తగ్గిపోయాయి. పోనీ ఆ ఏడాది కోవిడ్ అనుకున్నా... 2022-23లో సైతం 335 లక్షల కేసుల మద్యం... 116 లక్షల కేసుల బీరు విక్రయాలు మాత్రమే జరగటం గమనార్హం.

సినిమా




● లావణ్యా త్రిపాఠి, వరుణ్ తేజ్

రెండు హృదయాలు.. ఒక ప్రేమ

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠి కొంతకాలంగా ప్రేమలో ఉన్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వార్తలు నిజమే. త్వరలో వరుణ్ తేజ్, లావణ్యా త్రిపాఠి ఏడడుగులు వేసి, మూడు ముళ్ళ బంధంతో వైవాహిక జీవితాన్ని ప్రారంభించనున్నారు. నేడు (శుక్రవారం) వరుణ్, లావణ్యల నిశ్చితార్థం జరగడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 'రెండు హృదయాలు.. ఒక ప్రేమ' అంటూ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఓ నోట్ వైరల్‌గా మారింది. కుటుంబ సభ్యుల సమక్షంలో మాత్రమే ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఇక 2017లో వచ్చిన 'మిస్టర్'లో వరుణ్ తేజ్, లావణ్య తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఆ తర్వాతి సంవత్సరం 'అంతరిక్షం: 9000కే ఎమ్‌పీహెచ్' సినిమాలో జంటగా నటించారు. ఈ సినిమా టైమ్‌లోనే వీరి స్నేహం ప్రేమగా మారినట్లు తెలుస్తోంది.

సాఫ్ట్‌గా ఉండకు.. ఆడుకుంటారు



● నాగశౌర్య

'కుర్రాళ్ళంటే ఈ వయసులో ఇలాగే ఉంటార్రా. నువ్వేం కంగారు పడకు' అనే డైలాగ్‌తో మొదలైంది 'రంగబలి' టీజర్. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా పవన్ బాసంశెట్టి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రంగబలి'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'అయ్య బాబోయ్.... రేపట్నుంచి చూత్తారుగా.. మా డెడికేషన్ చూస్తే మీకు జ్వరం వచ్చేస్తది (నాగశౌర్య)', అయినా.. నువ్వేం అంత సాఫ్ట్‌గా ఉండకు.... ఆడుకుంటారు (యుక్తి తరేజ)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రంలో బీ ఫార్మసీ చదివిన యువకుడి పాత్రలో నాగశౌర్య, డాక్టర్ పాత్రలోయుక్తి తరేజ నటించినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సత్య, సప్తగిరి, షైన్ టామ్ చాకో కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: పవన్ సీహెచ్.

కలయా.. నిజమా..



● అరుణ్, కటూరి వెంకటేశ్వర్లు, సుడిగాలి సుధీర్

సుడిగాలి సుధీర్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'కాలింగ్ సహస్ర'. ఈ చిత్రంలో డాలిశ్య హీరోయిన్. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, పమిడి చిరంజీవి, కటూరి వెంకటేశ్వర్లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'కలయా నిజమా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. మోహిత్ రెహమానిక్ స్వరపరచిన ఈ పాటకు లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా, కేఎస్ చిత్ర పాడారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమంలో సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ– ''మూడేళ్ల కష్టం ఈ సినిమా. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలకు భిన్నంగా డిఫరెంట్ జానర్‌లో రూపొందిన సినిమా ఇది'' అన్నారు. ''చిత్రగారు పాడిన తర్వాత ఈ పాటకు మరింత అందం వచ్చింది. ఈ పాట టైమ్‌లో ఆమెకు ఆరోగ్యం సరిగ్గా లేక పోయినా నాలుగు గంటలు ప్రాక్టీస్ చేసి, మరీ పాడారు'' అన్నారు మోహిత్ రెహమానిక్. ''నిర్మాతలుగా మాకు 'కాలింగ్ సహస్ర' తొలి అడుగు. మాకు ఇదొక స్వీట్ మెమొరీ'' అన్నారు వెంకటేశ్వర్లు. ''సినిమా ఎంగేజింగ్‌గా ఉంటుంది'' అన్నారు శివ బాలాజీ. డాలిశ్య, లక్ష్మీ ప్రియాంక, సినిమాటోగ్రాఫర్ సన్నీ, యూ ట్యూబర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



● అనుపమ

బిజీ బిజీ

తెలుగులో ప్రస్తుతం రవితేజ 'ఈగిల్', సిద్దు జొన్నలగడ్డ 'డీజే టిల్లు స్క్వైర్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారు అనుపమా పరమేశ్వరన్. ఈ బ్యూటీ తాజాగా మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'సినిమా బండి' ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రవీణ్ వెల్లడించి, ఓ ఫోటోను షేర్ చేశారు. విజయ్ దొంకాడ ఈ సినిమాను నిర్మిస్తారు. అతి త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ అని, ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుందని భోగట్టా. అలాగే తమిళంలో 'సైరన్', మలయాళంలో 'జేఎస్‌కే: ట్రూత్ షల్ ఆల్వేస్ ప్రివైల్' సినిమాలు చేస్తున్నారు అనుపమ. ఇలా వరుస చిత్రాలతో ఈ ఏడాది అనుపమ బిజీ బిజీ అన్నమాట.

ఈవీవీ సినిమాలు గుర్తుకు వస్తున్నాయి

- దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి

''ఒకే సినిమాలో ఇంతమంది నటీనటులను చూస్తుంటే ఈవీవీగారి సినిమాలు గుర్తుకు వస్తున్నాయి. 'అన్‌స్టాపబుల్' చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు దర్శకుడు ఎ. కోదండ రామి రెడ్డి. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, ఆక్సాఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు ఎ. కోదండరామి రెడ్డి అతిథిగా పాల్గొన్నారు. సప్తగిరి మాట్లాడుతూ– ''ఈ సినిమాతో సన్నీ, డైమండ్ రత్నబాబులకు విజయం రావాలి'' అన్నారు. ''కుటుంబం అంతా కలిసి చూడదగ్గ వినోదాత్మక చిత్రం ఇది. డైమండ్ రత్నబాబు మంచి హిలేరియస్ కథ రాశారు'' అన్నారు సన్నీ. ''మా సినిమా పోస్టర్ చూసిన వారు ఈవీవీగారి సినిమాలాంటి అనుభూతి కలుగుతుందని చెప్పడం సంతోషంగా ఉంది. ఈ సినిమా ఫస్ట్ షో ఎక్కడ ప్రదర్శించబడితే అక్కడ ఓ సీట్‌ను ఈవీవీగారి కోసం ఉంచుతాం. ఇది ఆయనకు మేం ఇచ్చే ఓ చిరు కానుక'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''క్వాలిటీ కామెడీ ఉన్న ఈ ఫిల్మ్ ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అన్నారు రజిత్ రావు.



● రజిత్ రావు, సప్తగిరి, కోదండ రామిరెడ్డి, డైమండ్ రత్నబాబు, వీజే సన్నీ

ఆ మాటలే నాకు దీవెనలు

- ఆర్. నారాయణమూర్తి



"సమాజంలో బోలెడన్ని సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలను చర్చించడానికి ఎన్నో వేదికలు ఉన్నాయి. ఒక సినిమా కళాకారుడిగా వెండితెర వేదికగా ఆ సమస్యలు చూపిస్తున్నాను" అని అన్నారు దర్శక-నిర్మాత-నటుడు ఆర్. నారాయణమూర్తి. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందించి, నటించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆర్. నారాయణమూర్తి 'సాక్షి'తో చెప్పిన విశేషాలు ఈ విధంగా...

సమాజంలో ఉన్న సమస్యలతోనే 40 ఏళ్లుగా సినిమాలు తీస్తున్నారు... రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు తీస్తే సేఫ్ కదా?

సేఫ్టీ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. నా వంతుగా సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడే సినిమా ఇవ్వాలన్నదే నా ఆశయం. అనాదిగా మంచి కోసం, సమసమాజం కోసం ఎందరో మహనీయులు వారివారి వేదికల్లో కృషి చేస్తూనే ఉన్నారు. అదే కోవలో నేను సినిమా వేదికగా ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నాను. ఒక సమస్య ఉత్పన్నం అయినప్పుడు జర్నలిస్టు తన కలంతో, వాగ్గేయకారుడు పాటతో, రచయిత తన రచనలతో పరిష్కారం కోసం పోరాడతారు. అలాగే ఒక సినిమా సాంస్కృతిక సైనికుడిగా 40 ఏళ్లుగా సామాజిక సమస్యలే ఇతివృత్తంగా సినిమాలు తీస్తున్నాను. ఇందులోనే నాకు సంతృప్తి, ఆనందం దక్కుతున్నాయి. శ్రీశ్రీ చెప్పినట్లు నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అనేలా సామాజిక అంశాలపైన సినిమాలు తీస్తున్నాను తప్ప నేనేదో సమాజాన్ని ఉద్ధరించడం కోసం తీస్తున్నానని అనుకోవడంలేదు. గూడవల్లి రామబ్రహ్మం వంటి మహనీయులు సామాజిక అంశాలతో సినిమాలను రూపొందించి లెజెండ్స్‌గా నిలిచారు. వారి అడుగుజాడల్లో నడుస్తున్న చిన్నపిల్లవాడిని నేను.

'యూనివర్సిటీ' సినిమా గురించి?

విద్య, నిరుద్యోగం ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని రూపొందించాను. ప్రైవేటు విద్య వద్దు, పబ్లిక్ విద్యే ముద్దు అనే అంశంతో తీశాను. ప్రస్తుతం ప్రైవేటు విద్యా వ్యవస్థ వల్ల చదువు వ్యాపారంగా మారిపోయింది. ఈ వ్యవస్థలో ఫస్ట్ ర్యాంకులు సాధించాలని పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్‌లు పెరిగిపోయాయి. దీనివల్ల బాగా చదివిన విద్యార్థులు వెనకబడిపోతున్నారు. ఇవి భరించలేక ఆ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతేకాకుండా క్యాంపస్ వేదికల్లోని ప్రొఫెసర్లు కూడా కులాలకు, మతాలకు ప్రాధాన్యత నిస్తూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ఇలాంటి అసమానతలు పోవాలంటే కొఠారీ కమిషన్ పేర్కొన్నట్టు ప్రభుత్వ విద్యకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి, ప్రైవేటు సంస్థల్లోని వసతులు ఇక్కడ కూడా అందేలా చూడాలి. ఈ అంశాలు ప్రతిబింబించేలా ఈ సినిమా తీశాను.

విద్య గురించి మాత్రమేనా? ఇతర విషయాలేమైనా ఈ సినిమాలో చెప్పారా?

ఉద్యోగాల గురించి కూడా చర్చించాను. అతి పెద్ద గ్లోబల్ విలేజ్ అయినటువంటి భారత్ నుంచి ఎందరో విద్యార్థులు ఉద్యోగాల కోసం విదేశాలకు వెళుతున్నారు. కానీ అక్కడ కూడా నిరుద్యోగం పెరిగిపోయి మనవారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ రాజ్యాంగ హక్కు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అవన్నీ కోల్పోతున్నారు. అందుకే 1986లో మురళీధర్ రావు కమిషన్, 1990లో మండల్ కమిషన్ తెలిపిన రిపోర్టు ప్రకారం ప్రైవేటు సెక్టార్‌లో కూడా రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిన అవసరముంది. మనది నిరుద్యోగ భారతం కాదు... ఉద్యోగ భారతం కావాలని చెప్పే చిత్రం ఇది.

తెలుగు భాషకు ప్రాధాన్యం ఇచ్చే మీరు ఈ చిత్రంలో రెండు ఇంగ్లిష్ పాటలు పెట్టారు?

'ఎవిరీ బడీ సే నో టు ప్రైవేట్ స్కూల్స్.. ఎవిరీ బడీ సే యస్ టు పబ్లిక్ స్కూల్స్.. ఎవిరీ బడీ వాంట్స్ కామన్ ఎడ్యుకేషన్' అనే మహోన్నత ఆశయంతో వేల్పుల నారాయణగారు గొప్ప పాట రాశారు. ఈ పాటను సాయిచరణ్ అంతే గొప్పగా పాడారు. ఇంకో ఇంగ్లిష్ పాటను జలదంకి సుధాకర్ రాయగా, సాయిచరణ్ పాడారు. ఈ రెండు ఇంగ్లిష్ పాటలతో పాటు 'తాత. తాత..' అని గద్దరన్న రాసి, పాడిన పాట, ఇతర పాటలు కూడా సందర్భానుసారం సాగుతాయి.

ప్రజా సమస్యలతో సినిమాలు తీస్తున్న మీ గురించి ప్రజలు నాలుగు మంచి మాటలు మాట్లాడినప్పుడు కలిగే అనుభూతి..

నారాయణమూర్తి మన సమస్యలు తీస్తున్నాడు.. మన కథలను చూపిస్తున్నాడు.. ఒక కళాకారుడుగా మన గుండెల్లోని బాధను సినిమాలో చూపించాడు... పరిష్కారం మార్గం చూపిస్తున్నాడు. అతను మన మనిషి. ప్రజా కళాకారుడు అని ప్రజలు అంటున్న ఆ మాటలను పెద్ద దీవెనలుగా భావిస్తున్నాను. ఏ కథాంశం అయినా ఆకట్టుకుంటేనే అభిమానులు చూస్తారు. 'అర్ధరాత్రి స్వతంత్రం' నుంచి ఇప్పటివరకు సామాజిక సమస్యలే ప్రధానాంశాలుగా సినిమాలు తీస్తున్నాను. ప్రజలు దీవిస్తే అదే నా సంపాదన. నా సినిమాలు వంద రోజులు, జూబ్లీ వేడుకలు చేసుకున్నాయి. సక్సెస్ అయినా ఫెయిల్ అయినా సినిమాలు తీస్తూనే ఉంటాను.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
294	92
62,849	18,635

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	13,176	△	72
డోజోన్స్‌	33,790	△	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽	25
డాక్స్‌	15,990	△	29
షాంఘై	3,214	△	16
నికాయ్‌	31,641	▽	272

అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,587	▽	509
బంగారం (99.5 స్వచ్ఛత)	59,348	▽	404
వెండి (కిలో)	71,999	△	175

మళ్లీ వృద్ధికే పెద్దపీట



- 6.5 శాతం వద్దే రెపో రేటు
- వరుసగా రెండోసారి యథాతథం
- ద్రవ్యోల్బణ అంచనాల కుదింపు
- 6.5 శాతంగానే జీడీపీ అంచనాలు

ముంబై: ధరల స్పీడ్‌ కట్టడి సంకేతాలతో రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) వరుసగా రెండోసారి రెపో రేటును 6.5 శాతం (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) వద్ద యథాతథంగా కొనసాగించింది. మూడు రోజుల పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశాలు నిర్వహించిన గవర్నర్‌ శక్తికాంతదాస్‌ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ నిర్ణయాలు గురువారం వెలువడ్డాయి. కొన్ని కీలక నిర్ణయాలు చూస్తే..

యథాతథ వృద్ధి రేటు అంచనా

ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగించింది. ఏప్రిల్‌–జూన్‌, జూలై–సెప్టెంబర్‌, అక్టోబర్‌–డిసెంబర్‌, జనవరి–మార్చి త్రైమాసికాల్లో వరుసగా వృద్ధి రేట్లు 8%, 6.5%, 3.6%, 5.7 శాతంగా కొనసాగుతాయని అంచనావేసింది.

మెజారిటీ 'కఠినం' వైపే...

'సరళతర పరపతి ఉపసంహరణ' విధానం కొనసాగింపునకే ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు ఓటు వేశారు. ద్రవ్యోల్బణంపై ఇంకా ఆందోళనకరమైన పరిస్థితి తొలగిపోలేదని తద్వారా ఆర్‌బీఐ ఎంపీసీ సంకేతాలు ఇచ్చింది. ఒక్కరు మాత్రమే మళ్లీ రేటు తగ్గించవచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్‌ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలం 4 శాతంగా ఉన్న రెపో రేటు ఫిబ్రవరిలో వరుసగా ఆరోసారి పెంపుతో 6.5 శాతానికి ఎగబాకింది. గత ఏప్రిల్‌లో జరిగిన తొలి పాలసీ సమీక్షలో అంచనాలకు భిన్నంగా 6.5 శాతం యథాతథం రేటును కొనసాగించింది.

ద్రవ్యోల్బణం కట్టడిపైనే దృష్టి...

2023–24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం క్రితం అంచనాలను తగ్గించింది. క్రితం 5.2 శాతం అంచనాలను స్వల్పంగా 5.1 శాతానికి కుదించింది. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతంకన్నా (ప్లస్‌ 2 లేదా మైనస్‌ 2తో 4 శాతం ఉండాలి) ఇది 90 బేసిస్‌ పాయింట్లు తక్కువ కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం కట్టడిపైనే తన దృష్టి ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంత దాస్‌ ఉద్ఘాటించారు. దీనిని ఆయన 'అర్జున గురి'గా అభివర్ణించారు.

మరికొన్ని ముఖ్యాంశాలు..

- సహకార బ్యాంకులు త్వరలో మొండిబకాయిలకు (ఎన్‌పీఏ) సంబంధించి రాజీ సెటిల్‌మెంట్‌లు, రైటాఫ్‌లు చేయగలిగేలా మార్గదర్శకాలు వెలువడనున్నాయి. ఈ తరహా నిర్ణయాలను ఇప్పటి వరకూ షెడ్యూల్డ్‌ వాణిజ్య బ్యాంకులు, కొన్ని ఎంపిక చేసిన ఎన్‌బీఎఫ్‌సీలు మాత్రమే తీసుకునే వెసులుబాటు ఉంది.
- డిజిటల్‌ రుణాలకు సంబంధించి డిఫాల్ట్‌ లాస్‌ గ్యారెంటీ (డీఎల్‌జీ)పై మార్గదర్శకాలు జారీ. క్రెడిట్‌ డెలివరీ వ్యవస్థ క్రమాభివృద్ధి లక్ష్యంగా ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి.
- నాన్‌–బ్యాంక్‌ ప్రీపెయిడ్‌ పేమెంట్‌ ఇన్‌స్ట్రుమెంట్‌ (పీపీఐ) ద్వారా వ్యక్తుల కోసం నిర్దిష్ట ప్రీపెయిడ్‌ ఈ–రూపీ ఓచర్లను జారీ అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఈ–రూపీ అనేది ప్రాథమికంగా డిజిటల్‌ వోచర్‌. ఇది ఒక లబ్దిదారుడు తన ఫోన్‌లో ఎస్‌ఎంఎస్‌ లేదా క్యూఆర్‌ కోడ్‌ రూపంలో పొందుతాడు. ఇది ప్రీ–పెయిడ్‌ వోచర్‌. ఈ ప్రీపెయిడ్‌ వోచర్‌ను అంగీకరించే ఏ కేంద్రానికైనా వెళ్లి లబ్దిదారుడు సంబంధిత రిడీమ్‌ చేసుకోవచ్చు. తాజాగా నాన్‌–బ్యాంక్‌ ప్రీపెయిడ్‌ పేమెంట్‌ ఇన్‌స్ట్రుమెంట్‌ (పీపీఐ) జారీ చేసేవారికి ఈ–రూపీ వోచర్‌లను జారీ చేయడానికి ఆర్‌బీఐ అనుమతించింది.

1,000 రాదు... 5,00 పోదు..

గతేడాది మే నుంచి వ్యవస్థలో ఉన్న రూ.2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన అనంతరం ఇప్పటి వరకూ దాదాపు సగం పెద్ద నోట్లు వెనక్కు వచ్చాయని ఆర్‌బీఐ గవర్నర్‌ తెలిపారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్లు వ్యవస్థలో రూ.3.62 లక్షల కోట్లు చెలామణీలో ఉన్నాయి. ఇందులో ఇప్పటికి రూ.1.80 లక్షల కోట్లు వెనక్కు వచ్చేశాయి. వీటిలో 85 శాతం డిపాజిట్ల ద్వారానే వెనక్కు వచ్చాయన్నారు. రూ.500 నోట్లు వెనక్కు తీసుకోవాలన్న యోచన లేదని, అలాగే కొత్తగా రూ.1,000 నోట్లు తీసుకుని రాబోమని గవర్నర్‌ స్పష్టం చేశారు.

రూపే ప్రీపెయిడ్‌ ఫారెక్స్‌ కార్డులు..

రూపే ప్రీపెయిడ్‌ ఫారెక్స్‌ కార్డులను జారీ చేయడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. విదేశాలకు వెళ్లే భారతీయులకు చెల్లింపుల వెసులుబాటు విస్తరణకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రూపే డెబిట్‌, క్రెడిట్‌, ప్రీపెయిడ్‌ కార్డ్‌లు భారత్‌సహా విదేశీ వినియోగానికి ఇక బ్యాంకులు జారీ చేయవచ్చు.

సమతౌల్యత పాటించింది..

మార్కెట్‌ అంచనాలకు అనుగుణంగానే పాలసీ సమీక్ష ఉంది. అటు వృద్ధికి–ఇటు ద్రవ్యోల్బణం కట్టడికి ప్రాధాన్యత ఇస్తూ ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలు ఉన్నాయి. ద్రవ్యోల్బణం అంచనాలు తగ్గించడం ఎకానమీకి శుభ సంకేతం.

– దినేష్‌ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్‌

రియల్టీకి సానుకూలం

పాలసీ నిర్ణయాలు హౌసింగ్‌ విక్రయాల్లో సుస్థిర పురోగతి కొనసాగడానికి దోహదపడతాయి. రానున్న పాలసీలో రెపో రేటు కోత జరిగితే అది రియల్టీ పురోగతికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. రెపో రేటు కోత నిర్ణయం జరుగుతుందని విశ్వసిస్తున్నాము.

–బొమన్‌ ఇరానీ, క్రెడాయ్‌ ప్రెసిడెంట్‌

రేటు తగ్గాలి...

పరిశ్రమ అంచనాలకు అనుగుణంగానే పాలసీ నిర్ణయాలు ఉన్నాయి. ఇది వినియోగ సెంటిమెంట్‌ను బలపరుస్తుంది. అయితే రేటు తగ్గింపు నిర్ణయాలు జరగాలి. ప్రీపెయిడ్‌ రూపే ఫారెక్స్‌ కార్డుల జారీకి అనుమతి మరో ప్రోత్సాహకరమైన అంశం.

– దీపక్‌ సూద్‌, అసోచామ్‌ సెక్రటరీ జనరల్‌

పాలసీ ప్రకటన తర్వాత లాభాల స్వీకరణ

- రియల్టీ, ఆటో, బ్యాంకింగ్‌ షేర్లలో అమ్మకాలు
- 63 వేల దిగువకు సెన్సెక్స్‌
- నిఫ్టీకి 92 పాయింట్ల నష్టం



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన వైఖరి వెల్లడి తర్వాత స్టాక్‌ మార్కెట్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ద్రవ్యోల్బణ కట్టడికి కఠిన ద్రవ్య విధాన అమలుకు వెనుకాడబోమంటూ కేంద్ర రిజర్వ్‌ బ్యాంక్‌ సంకేతాలివ్వడంతో పలు రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్‌ 294 పాయింట్లు నష్టపోయి 63 వేల దిగువన 62,849 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు క్షీణించి 18,635 వద్ద నిలిచింది. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస ర్యాలీకి ముగింపు పడినట్లైంది. బ్యాంకింగ్‌, ఆటో, రియల్టీ, ఐటీ షేర్లు నష్టాలను చవిచూశాయి. బీఎస్‌ఈ మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ ఇండెక్సులు ఒకశాతం, అరశాతం చొప్పున పతనమయ్యాయి. అమెరికాలో టెక్‌ కంపెనీల షేర్ల భారీ పతనంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- రియల్టీ రంగానికి చెందిన బ్రిగేడ్‌ ఎంటర్‌ప్రైజెస్‌, మైక్రోటెక్‌ డెవలపర్స్‌ షేర్లు 3%, డీఎల్‌ఎఫ్‌, శోభా, ఒబెరాయ్‌ రియల్టీ షేర్లు 2%, గోద్రేజ్‌ ప్రాపర్టీస్‌, ఇండియాబుల్స్‌ రియల్‌ ఎస్టేట్‌, ఫోనిక్స్‌ మిల్స్‌ 1% చొప్పున నష్టపోయాయి.
- ఆటో రంగ కమ్మిన్స్‌ ఇండియా, మహీంద్రా, ఐషర్‌ మోటార్స్‌, టీవీఎస్‌ మోటార్స్‌ షేర్లు 2% క్షీణించాయి. టాటా మోటార్స్‌, భాష్‌, మారుతీ, ఎంఆర్‌ఎఫ్‌ షేర్లు 1–0.5% పతనమయ్యాయి.
- బ్యాంకింగ్‌ రంగానికి చెందిన కోటక్‌ మహీంద్రా బ్యాంక్‌ షేరు అత్యధికంగా మూడు శాతం నష్టపోయింది. బంధన్‌ బ్యాంక్‌ 2%, యాక్సిస్‌ బ్యాంక్‌ 1.5% పతనమయ్యాయి.

సర్వో కొత్త ఇంజిన్‌ ఆయిల్‌



చెన్నై: సర్వో బ్రాండ్‌ మరో కొత్త ఇంజిన్‌ ఆయిల్‌తో మార్కెట్లో వచ్చింది. మోటార్‌ సైకిళ్లలో వినియోగించే పూర్తి సింథటిక్‌ 4టీ ఇంజిన్‌ ఆయిల్‌ను సర్వో హైపర్‌స్పోర్ట్స్‌ ఎఫ్‌5 పేరుతో తీసుకొచ్చింది. ఈ ఉత్పత్తిని ప్రముఖ బాలీవుడ్‌ నటుడు జాన్‌ అబ్రహం విడుదల చేశారు. అలాగే సర్వో గ్రీజ్‌ మిరాకిల్‌ పేరుతో ప్రీమియం గ్రీజ్‌ ఉత్పత్తిని కూడా ఆవిష్కరించారు. రైడింగ్‌ పట్ల ఆసక్తి కలిగిన ఒక బైకర్‌గా ఈ కొత్త రకం ఆయిల్‌ను విడుదల చేస్తున్నందుకు సంతోషంగా ఉందని అబ్రహం తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఇండియా చైర్మన్‌ శ్రీకాంత్‌ మాధవ్‌ వైద్య, మార్కెటింగ్‌ డైరెక్టర్‌ వి సతీష్‌ కుమార్‌, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్‌ ఎస్‌ఎస్‌వీ రామకుమార్‌, ఇతర బోర్డు సభ్యులు, సీనియర్‌ అధికారులు పాల్గొన్నారు.

తాన్లా చేతికి వేల్యూఫస్ట్‌

డీల్‌ విలువ రూ. 346 కోట్లు

tanla ValueFirst

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: దేశీ 'సీపాస్‌' సేవల దిగ్గజం తాన్లా ప్లాట్‌ఫామ్స్‌ తాజాగా వేల్యూఫస్ట్‌ డిజిటల్‌ మీడియాను కొనుగోలు చేసేందుకు అమెరికన్‌ సంస్థ ట్విలియోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌ విలువ 42 మిలియన్‌ డాలర్లు (సుమారు రూ. 346 కోట్లు). ఈ ఏడాది జూలైలో డీల్‌ పూర్తి కాగలదని అంచనా. దేశీ సీపాస్‌ (కమ్యూనికేషన్స్‌ ప్లాట్‌ఫామ్‌ యాజ్‌ ఎ సర్వీస్‌) కంపెనీల్లో ఒకటైన వేల్యూఫస్ట్‌ 1,000 పైచిలుకు సంస్థలకు సర్వీసులు అందిస్తోంది. మరోవైపు, వేల్యూఫస్ట్‌ మిడిల్‌ ఈస్ట్‌ ఎఫ్‌జెడ్‌సీని రూ. 20 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఇంకో ఒప్పందాన్ని కూడా తాన్లా కుదుర్చుకుంది. రెండింటికీ దాదాపు రూ. 950 కోట్ల ఆదాయం ఉంటుందని, వేల్యూఫస్ట్‌ వ్యవస్థాపకుడు విశ్వదీప్‌ వీటికి సారథ్యం వహిస్తారని తెలిపింది. ప్రధానంగా అర్థవంతమైన కొనుగోళ్లపై తాము దృష్టి పెడుతున్నామని, కేరిక్స్‌ తరహాలోనే వేల్యూఫస్ట్‌ కొనుగోలు కూడా ప్రయోజనకరంగా ఉండగలదని తాన్లా వ్యవస్థాపక చైర్మన్‌ ఉదయ్‌ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వేల్యూఫస్ట్‌ను దక్కించుకోవడంతో దేశీ సీపాస్‌, ఎస్‌ఎంఎస్‌, వాట్సాప్‌ తదితర విభాగాల్లో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగలమని ఆయన చెప్పారు. అటు సౌదీ, ఇండోనేసియా మార్కెట్లలోనూ మరింతగా విస్తరించేందుకు ఇది దోహదపడగలదని ఉదయ్‌రెడ్డి వివరించారు.



హారిక గేమ్‌ 'డ్రా'... వైదొలిగిన హంపి

సెయింట్‌ లూయిస్‌ (అమెరికా): కెయిన్స్‌ కప్‌ మహిళల అంతర్జాతీయ చెస్‌ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్‌ ద్రోణవల్లి హారిక రెండో 'డ్రా' నమోదు చేసింది. అనా జటోన్‌స్కీ (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్‌ గేమ్‌ను హారిక 51 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఐదో రౌండ్‌ తర్వాత హారిక రెండు పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో ఉంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్‌, 2020 చాంపియన్‌ కోనేరు హంపి అనారోగ్య కారణాలరీత్యా ఈ టోర్నీ మధ్యలో నుంచి వైదొలిగింది. దాంతో నిర్వాహకులు హంపి ఈ టోర్నీలో ఆడిన నాలుగు రౌండ్‌ల గేమ్‌ల ఫలితాలను రద్దు చేశారు. షెడ్యూల్‌ ప్రకారం హంపితో తదుపరి రౌండ్లలో తలపడాల్సిన క్రీడాకారిణులకు ఆ రోజు విశ్రాంతి లభిస్తుంది. హంపి వైదొలగడంతో ప్రస్తుతం ఈ టోర్నీ తొమ్మిది మంది క్రీడాకారిణుల మధ్య జరుగుతుంది. ఐదో రౌండ్‌ తర్వాత అమెరికా క్రీడాకారిణి అనా జటోన్‌స్కీ 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

సెమీస్‌లో భారత్‌

చివరి లీగ్‌ మ్యాచ్‌లో చైనీస్‌ తైపీపై 11–0తో విజయం



దీపిక సోరెంగ్‌

కాకామిగహారా (జపాన్‌): మహిళల జూనియర్‌ ఆసియా కప్‌ హాకీ టోర్నీలో భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. చైనీస్‌ తైపీ జట్టుతో గురువారం జరిగిన పూల్‌ 'ఎ' చివరి లీగ్‌ మ్యాచ్‌లో భారత్‌ 11–0తో గెలిచింది. భారత్‌ తరఫున సునెలితా టొప్పో (43వ, 57వ ని.లో), అన్ను (10వ, 52వ ని.లో) రెండేసి గోల్స్‌ అందించగా... వైష్ణవి విఠల్‌ ఫాల్కే (1వ ని.లో), దీపిక (3వ ని.లో), రుతుజా (12వ ని.లో), నీలం (19వ ని.లో), మంజు చోర్సియా (33వ ని.లో), దీపిక సోరెంగ్‌ (46వ ని.లో), ముంతాజ్‌ ఖాన్‌ (55వ ని.లో) ఒక్కో గోల్‌ చేశారు. దీపిక సోరెంగ్‌కు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' అవార్డు లభించింది. పూల్‌ 'ఎ'లో మూడు విజయాలు, ఒక 'డ్రా'తో భారత్‌, దక్షిణ కొరియా 10 పాయింట్లతో సమ ఉజ్జీగా నిలువగా... మెరుగైన గోల్స్‌ అంతరం కారణంగా భారత్‌ 'టాపర్‌'గా నిలిచింది.

ప్రొ లీగ్‌ 'టాప్‌'లోకి భారత్‌



ఎయిండ్‌హోవెన్‌ (నెదర్లాండ్స్‌): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్‌) పురుషుల ప్రొ లీగ్‌లో భారత జట్టు మళ్లీ 'టాప్‌' ర్యాంక్‌లోకి వచ్చింది. బుధవారం రాత్రి నెదర్లాండ్స్‌ జట్టు చేతిలో 1–4 గోల్స్‌ తేడాతో ఓడిపోయిన భారత్‌... గురువారం జరిగిన మ్యాచ్‌లో 3–0 గోల్స్‌ తేడాతో అర్జెంటీనా జట్టును ఓడించింది. భారత్‌ తరఫున కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ (33వ ని.లో), అమిత్‌ రోహిదాస్‌ (39వ ని.లో), అభిషేక్‌ (59వ ని.లో) ఒక్కో గోల్‌ చేశారు. మొత్తం తొమ్మిది జట్లు పాల్గొంటున్న ప్రొ లీగ్‌లో ఇప్పటి వరకు భారత్‌ 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 27 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. బ్రిటన్‌ 26 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

భారత్‌ ఎదురీత!

15, 13, 14, 14... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌ ఫైనల్లో భారత టాప్‌–4 బ్యాటర్ల స్కోర్లు ఇవి! కొండంత స్కోరు ఎదురుగా కనిపిస్తుండగా మన ప్రధాన బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో రెండో రోజు కూడా ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. మన బౌలర్ల ఆట కాస్త మెరుగుపడటంతో ప్రత్యర్థిని తొందరగానే ఆలౌట్‌ చేయగలిగిన టీమిండియా ఆనందం కొద్ది సేపటికే ఆవిరైంది. కంగారూ బౌలర్లు ఒకరితో మరొకరు పోటీ పడి కట్టుదిట్టమైన బంతులతో భారత బ్యాటర్లను కట్టి పడేశారు. జడేజా, రహానే కీలక భాగస్వామ్యంతో ఆదుకోకపోయుంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. సగం బ్యాటర్లు ఇప్పటికే పెవిలియన్‌ చేరగా, మరో 318 పరుగులు వెనుకబడి ఉన్న భారత్‌ తొలి ఇన్నింగ్స్‌లో ఎంత వరకు పోరాడుతుందనే దానిపైనే టెస్టు ఫలితం ఆధారపడి ఉంది.



పుజారా బౌల్డ్‌

- తొలి ఇన్నింగ్స్‌లో 151/5
- మరో 318 పరుగులు వెనుకబడిన టీమిండియా
- ఆస్ట్రేలియా 469 ఆలౌట్‌
- స్టీవ్‌ స్మిత్‌ సెంచరీ



స్మిత్‌

లండన్‌: వరల్డ్‌ టెస్టు చాంపియన్‌షిప్‌ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో భారత్‌ ఎదురీదుతోంది. మ్యాచ్‌ రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి భారత్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (51 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించగా... ప్రస్తుతం అజింక్య రహానే (71 బంతుల్లో 29 బ్యాటింగ్‌; 4 ఫోర్లు), భరత్‌ (5 బ్యాటింగ్‌) క్రీజ్‌లో ఉన్నారు. ఐదుగురు ఆసీస్‌ బౌలర్లూ తలా ఒక వికెట్‌ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 327/3తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 469 పరుగులకు ఆలౌటైంది. హెడ్‌ (174 బంతుల్లో 163; 25 ఫోర్లు, 1 సిక్స్‌), స్టీవ్‌ స్మిత్‌ (268 బంతుల్లో 121; 19 ఫోర్లు) నాలుగో వికెట్‌కు 285 పరుగులు జోడించారు.

బౌలర్ల జోరు...

రెండో రోజును ఆస్ట్రేలియా ధాటిగా ఆరంభించింది. సిరాజ్‌ వేసిన తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన స్మిత్‌ 229 బంతుల్లో కెరీర్‌లో 31వ సెంచరీ పూర్తి చేసుకోగా, హెడ్‌ కూడా కొద్ది సేపటికే 150 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. తమ జోరు కొనసాగించిన హెడ్‌, స్మిత్‌ మొదటి 6 ఓవర్లలోనే 34 పరుగులు జోడించారు. దాంతో స్కోరు 361/3కి చేరింది. ఈ స్థితిలో భారత బౌలర్లు ఆసీస్‌ను నిలవరించగలిగారు. హెడ్‌ను అవుట్‌ చేసి భారీ భాగస్వామ్యాన్ని సిరాజ్‌ విడదీయగా, గ్రీన్‌ (6) విఫలమయ్యాడు. అప్పటి వరకు ఆత్మవిశ్వాసంతో ఆడిన స్మిత్‌ కూడా శార్దుల్‌ బౌలింగ్‌లో దూరంగా వెళుతున్న బంతిని స్టంప్స్‌పైకి ఆడుకున్నాడు. చివరి వరుస బ్యాటర్లూ చేతులెత్తేసినా... అలెక్స్‌ క్యారీ (69 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్‌) దూకుడైన బ్యాటింగ్‌ కారణంగా ఆసీస్‌ మెరుగైన స్కోరుతో ముగించగలిగింది. ఆస్ట్రేలియా 108 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోగా... సిరాజ్‌ టెస్టుల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. రెండో రోజు 36.3 ఓవర్లు ఆడిన ఆసీస్‌ 142 పరుగులు సాధించింది.

టపటపా...

భారత జట్టుకు ఓపెనర్ల నుంచి ఆశించిన ఆరంభం లభించలేదు. ఒకేస్కోరు వద్ద రోహిత్‌ (15), గిల్‌ (13) అవుట్‌ కావడంతో భారత్‌ కష్టాల్లో పడింది. కమిన్స్‌ అద్భుత బంతితో రోహిత్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా, బోలండ్‌ వేసిన బంతిని ఆడకుండా వదిలేసి గిల్‌ వెనుదిరిగాడు. ఆదుకుంటారనుకున్న పుజారా (14), కోహ్లి (14) కూడా విఫలమయ్యారు. పుజారా కూడా బంతిని వదిలేసి బౌల్డ్‌ కాగా, స్టార్క్‌ బౌన్సర్‌కు కోహ్లి స్లిప్‌లో క్యాచ్‌ ఇచ్చాడు. ఈ దశలో జడేజా, రహానే కలిసి జట్టును ఆదుకున్నారు. రహానే క్రీజ్‌లో నిలదొక్కునేందుకు పట్టుదల కనబర్చగా, జడేజా దూకుడుతో పరుగులు వేగంగా వచ్చాయి. 17 పరుగుల వద్ద కమిన్స్‌ బౌలింగ్‌లో రహానే ఎల్బీడబ్ల్యూ అయినా... అదృష్టవశాత్తూ అది నోబాల్‌ కావడంతో అతను బతికిపోయాడు. ఐదో వికెట్‌కు 71 పరుగులు జోడించిన అనంతరం జడేజాను లయన్‌ అవుట్‌ చేయడంతో ఆసీస్‌ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత వికెట్‌ పడకుండా రహానే, భరత్‌ మరో 21 బంతులు జాగ్రత్తగా ఆడారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌: వార్నర్‌ (సి) భరత్‌ (బి) శార్దుల్‌ 43; ఖ్వాజా (సి) భరత్‌ (బి) సిరాజ్‌ 0; లబుషేన్‌ (బి) షమీ 26; స్మిత్‌ (బి) శార్దుల్‌ 121; హెడ్‌ (సి) భరత్‌ (బి) సిరాజ్‌ 163; గ్రీన్‌ (సి) గిల్‌ (బి) షమీ 6; క్యారీ (ఎల్బీ) (బి) జడేజా 48; స్టార్క్‌ (రనౌట్‌) 5; కమిన్స్‌ (సి) రహానే (బి) సిరాజ్‌ 9; లయన్‌ (బి) సిరాజ్‌ 9; బోలండ్‌ (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 38; **మొత్తం (121.3 ఓవర్లలో ఆలౌట్‌) 469.** **వికెట్ల పతనం:** 1–2, 2–71, 3–76, 4–361, 5–376, 6–387, 7–402, 8–453, 9–468, 10–469. **బౌలింగ్‌:** షమీ 29–4–122–2, సిరాజ్‌ 28.3–4–108–4, ఉమేశ్‌ 23–5–77–0, శార్దుల్‌ 23–4–83–2, జడేజా 18–2–56–1.

భారత్‌ తొలి ఇన్నింగ్స్‌: రోహిత్‌ (ఎల్బీ) (బి) కమిన్స్‌ 15; గిల్‌ (బి) బోలండ్‌ 13; పుజారా (బి) గ్రీన్‌ 14; కోహ్లి (సి) స్మిత్‌ (బి) స్టార్క్‌ 14; రహానే (బ్యాటింగ్‌) 29; జడేజా (సి) స్మిత్‌ (బి) లయన్‌ 48; భరత్‌ (బ్యాటింగ్‌) 5; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (38 ఓవర్లలో 5 వికెట్లకు) 151.** **వికెట్ల పతనం:** 1–30, 2–30, 3–50, 4–71, 5–142. **బౌలింగ్‌:** స్టార్క్‌ 9–0–52–1, కమిన్స్‌ 9–2–36–1, బోలండ్‌ 11–4–29–1, గ్రీన్‌ 7–1–22–1, లయన్‌ 2–0–4–1.



ముకోవా

ఓటమి అంచుల నుంచి...

- ఫ్రెంచ్‌ ఓపెన్‌ ఫైనల్లో చెక్‌ రిపబ్లిక్‌ క్రీడాకారిణి కరోలినా ముకోవా
- సెమీస్‌లో రెండో సీడ్‌ సబలెంకాపై సంచలన విజయం

పారిస్‌: అందరి అంచనాలను తారుమారు చేసి చెక్‌ రిపబ్లిక్‌కు చెందిన అన్‌సీడెడ్‌ క్రీడాకారిణి కరోలినా ముకోవా ఫ్రెంచ్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌ తొలి సెమీఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్‌ ముకోవా 7–6 (7/5), 6–7 (5/7), 7–5తో ప్రపంచ రెండో ర్యాంకర్‌, రెండో సీడ్‌ సబలెంకా (బెలారస్‌)పై సంచలన విజయం సాధించింది. తన కెరీర్‌లో 17వ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ ఆడుతున్న 26 ఏళ్ల ముకోవా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీలో ఫైనల్‌ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సబలెంకాతో 3 గంటల 13 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్‌ పోరులో నిర్ణాయక మూడో సెట్‌లో ముకోవా 2–5 స్కోరు వద్ద తన సర్వీస్‌లో 30–40 పాయింట్ల వద్ద ఓటమి ముంగిట నిలిచింది. ఈ కీలక తరుణంలో ముకోవా ఫోర్‌హ్యాండ్‌ విన్నర్‌తో 40–40తో సమం చేసింది. అనంతరం సబలెంకా రెండు అనవసర తప్పిదాలు చేయడంతో ముకోవా తన సర్వీస్‌ను నిలబెట్టుకుంది. అనంతరం సబలెంకా సర్వీస్‌ను బ్రేక్‌ చేసి, మళ్లీ తన సర్వీస్‌ను కాపాడుకున్న ముకోవా స్కోరును 5–5తో సమం చేసింది. 11వ గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను మళ్లీ బ్రేక్‌ చేసిన ముకోవా 12వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని సెట్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని దక్కించుకుంది.

అల్‌కరాజ్‌ X జొకోవిచ్‌

పురుషుల సింగిల్స్‌ విభాగంలో నేడు సెమీఫైనల్స్‌ జరగనున్నాయి. తొలి సెమీఫైనల్లో టాప్‌ సీడ్‌, ప్రపంచ నంబర్‌వన్‌ అల్‌కరాజ్‌ (స్పెయిన్‌)తో మూడో సీడ్‌ జొకోవిచ్‌ (సెర్బియా) తలపడతాడు. అనంతరం రెండో సెమీఫైనల్లో 22వ సీడ్‌ జ్వెరెవ్‌ (జర్మనీ)తో నాలుగో సీడ్‌ కాస్పర్‌ రూడ్‌ (నార్వే) ఆడతాడు. సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రిక్వార్టర్‌ ఫైనల్లో శ్రీకాంత్‌ పరాజయం

సింగపూర్‌: సింగపూర్‌ ఓపెన్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–750 బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. గత ఏడాది మహిళల సింగిల్స్‌ విభాగంలో పీవీ సింధు చాంపియన్‌గా నిలిస్తే ... ఈసారి మాత్రం ఏ విభాగంలోనూ భారత క్రీడాకారులు ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ దాటలేకపోయారు. పురుషుల సింగిల్స్‌లో బరిలో నిలిచిన ప్రపంచ మాజీ నంబర్‌వన్‌ కిడాంబి శ్రీకాంత్‌, యువతార ప్రియాన్షు రజావత్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ఓటమి చవిచూశారు. గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో ప్రపంచ 23వ ర్యాంకర్‌ శ్రీకాంత్‌ 37 నిమిషాల్లో 15–21, 19–21తో 42వ ర్యాంకర్‌ చియా హావో లీ (చైనీస్‌ తైపీ) చేతిలో... ప్రపంచ 37వ ర్యాంకర్‌ ప్రియాన్షు 17–21, 16–21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్‌ కొడాయ్‌ నరోకా (జపాన్‌) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ధ్రువ్‌ కపిల–అర్జున్‌ (భారత్‌) జోడీ 15–21, 19–21తో బెన్‌ లేన్‌–సీన్‌ వెండీ (ఇంగ్లండ్‌) ద్వయం చేతిలో ఓడింది.

తెలంగాణ మంత్రి గంగులకు తప్పిన ప్రమాదం

- అదుపు తప్పిన మరపడవ
- కాపాడిన పోలీసులు

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ చెరువు వద్ద మంత్రి గంగుల కమలాకర్‌కు ప్రమాదం తప్పింది. ఊరూరా చెరువుల పండగలో భాగంగా గురువారం ఆసిఫ్‌నగర్ చెరువు వద్ద గల మైసమ్మ తల్లికి పూజలు నిర్వహించిన మంత్రి మర పడవలో కొంత దూరం ప్రయాణించాలని భావించారు. కానీ ఆయన కూర్చున్న మరపడవ ఆదిలోనే అదుపు తప్పడంతో మంత్రి నీళ్లలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మంత్రి గంగుల కమలాకర్‌కు చెరువు నుంచి బయటకు తీసుకొచ్చారు.

ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమి చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో ఫస్ట్‌ర్యాంకు, బైపీసీ విభాగంలో ఫస్ట్‌ర్యాంకుతో పాటు టాప్‌టెన్‌లో తొమ్మిది ర్యాంకులు (1, 1, 3, 4, 5, 5, 6, 7, 8) సాధించారని వివరించారు. 10 లోపు తొమ్మిదిమంది, 50 లోపు 37 మంది, 100 లోపు 69 మంది ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు.

జమ్మూలో 'శ్రీవారి ఆలయం'

మహా సంప్రోక్షణ

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని పెంచే శ్రీవారి ఆలయం: ప్రధాని మోదీ



జమ్మూలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమ దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ/తిరుపతి కల్చరల్/నెల్లూరు(దర్గామిట్ట)/తిరుమల: జమ్మూలోని మజీన్ గ్రామంలో తావి (సూర్యపుత్రి) నది ఒడ్డున టీటీడీ నిర్మించిన శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ, శ్రీవారి కళ్యాణం గురువారం ఆగమోక్తంగా జరిగింది. సుప్రభాతం అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 7 గంటల వరకు యాగశాలలో మహాపూర్ణాహుతి, కుంభప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 7.30 నుంచి 8.15 గంటల మధ్య మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ, కళావాహన నిర్వహించారు. ఈ క్రతువుల ద్వారా యాగశాలలోని కలశాలలో ఇమిడి ఉన్న దేవతాశక్తిని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి, శ్రీ గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాల్లోకి ఆవాహన చేశారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు. ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, కిషన్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ట్వీట్..

జమ్మూలోని శ్రీ వేంకటేశ్వర ఆలయం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని మరింతగా పెంచుతుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు. శ్రీ బాలాజీ ఆలయ నిర్మాణాన్ని భిన్నత్వంలో ఏకత్వ వేడుకగా కేంద్రమంత్రి జితేందర్ సింగ్ అభివర్ణించారు. జమ్మూలోని శ్రీవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ఏపీ సీఎం జగన్, టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హిందూ సనాతన ధర్మాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలనే లక్ష్యంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీవారి ఆలయాల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టామని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లూ నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు స్వామివారి హుండీలో భక్తులు రూ.3.24 కోట్లను వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఏపీ 'గురుకుల' ఫలితాల వెల్లడి

ఈ నెల 12 నుంచి 15 వరకు కౌన్సెలింగ్

సాక్షి,అమరావతి/గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం అధికారులు విడుదల చేశారు. ఈ సంస్థ పరిధిలో 38 పాఠశాలలు, 7 జూనియర్ కాలేజీలు, ఒక డిగ్రీ కళాశాల ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ఉన్న 3,195 సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న 356 ఖాళీల భర్తీకి, ఇంటర్‌లోని ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ/సీఈసీ విభాగాల్లో ఉన్న 1,149 సీట్లకు, డిగ్రీలోని బీఏ, బీకాం, బీఎస్సీలోని 4,852 సీట్లకు గత నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు. విద్యార్థుల ర్యాంకులను వారి మొబైల్ నంబర్లతో పాటు వారి పాఠశాలలకు కూడా పంపించామని, https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో కూడా ఉంచామన్నారు. మొత్తం అన్ని విభాగాల్లోను 87,252 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వివరించారు. వీరికి ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కాగా, 12 మైనార్టీ పాఠశాలలు, 3 జూనియర్ కాలేజీల్లో మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా నేరుగా అడ్మిషన్లు చేపడతామని చెప్పారు.


తొలి స్థానంలో నిలిచింది వీరే..

గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు 100 మార్కులకు, ఇంటర్, డిగ్రీ కాలేజీ ఎంట్రన్స్ టెస్ట్ 150 మార్కులకు నిర్వహించారు. వీరిలో అత్యధిక మార్కులు సాధించి తొలి స్థానంలో నిలిచిన అభ్యర్థుల పేర్లను గురుకుల విద్యాలయ సంస్థ వెల్లడించింది.

- ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో విజయనగరం జిల్లాకు చెందిన బి.దిలీప్ కృష్ణ 99 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆరో తరగతిలో పి.జితేంద్రకుమార్ (శ్రీకాకుళం జిల్లా), ఏడో తరగతిలో జీకే సాయిపవన్ (పశ్చిమ గోదావరి), ఎనిమిదో తరగతిలో కె.నవీన్ కుమార్ (కృష్ణా జిల్లా) మొదటి స్థానం సాధించారు.
- ఇంటర్ కేటగిరీలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె.సాయి సృజన (ఎంపీసీ) 146 మార్కులు, టీ సాహితి (బైపీసీ) 140 మార్కులు, విజయనగరం జిల్లాకు చెందిన కేవీ.వంశీకృష్ణ నాయుడు (ఎంఈసీ/సీఈసీ) 133 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు.
- డిగ్రీ విభాగంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.అచ్యుతరావు (బీఏ), విజయనగరం జిల్లాకు చెందిన ఎం.జ్ఞానతేజ (బీకాం), టి.పునీత్ కుమార్ (బీఎస్సీ-ఎంఎస్‌సీఎస్), పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎస్.తేజ (బీఎస్సీ-ఎంపీసీ) విభాగాల్లో మొదటి ర్యాంకులు సాధించారు.

విశ్వవిపణిలో మన సత్తా

- త్వరలో విదేశాలకు బెల్లం పొడి
- ఆ దిశగా ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల అడుగులు
- యూపీ, మహారాష్ట్రలకు దీటుగా ఉత్పత్తులు
- దేశంలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా గుర్తింపు
- మునగాకు రసం, తేనె, నిమ్మ రసం సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారీ





ఆర్‌ఏఆర్‌ఎస్‌లో తయారైన బెల్లం పొడి

సాక్షి, అనకాపల్లి: పంచదారతో పోలిస్తే బెల్లంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ఔషధ గుణాలకూ కొదవ ఉండదు. జీర్ణశక్తిని పెంచడం.. రక్తహీనతను తగ్గించడం వంటి సుగుణాలెన్నో బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. అలాంటి బెల్లం ఎగుమతుల్లో దేశంలోనే అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా అనకాపల్లికి గుర్తింపు ఉంది. యూపీ, మహారాష్ట్రలకు దీటుగా అనకాపల్లి బెల్లం ఎగుమతి అవుతోంది. ఉత్పత్తికి మించి అధికంగానే ఆర్డర్లు కూడా వస్తున్నాయి. అయితే బెల్లంతో పాటు బెల్లం పొడి, బెల్లం ఆధారిత ఉత్ప త్తులను మరింత పెంచే విధంగా ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే అంతర్రాష్ట్రాల వరకూ బెల్లం పొడిని ఎగుమతి చేస్తున్నా.. పూర్తి స్థాయిలో విదేశాలకు కూడా ఎగుమతి చేసే ఆలోచనలో ఆర్‌ఏఆర్‌ఎస్ ఉంది. బెల్లంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం కారణంగా నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. బెల్లం ఉత్పత్తులే ఎగుమతి అవుతున్నాయి గానీ బెల్లం విదేశాలకు ఎక్కువ స్థాయిలో ఎగుమతి కావడం లేదు. బెల్లంలో తేమ శాతాన్ని తగ్గించి దాని నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బెల్లంతో విలువ ఆధారిత ఇతర ఉత్పత్తుల తయారీని పెంచడం, వాటిని విదేశాలకు ఎక్కువ స్థాయిలో ఎగుమతి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. బెల్లంలో 12 నుంచి 13 శాతం వరకూ తేమ ఉండి.. నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. దాన్ని 3 శాతానికి తగ్గించి.. వాటికి అదనంగా మునగాకు రసం.. తేనె, నిమ్మ రసాలను సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారు చేస్తున్నారు. దీన్ని ఎక్కువ మోతాదులో తయారు చేసి విదేశాలకు బెల్లం పొడి, బెల్లం ఆధారిత ఉత్పత్తులను ఎగుమతి చేయడంపై అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందుకు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.3.5 కోట్ల నిధులతో ఇంక్యూబేషన్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.

బెల్లం ఉత్పత్తుల పెరుగుదలతో రైతులకు లాభం

వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఆధారిత ఉత్పత్తులు ఈ సెంటర్ ద్వారా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి కానున్నాయి. మూడు రకాల చెరకు, చిరుధాన్యాలు, పనసల ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన బెల్లం తయారీతో పాటు.. బెల్లం ఆధారిత ఉత్పత్తులు ఇక్కడి నుంచి దేశం నలుమూలలకు ఎగుమతి అవుతాయి. దీంతో చెరకుపై ఆధారపడి జీవించే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రస్తుతం తయారు చేస్తున్న బెల్లం ఆధారిత ఉత్పత్తుల్లో ఘన బెల్లం, పొడి బెల్లం, లిక్విడ్ బెల్లం, బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్సు బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, బెల్లం చాక్లెట్లు, బెల్లం పల్లీ చెక్కీలు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం అంతర్రాష్ట్ర స్థాయిలో ఎగుమతి అవుతున్నాయి.

బెల్లం పొడి ఉపయోగాలు..

- బలమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయ పడుతుంది.
- జీర్ణ సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది.
- ఎక్కువ కాలం పాటు శక్తిని అందిస్తుంది.
- ఎముకలు దృఢంగా ఉంటాయి
- కడుపు చికాకు నుంచి ఉపశమనం, తలనొప్పి నయం, జలుబు లక్షణాలను దూరం చేస్తుంది.

బెల్లంపొడికి విదేశాల్లో చక్కని డిమాండ్

గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఇతర లవణాలు, ప్రోటీన్ల వల్ల త్వరగా బూజు పట్టడం, నీరు కారటం వంటి కారణాల వల్ల బెల్లం నాణ్యత చెడిపోతుంది. దీనిని నివారించేందుకు అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం బెల్లాన్ని పొడి రూపంలో మార్చే సాంకేతికతను అభివృద్ధి చేసింది. బెల్లం పొడిని వివిధ రకాలుగా తయారు చేసి ఎగుమతులకు కృషి చేస్తోంది. తెల్ల బెల్లం పొడి, హెర్బల్ బెల్లం పొడి, మూలిక బెల్లం పొడి, ములగ బెల్లం పొడి, తేనె బెల్లం పొడి, నిమ్మ బెల్లం పొడి వంటి రకాలు కూడా ఉంటాయి. గోధుమ వర్ణంలో ఉండే బెల్లం పొడికి అమెరికా, ఫిలిప్పీన్స్, కొలంబియా, ఇండోనేషియా దేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో తయారయ్యే బెల్లం పొడి నాలుగు రకాలు మాత్రమే తయారు అవుతోంది.

రైతులకు మంచి రోజులు

బెల్లం పొడిని ఎక్కువగా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తే.. స్థానికంగా చెరకు సాగు పెరుగుతుంది. చెరకు రైతులకు మంచి రోజులు వస్తాయి. త్వరలో ఇంక్యుబేషన్ సెంటర్ కూడా నిర్మాణం అయితే.. ఇక్కడి నుంచి బెల్లం పొడి, బెల్లం ఉత్ప త్తి ఆధారిత పదార్థాలు కూడా ఇక్కడి నుంచే ఎగుమతి కానున్నాయి. వీటి కారణంగా ఆరోగ్యం కూడా పొందొచ్చు. ప్రధానంగా చెరకు ఆధారిత రైతులందరికీ ఇదొక శుభ వార్తగానే చెప్పొచ్చు.

– జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీ



సూక్ష్మ సేద్యం.. లాభాలు సాధ్యం

- రైతుల పొలాన్ని బట్టి 90 నుంచి 50 శాతం సబ్సిడీ
- బిందు, తుంపర సేద్య పరికరాలు అందజేతకు సన్నాహాలు
- ఆర్బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

సాక్షి, రాజమహేంద్రవరం: పంట సాగులో నీటి ఎద్దడిని సూక్ష్మ సేద్యం ద్వారా అరికట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునేలా బిందు, తుంపర సేద్య పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్) రైతులకు అందజేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. బహిరంగ విపణిలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకుండా.. ఆర్బీకేల ద్వారా నామ మాత్రపు రుసుము చెల్లిస్తే చాలు.. సబ్సిడీపై సరఫరా చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆర్బీకేల్లో ప్రారంభమైంది. మైక్రో ఇరిగేషన్ అధికారులు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

2023-24 లక్ష్యాలు ఇలా..

జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. వరితో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. సింహభాగం పంటలకు సాగునీటి వసతి ఉన్నా.. మెట్ట ప్రాంతంలో కొంచెం నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిందు, తుంపర సేద్య పరికరాల అవసరం ఉంది. అందుకే ఈ ఏడాది మూడు వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించాలని మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.17 కోట్లతో పరికరాలు అందజేసేందుకు సమాయత్తమవుతున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మైక్రో ఇరిగేషన్ కంపెనీలు పరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను 367 రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన మైక్రో ఇరిగేషన్ విభాగం అధికారులు అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి సర్వే చేస్తారు. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికే 2,193 మంది రైతులు 2,846 హెక్టార్లకు పరికరాలు కావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గతేడాది లక్ష్యానికి మించి

గతేడాది సూక్ష్మ సేద్యం ద్వారా 2వేల హెక్టార్లు సాగు చేయాలని నిర్దేశించుకోగా.. అంతకు మించి 2,941 హెక్టార్లలో సాగు చేసి 147.05 శాతం లక్ష్యాన్ని సాధించారు. 47 శాతం అదనంగా సాగు చేపట్టడం విశేషం. గత మూడేళ్లలో పథకానికి రూ.45 కోట్ల మేర వెచ్చించింది. 15,157 మంది రైతులకు సంబంధించి 21,030 హెక్టార్లు పథకంలో సాగు నదుపాయం, పరికరాలు అందజేసింది.

ఐదెకరాల్లోపు 90 శాతం రాయితీ

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఐదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు గరిష్టం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింప చేస్తారు. తుంపర సేద్యానికి ఎకరం నుంచి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాలపైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్ కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు. బిందు సేద్య పరికాలు ఉద్యాన పంటలకు ఇస్తారు.

అపరాలకు స్పింకర్లు

అపరాలు, గడ్డి పండించేకునే రైతులకు సబ్సిడీపై స్పింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం, ఆపై 45 శాతం సబ్సిడీతో అందజేయనున్నారు.

డ్రిప్ ఉపయోగాలు..

- పంటను బట్టి 30-70 % వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అందుతుంది. పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువుల సరఫరా చేస్తుండటంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏకకాలంలో పంట కోతకు వస్తుంది.
- 40% విద్యుత్ ఖర్చు ఆదా అవుతుంది. కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడ పీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తుపల్లాలు ఉన్న నేలలో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20నుంచి 30% పంట దిగుబడి పెరుగుతుంది.

రైతులు ఏం చేయాలంటే..

బిందు, తుంపర సేద్య పరికరాలు పొందాలనుకున్న రైతులు ఆధార్ కార్డు, మీ భూమి వన్‌బీ, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్ కాపీలు ఆర్‌బీకేల్లో ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి అర్హత ఉంటే మంజూరు చేస్తారు. రైతులకు విద్యుత్ సదుపాయం, బోరు తప్పనిసరిగా ఉండాలి.

సూక్ష్మ సేద్యంతో సత్ఫలితాలు

చిన్న, సన్నకారు రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. తక్కువ నీటితో పంటను పండించుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రభుత్వం వారి విస్తీర్ణాన్ని బట్టి 90, 50 శాతం సబ్సిడీపై అందజేస్తోంది. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గతేడాది సాగులో గణనీయమైన లాభాలు పొందారు. జిల్లాలో ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. 2,193 మందికి సంబంధించి 2,846 హెక్టార్లు రిజిస్ట్రేషన్ చేపట్టాం. మిగిలిన వారు సైతం రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలి. పథకాన్ని సత్వరమే ఉపయోగించుకోవాలి.

– కె.స్వాతి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

తమిళనాడు అటవీ అధికారులు రబ్బరు తూటాల వర్షం కురిపించడంతో ఏనుగులు కౌండిన్య ఎలిఫెంట్ శ్యాంక్చురీని దాటి గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇక్కడ పంటల రుచి చూసిన ఏనుగులు వాటి కోసం కొత్త మార్గాలు వెదుకుతున్నాయి. ఈ క్రమంలోనే ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, కందకాలను పూడ్చి పొలాల్లోకి చొరబడుతున్నాయి. ఇప్పటిదాకా ఏనుగులను చూడని ఆ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. మరోవైపు మొగిలి ఘాట్‌ను దాటి తిరుపతి జిల్లాలోకి ఏనుగులు వెళతున్నాయి.



తాజాగా కర్నాటక రాష్ట్రంలోని గ్రామాల వైపుకొచ్చిన ఏనుగులను తరముతున్న స్థానికులు

కంచె దాటించిన తూటాలు

- తమిళనాడులో రబ్బరు తూటాల వర్షం
- కౌండిన్యలో దారి తప్పుతున్న ఏనుగులు
- కర్ణాటక, తిరుపతిలోకి ప్రవేశించిన గజరాజులు

పలమనేరు: జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు గందరగోళానికి గురవుతున్నాయి. ఇప్పటిదాకా ఏనుగులకు సురక్షిత ప్రాంతంగా ఉన్న కౌండిన్య అడవిని దాటి బయటకొస్తున్నాయి. తమిళనాడులోని అటవీశాఖ ఏనుగుల కట్టడికోసం రబ్బరు బుల్లెట్లను వాడుతోంది. దీంతో బెదిరిపోతున్న ఏనుగులు ఇప్పటిదాకా సంచరించిన మార్గాలను వదిలి కొత్తమార్గాల్లోకి వెళుతున్నాయి. తాజాగా ఏనుగులు తోటకనుమ బీట్ మీదుగా కర్ణాటకలోని ముళబాగిలు తాలుకా గ్రామాల్లోకి వెళ్లి కలకలం సృష్టించాయి. ఇప్పటిదాకా ఏనుగులను చూడని ఆ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. మరోవైపు మొగిలి ఘాట్‌ను దాటి తిరుపతి జిల్లాలోకి ఏనుగులు వెళతున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఉండాల్సిన ఏనుగుల గుంపులు ఇప్పుడు దారి తప్పడంపై వాటిని ఎలా కట్టడి చేయాలో స్థానిక అటవీశాఖకు దిక్కు తోచడం లేదు. మరోవైపు కొత్తమార్గాల ద్వారా వచ్చే గజరాజులు ఎప్పుడు ఏ గ్రామంలోకి వస్తాయోనన్న భయంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమని కాలం వెళ్లదీస్తున్నారు.

అసలు సమస్య ఇది

పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఉంది. ఈ కౌండిన్య అభయారణ్యంలోనే స్థిరంగా గుంపులుగా సంచరించే ఏనుగులు 106 వరకూ ఉన్నాయి. ఇవన్నీ మూడు దశాబ్దాల క్రితం తమిళనాడు అడవుల నుంచి ఇక్కడికి వచ్చి చేరినవే. దీంతో అప్పటి ప్రభుత్వం 1984లో ఇక్కడ కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని ఏర్పాటు చేసింది. ఇందులోకి తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్‌నుంచి 16 వరకు ఏనుగులు కౌండిన్యలోకి వచ్చి వెళుతుంటాయి. కౌండిన్య పడమటి వైపునున్న కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హొసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు వస్తున్నాయి. మన రాష్ట్ర సరిహద్దు నుంచి ఇక్కడి ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగులను తమిళనాడుకు మళ్లిస్తే అక్కడి అటవీశాఖ వాటిని తిరిగి ఇక్కడికి మళ్లిస్తోంది. దీనికి తోడు ఏనుగులను బెదిరించేందుకు అవి మళ్లీ అక్కడికి వెళ్లకుండా రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరుపుతున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఏనుగులు భయంతో ఘీంకారాలు చేస్తూ ఎక్కడికి పోవాలో తెలియక కంచె దాటి కొత్త మార్గాల్లోకి వెళుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తూ అడ్డొచ్చిన జనంపై విరుచుకుపడుతున్నాయి. అడవిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బంగారుపాళెం మండలం నుంచి కుప్పం వరకు 130 కి.మీ మేర సోలార్ ఫెన్సింగ్‌ను, 40 కి.మీ మేర ట్రెంచిలను ఏర్పాటు చేసింది. అయితే ఏనుగులు ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, ట్రెంచిలను పూడ్చి మరీ అడవిని దాటి వస్తున్నాయి.

పంటల రుచి మరిగిన ఏనుగులు

అడవిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వీటికి మేత ఉంది. కౌండిన్య నదిలో నీరుండడంతో దాహానికి ఇబ్బంది లేదు. ఒక్కో ఏనుగుకు రోజుకు 900 లీటర్ల నీరు, 10 హెక్టార్లలో ఫీడింగ్ అవసరముంది. ఏనుగులు రోజుకు పదిమైళ్ల వరకు సంచరిస్తుంటాయి. అడవిలోని వెదురు, బెరడు వీటి ప్రధాన ఆహారం. కానీ అడవిని దాటి రైతుల పంటలైన చెరుకు, వరి, రాగి, అరటి, మామిడి, టమాటా లాంటి పంటలను రుచి చూసిన ఏనుగులు అడవి నుంచి తరచూ పంట పొలాల్లోకి మేతకోసం వచ్చేస్తున్నాయి.

రబ్బరు తూటాల వల్లే..

ఇప్పటిదాకా కౌండిన్యలోనే ఏనుగులుండేవి. కొత్త రుచులు మరిగిన కొన్ని గుంపులు పలమనేరు, కుప్పం రేంజిల్లో అడవిని దాటేవి. కానీ తమిళనాడు అటవీ అధికారులు ఏనుగులపై రబ్బర్ బుల్లెట్లతో కాల్చడంతో అవి బెదిరిపోయి భయంతో కొత్త మార్గాల్లోకి వెళుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని కట్టడి చేయడం ఎలిఫెంట్ ట్రాకర్లకు కష్టంగా మారింది.

– నయూమ్ అలీ, ఎఫ్‌ఆర్వో, పలమనేరు

కొత్తదారుల్లోకి వెళుతున్న వైనం

వారం రోజుల క్రితం కౌండిన్యలోని 16 ఏనుగుల గుంపు తోటకనుమ బీట్ మీదుగా కర్ణాటకాలోని ముళబాగిలు తాలూకా పరిధిలో సంచరించాయి. పలు పంటలను తొక్కి నాశనం చేశాయి. ఇప్పటిదాకా ఏనుగులను చూడని అక్కడి జనం హడలిపోయారు. వాటిని తరిమేందుకు బాణాసంచా పేల్చారు. పాతటైర్లను కాల్చి వాటిపైకి విసరడంతో ఆగ్రహం చెందిన ఏనుగులు జనంపైకి తిరగబడ్డాయి. ఇక కౌండిన్యకు తూర్పు వైపున్న ఏనుగులు మొగిలి ఘాట్‌ను దాటి బంగారుపాళెం, గుడిపాల, సోమల, చంద్రగిరి మీదుగా శేషాచలం అడవుల్లోకి వెళుతున్నాయి. కౌండిన్యలోని ఏనుగులు దారి తప్పడంతో అటు గజరాజులకు, ఇటు జీవజాలానికి ప్రాణగండం తప్పడం లేదు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943